
యతివర భావానందస్వామి కథామృతం
శ్రీగౌరీభట్ల రఘురామశాస్త్రిగారి
మూల రచనకు
శ్రీమల్లాది వెంకటకృష్ణమూర్తి
నవలారూపం
దర్శనమ్
ఆధ్యాత్మిక వారామాసపత్రిక
SunilArt




## యతివర భావానంద

# కథామృతము

**ఓం దక్షిణామూర్తి సమారంభాం శంకరాచార్య మధ్యమాం ।**
**అస్మదాచార్య పర్యాంతం వందే గురు పరంపరాం ॥**

**ప్రవేశిక :**

హైదరాబాద్‌కి గంటన్నర ప్రయాణ దూరంలో ఉన్న మరుకూకు గ్రామ శివార్లలోని శ్రీ పాండురంగాశ్రమం గురించి చాలామందికి తెలుసు. సికింద్రాబాద్ నుంచి నిత్యం ఉదయం ఈ ఆశ్రమానికి సిటీబస్సులు నడుస్తుంటాయి. తెలంగాణలోని కరీంనగర్, వరంగల్, హైదరాబాద్, నల్గొండ, రంగారెడ్డి, మెదక్ జిల్లాలకు చెందిన భక్తులు దాదాపు 75 ఏళ్ల క్రితం స్థాపించిన శ్రీ పాండురంగ ఆశ్రమాన్ని తరచూ దర్శిస్తూంటారు. ముఖ్యంగా ఆషాఢ మాసంలోని తొలి ఏకాదశినాడు ఆశ్రమానికి పాతిక వేల మందిదాకా భక్తులు వచ్చి ఉపవాసం ఉండి రాత్రంతా హరి నామస్మరణ చేస్తూ జాగరణ చేస్తారు. మర్నాడు ద్వాదశినాడు వారందరికీ అన్న సంతర్పణ జరుగుతుంది. ఈ పాండురంగ ఆశ్రమాన్ని స్థాపించింది శ్రీ యతివర భావానందస్వామి. మహారాష్ట్రలోని పండరీపురం నుంచి స్వామివారు భక్తులతో కలిసి కాలి నడకన పాండురంగడి విగ్రహాలను తీసుకువచ్చి ఆశ్రమంలోని ఆలయంలో ప్రతిష్ఠించడం విశేషం. తెలంగాణ ప్రజలని భక్తిపరంగా చైతన్యవంతులని చేయడానికి అవతరించిన తొలి స్వామి భావానందస్వామి అంటే అతిశయోక్తి లేదు. 'నిరంతర హరినామస్మరణ,

నిత్యాన్నదానం' ఈ ఆశ్రమ ప్రాథమిక లక్ష్యాలు. వీటికి 'నాదం-సాదం' అనే ముద్దుపేరుని స్వామి పెట్టారు. ఆ ఆశ్రమంలో 365 రోజులూ అన్నదానం, హరినామ సంకీర్తన జరుగుతూనే ఉంటాయి. తెలంగాణ ప్రజలను ఉద్ధరించడానికి పుట్టిన ఆ మహాత్ముడు శ్రీ భావానందస్వామి జీవిత చరిత్రని ప్రతి నెల చదువుకుని తరిద్దాం.

## పుట్టుక-విద్యాభ్యాసం :

150 ఏళ్ల క్రితం సంగతి. గజ్వేల్ తాలూకాలోని వరగల్లు అనే చిన్న గ్రామంలో తిమ్మయ్య అనే బ్రాహ్మణ శివభక్తుడు ఉండేవాడు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం శివానుష్ఠానం, సహస్ర గాయత్రి మంత్రం చేసేవాడు. ఎనిమిది గంటలపాటు పదకొండువేల శివ పంచాక్షరీ జపాన్ని కూడా చేసేవాడు. నిత్యం ఆధ్యాత్మ రామా యణాన్ని పారాయణం చేయకుండా ఆయన ముద్దముట్టేవాడు కాడు. ఇదంతా మడిబట్టతో సాగాల్సిందే. రోజుకి రెండు గంటలు మాత్రం ఆయన మడిని వదిలేవాడు.

శివుడి మీద ఎంత భక్తి, ప్రీతి అంటే పిల్లలకి ఏదైనా జబ్బుచేస్తే శివునికి పూజచేసిన భస్మాన్ని ముందుగా నోట్లో వేసి ఆ భస్మాన్ని వారి ఒంటికి పట్టించేవాడు. అంతే తప్ప జీవితకాలంలో ఆయన పిల్లలకి కాని, తనకి కాని ఏ మందూ వాడి ఎరుగడు. శివభక్తుడు కాబట్టి లేత బిల్వదళం లేకుండా ఆయనకి ఒక్క పూట కూడా గడిచేది కాదు.

గ్రామస్తులు పెళ్లిళ్లకి, అన్ని ఇతర శుభకార్యాలకి తిమ్మయ్యనే పురోహితు డుగా పిలిచేవారు. ఓ రోజు గ్రామాధికారి కొడుకు పెళ్లి చేయించడానికి వాళ్లతో కలిసి వెళుతుండగా, అంతా మధ్యలో ఓ చోట బస చేశారు. తిమ్మయ్య బిల్వ దళాలని తెచ్చిపెట్టమని కొందరిని కోరాడు. వారు సమీపంలోని అడవిలోకి వెళ్లి గాలించినా ఒక్క బిల్వ వృక్షం కూడా కనపడలేదు. ఉత్త చేతులతో తిరిగి రావలసి వచ్చింది. బిల్వ దళంతో శివార్చన చేయకుండా తిమ్మయ్య భోజనం చేసి ఎరుగడు. ఆయన తినకపోతే ఆయన మీద గౌరవంతో మిగిలినవారు పిల్లలతో సహా ఎవరూ తినరు. తిమ్మయ్య వాళ్లను తినమని చెప్పినా, ఆయన తినకుండా

వారిలో ఎవరూ తినడానికి సమ్మతించలేదు. దాంతో తిమ్మయ్య తను నిత్యం పూజించే పార్థివ లింగానికి భస్మార్చన చేసి మనసులో ఇలా ప్రార్థించాడు.

"స్వామీ! నిన్ను బిల్వదళాలతో పూజించి కానీ నేను భోజనం చేయను. నేను తినకుండా నా వెంట ఉన్నవారెవరూ అన్నం ముట్టరు. వీరిని అభోజనంగా ఉంచిన పాపం నాకు కలుగు తోంది కదా! ఏమి దారి! నువ్వే ఆలోచించు."

అకస్మాత్తుగా తిమ్మయ్యకి తాము విడిది చేసినచోట భూమి మీద పక్కనే ఉన్న చిన్న బిల్వ మొక్క కనిపించింది. సంతోషంతో తిమ్మయ్య దానికున్న మూడు ఆకుల దళాన్ని ఒకటి కోసి శివుడికి అర్పించి పూజ ముగించాక భోజనానికి కూర్చున్నాడు. సాయంత్రం పూజ కోసం మళ్లీ బిల్వ దళాలకై ఆ చెట్టు కోసం చూస్తే లేదు. దాని కోసం ఎంత వెదికినా అది ఎక్కడా కనిపించలేదు!

మరో సందర్భంలో తన కొడుకు వివాహాన్ని ఆ రోజు నుంచి ఎనిమిది రోజుల తరువాత జరిగేలా నిర్ణయించాడు.

"అదేమిటీ! మన దగ్గర వెంటనే పిల్లవాడికి పెళ్లి చేసేంత డబ్బు లేదుగా!" సంగతి తెలియగానే అడిగింది అతని భార్య.

"పిచ్చిదానా! మన సంకల్పం మేరకే అంతా మనం చేస్తున్నామనే ఇంకా అనుకుంటున్నావా! జరిగేది ఆ శివుడి సంకల్పం తప్ప మనది కాదు. వెండికొండ మీద నివసించే ఆయనే మనల్ని ఆదుకుంటాడు. చూస్తూండు" జవాబు చెప్పాడు తిమ్మయ్య.

ఆయన చెప్పినట్లుగానే సమయానికి తగిన డబ్బు లభించి పెళ్లి సక్రమంగా జరిగిపోయింది.

తిమ్మయ్యకి ఇద్దరు కొడుకులు. రామయ్య, వెంకయ్య. చిన్నవాడైన వెంకయ్య కూడా భగవద్భక్తుడు. నిత్యం భగవద్గీతని సంపూర్ణంగా పారాయణం చేసేవాడు. తండ్రిలా శివభక్తుడు. శత్రువనే వారే లేని ధన్యజీవి వెంకయ్య. ఇతనికి వివాహం అయినా చాలాకాలం దాకా పిల్లలు కలగలేదు. దాంతో వరగల్లులోని కొండమీది స్వయంభూ అయిన శంభుదేవుడి గుడికి భార్యతో కలిసి వెళ్లి భక్తిగా సంతానం కోసం పూజించేవాడు. అంతేగాక సమీపంలో గల ఓ గుహలో కూర్చుని తపస్సు

కూడా చేశాడు. వెంకయ్య భార్య కూడా సంతానాన్ని కోరి భక్తిగా తులసి పూజ చేసేది. ఓ రోజు ఆశ్చర్యంగా ఆ గుళ్లోని కుండం పక్కనే చెట్టే లేకపోయినా ఓ మామడి పండు దంపతులకు కనిపించింది. దాన్ని ఆయన తన భార్యకు ఇచ్చి సంతోషంగా చెప్పాడు.

"ఇదిగో! ఇది శంభుదేవుడు అనుగ్రహించిన పండు. ఇది తింటే నువ్వు గర్భవతివి అవుతావని నాకు తోస్తోంది."

ఆమె దానిని భక్తిగా కళ్లకు అద్దుకుని తిన్నది. కొద్దికాలంలోనే నెల తప్పింది. వారికి ఓ కొడుకు పుట్టాడు. వెంకయ్య తనకు సంతానాన్ని ప్రసాదించిన శంభుదేవుడి మీద భక్తి గౌరవాలతో కొడుక్కు 'శంభుదేవుడు' అనే పేరు పెట్టాడు. ఇతను కూడా మంచి భక్తిపరుడు అయ్యాడు. తాతలాగే నిత్యం 11 వేల శివ పంచాక్షరీ జపాన్ని చేయడమే కాక, తాతయ్యలా ఆధ్యాత్మిక రామాయణాన్ని కూడా పారాయణం చేసేవాడు. జపానికి జపమాలను ఉపయోగించక చేతివేళ్ల కణుపుల మీదే లెక్క పెట్టుకునేవాడు.

శంభుదేవునికి యుక్తవయస్సు వచ్చాక వెంకయ్య రత్నమాంబతో అతని వివాహాన్ని జరిపించాడు. రత్నమాంబకి ఓ రోజు ఓ కల వచ్చింది. ఓ దివ్యపురుషుడు మామిడిపళ్ల గంపతో దర్శనం ఇచ్చి 'వీటన్నింటినీ నువ్వే తిను, ఇంకెవ్వరికీ ఇవ్వక' అని చెప్పి మాయం అయ్యాడు. మెలకువ రాగానే తన భర్తకి ఈ స్వప్న వృత్తాంతాన్ని రత్నమాంబ చెప్పింది. ఆ నెల్లోనే రత్నమాంబ నెల తప్పింది. గర్భవతి అయిన రత్నమాంబ తన నిత్యపూజను వదలలేదు. నెలలు నిండాక 1899 అక్టోబర్ నెలలో ఓ గురువారం పగలు మేష లగ్నంలో ఆ దంపతులకి ఓ కొడుకు పుట్టాడు. అతనే మహాత్ముడైన యతివర భావానందస్వామిగా పరిణితి చెందాడు.

పసివాడి ఛాతీకి ఎడమపక్క అరచేయంత పుట్టుమచ్చ ఉండేది. ఆనాటి ఆచారం ప్రకారం అతని జాతక చక్రం వేయించి పరిశీలిస్తే సన్యాసి అయ్యే యోగాన్నిచ్చే నాలుగు గ్రహాలు ఓ గడిలో ఉన్నాయి. అంతేకాక దీర్ఘాయుష్షు, ఆరోగ్యం బ్రహ్మసాయుజ్య యోగాలు కూడా జాతకంలో కనిపించాయి.

శంభుదేవుడు తన కొడుక్కి ఇరవై ఒకటో రోజు బారసాల చేసి సత్యనారాయణ అనే పేరు పెట్టాడు. సత్యనారాయణ పుట్టినప్పుడు వరగల్లులోని ప్రజలు పూర్తిగా ఐహిక జీవితాలనే గడుపుతున్నారు. భక్తిగలవారు పూర్తిగా తగ్గిపోయారు. ఐహిక సంపదలకిచ్చే గౌరవం దేవుడికిచ్చేవారు కాదు. మ్లేచ్ఛులు పరిపాలించే తెలంగాణ అంతటా ఆ రోజుల్లోని ప్రజలంతా వరగల్లు ప్రజల్లాగే భక్తిరహితంగా జీవించేవారు.

సత్యనారాయణకి మూడో ఏడు రాగానే శంభుదేవుడు తన కుటుంబాన్ని వరగల్లు నుంచి మరుకూకు అనే గ్రామానికి మార్చాడు. 1902లో ఓ రోజు మంచి మాంత్రికుడిగా ప్రసిద్ధి చెందిన ఒకతను వీరి ఇంటికి రావడం తటస్థించింది. సత్యనారాయణ ఛాతీమీద ఉన్న పుట్టుమచ్చని చూసి అతను ఈశ్వరాంశ సంభూతుడని, సామాన్యుడు కాడని చెప్పాడు. అప్పటికే రత్నమాంబకి ఈ విషయం కొంతదాకా తెలుసు. మామూలు లాలిపాటలు పాడితే సత్యనారాయణ ఏడుస్తుం దేవాడు. కృష్ణలాలి, లేదా రామలాలి వంటి భగవన్నామాలు గల పాటలను పాడితే ఏడవకుండా నిద్రపోయేవాడు. రంగురంగుల ఆట వస్తువులను ముందు పరిస్తే వాటితో ఆడుకోకుండా తోసేసేవాడు.

ఐదవ ఏట సత్యనారాయణకి అక్షరాభ్యాసం చేశారు. ఏడాదిపాటు బడికి వెళ్లాడు. కానీ విద్య నేర్చుకోవడం మీద పెద్దగా ఆసక్తి చూపించేవాడు కాదు. పెద్దల భయంతోనే బడికి వెళ్లేవాడు. ఓసారి బడి నుంచి ఇంటికి తిరిగి వస్తుంటే ఈనిన ఓ ఆవు వచ్చి తన కొమ్ములతో సత్యనారాయణని ఎత్తి కింద పడవేసింది. భయంతో కదలకుండా పడివున్న అతన్ని సాటి విద్యార్థులు ఇంటికి ఎత్తుకుని తీసుకువెళ్లారు. తండ్రి శంభుదేవుడు ఆ రోజు నుంచి సత్యనారాయణని బడికి పంపడం మానేశాడు. మామూలు ఆటలు ఆడకుండా సత్యనారాయణ... రాముడు, కృష్ణుడు, ఆంజనేయుడు, అమ్మవారు మొదలైన దేవుళ్ల బొమ్మలతో ఆడేవాడు. అసలు బొమ్మలు గీయడం నేర్చుకోకుండానే ఆ దేవతామూర్తుల బొమ్మలని చక్కగా గీసేవాడు. ఇంటి వెనక తులసిచెట్లని నాటి, చిన్న గుడిసెలను వేసి 'ఇది ఆశ్రమం, ఇది గుడి' అని పేర్లు పెట్టేవాడు. సాటి పిల్లలతో ఆటలాడడం మీద సత్యనారాయణకి ఉత్సాహం ఉండేది కాదు. ఓసారి శంభుదేవుడు తన కుటుంబంతో వరగల్లుకి వెళ్లాడు. ఊళ్లోని తోటి పిల్లలతో ఆడుకోకుండా

సత్యనారాయణ ఒంటరిగా కొండమీది శంభుదేవుని గుడికి వెళ్లి పూలతో స్వామిని పూజించాడు.

ఏడోయేడు రాకుండానే ప్లవంగ నామ సంవత్సరంలో 1906 మే నెలలో సత్యనారాయణకి ఉపనయనం చేశారు. తండ్రి అతనికి బ్రహ్మోపదేశం చేయడంతో సత్యనారాయణ బ్రహ్మచర్యాశ్రమంలోకి ప్రవేశించాడు. ఆ రోజు నుంచి నిత్యం సంధ్యావందనం గాయత్రి మంత్రజపం చేయసాగాడు.

ఎనిమిదో యేట ఓసారి శంభుదేవుడు తన భార్య రత్నమాంబ ఎసర్లో బియ్యం పోయడం చూసి చెప్పాడు.

“బియ్యం అంత ఎక్కువ పోయక. ఇంట్లో ఎంతమంది ఉన్నారో చూసుకుని వంటచెయ్యి తప్ప అన్నం మిగల నీయకు.”

అది విన్న సత్యనారాయణ వెంటనే తల్లితో చెప్పాడు.

“అమ్మా! అన్నం మిగలకుండా వండితే సంసారం బాగవు తుందా? ఈ ప్రపంచంలో ఎన్ని కోట్ల సంసారాలు లేవు? అలాంటి ఈ ప్రపంచాన్ని సృష్టించింది మానవుడు కాదుకదా! ఈశ్వరుడేగా దీన్ని సృష్టించింది. ఈ సంసారాలనన్నింటినీ కాపాడే జగద్రక్షకుడు ఉండగా, సంసారం కోసం మనం ఇంతగా దేనికి తాపత్రయపడడం? ఎవరికైనా పిడికెడు అన్నం పెట్టడానికి మిగలకుండా వండడం దేనికి?”

తొమ్మిదో ఏడు రాగానే సత్యనారాయణని మామదాల గ్రామంలో వైదిక విద్య నేర్చుకోవడానికి రామచంద్రయ్య అనే గురువు దగ్గర చేర్పించారు. రెండేళ్లలో షోడశ సంస్కార విద్యనంతటినీ సత్యనారాయణ గురుముఖతః నేర్చుకున్నాడు. సత్యనారాయణ గాత్రం బాగుండేది. చక్కగా భగవంతుడి మీద కీర్తనలు గానం చేస్తే అంతా విని ఆనందించేవారు. ముఖ్యంగా ‘ననుగన్న తల్లీ, యో నలువరాణి, నా మాటయలరింపవే మంజువాణి’ అనే కీర్తనని రామచంద్రయ్య గారు విని ఆనందించేవారు. ఈ శిష్యుడి మీద ఆయనకి ఎంతటి వాత్స ల్యం కలిగిందంటే తన కూతురు యశోదాదేవిని సత్యనారా యణకిచ్చి తన అల్లుడుగా చేసుకున్నాడు.

ఆనంద నామ సంవత్సరం మాఘశుద్ధ ద్వితీయం నాడు 1915 మార్చిలో సత్యనారాయణకి 16వ యేట వివాహం జరిగింది.

ఓసారి సత్యనారాయణ, తన తల్లిదండ్రులు, పినతండ్రులతో కాశీయాత్ర చేశాడు. అక్కడ శ్రాద్ధకర్మలు, తీర్థస్నానాలు అయ్యాక సత్యనారాయణ వంక వాత్సల్యంగా చూస్తూ పిన తండ్రి అడిగాడు.

“నారప్పా! నాకో పద్యాన్ని ఆశువుగా చెప్పగలవా?”

అంతకుమునుపు కవిత్వంలో ప్రవేశం లేకపోయినా సత్యనారాయణ అందుకు ఒప్పుకుంటూ అడిగాడు.

**“అలాగే ప్రయత్నిస్తాను. దేనిమీద పద్యం చెప్పమంటావు?”**

**“అదిగో ఆ చెట్టుమీదగల గరుడపక్షిమీద చెప్పు”** కోరా డాయన.

వెంటనే సత్యనారాయణ ఈ పద్యాన్ని తడుముకోకుండా చెప్పాడు.

ఉ॥ **కుంకుమబోలు పక్షములు కుత్తుక చంద్రుని మాడ్కి తెల్లనౌ**
**వంకయుగల్గు నాసికయు వామనయంచు గళధ్వనుల్ గదా**
**బింకములాడు సర్పములు భీతిల పొట్టలను జీల్చు ధీరుశ్రీ**
**పంకజనాభ వాహనుని ప్రస్తుతిజేసెద విస్తరంబుగన్**

❖ ❖ ❖

ప్రపంచంలోని అత్యధిక సంఖ్యాకులు సుఖాలని కోరుకుంటారు. వాటి వెంట పడతారు. అదేవిధంగా సత్యనారాయణ కూడా కొంతకాలం తల వెంట్రులకి చక్కగా వాసన నూనె రాసి పెంచుకున్నాడు. తెల్లటి చొక్కాలు వేసుకుని సువాసనా తైలాలతో తిరిగే తన కొడుకుని చూసి ఓసారి శంభుదేవుడు చెప్పాడు.

“ఇంత జుట్టు దేనికిరా? క్షవరం చేయించుకో”

అయినా సత్యనారాయణ క్షురకుణ్ణి పిలవలేదు. క్షవరం చేయించుకోలేదు. ఇతని వేషం తల్లి రత్నమాంబకి బాగుండేది. తండ్రి చాలాసార్లు చెప్పాక సత్యనారాయణ పొరుగూరికి పనిమీద వెళ్లినప్పుడే తీరిక వేళలో ఈ ఆలోచన చేశాడు.

'జుట్టు కోసం తండ్రి దయని కోల్పోవడం దేనికి? ఎంతో డబ్బు ఖర్చుచేసి విశ్వనాథతైలం, భూతనాథతైలం లాంటి ఎన్నో సువాసన నూనెలని తెచ్చి రాసుకుంటూ తలకి స్నానం చేస్తే జుట్టు రాలిపోతుందని భయపడడం ఏమిటి? జుట్టు రూపంలో విలాసవంతమైన భోగం నన్ను పీల్చిపిప్పిచేసి చివరికి ఆ భోగం కూడా నశించి, దాన్ని ఆశ్రయించిన నన్ను కూడా నశింపజేసేస్తుంది కదా! భోగాల వెంట పడితే అవి ఏడిపిస్తాయే కానీ నిజమైన సంతోషాన్ని ఒక్కరోజు కూడా ఇవ్వవు కదా!'

భోగాల పరిస్థితి అలా ఆకళింపు చేసుకున్నాక అతనికి తన జుట్టుమీద ఉన్న మోజు తీరిపోయింది. తక్షణం చిన్న పిలకని మాత్రం ఉంచుకుని మిగతా జుట్టంతా తీయించేసుకుని గుండు చేయించుకున్నాడు. ముతక చొక్కాని తొడుక్కుని భుజాన ఓ కంబళిని కప్పుకుని ఇంటికి చేరాడు.

బతకమ్మ ఆట ఆడే రత్నమాంబ అతన్ని చూసి గుర్తుపట్టగానే తన కొడుకు అందమైన తల వెంట్రుకలని తీసివేసినందుకు భోరున ఏడుస్తూ ఇంటికి వెళ్లింది. ఆ జుట్టుతో పాటుగా చిత్రంగా సత్యనారాయణలో భోగాల మీద ఆసక్తి కూడా పోయింది. అతనిలో పూర్వజన్మ సంస్కారాలు విచ్చుకుని క్రమంగా వైరాగ్య భావాలు ఏర్పడి అవి బలపడసాగాయి. తరచూ సత్యనారాయణ సాటివారికి వైరాగ్యాన్ని బోధించ సాగాడు. ప్రాపంచిక సుఖాలన్నీ తాత్కాలికమైనవని, నేడు ముద్దొచ్చే పసిబాలుడే, రేపు దేహం జీర్ణించి ముడతలు పడ్డ శరీరంతో కాటికి వెళ్లే ముసలివాడని, ఈశ్వరుడు తప్ప మిగిలిన దంతా మిథ్య అని ఉపన్యసించేవాడు. ఈ సంగతి తండ్రి దృష్టికి వచ్చింది. భార్యతో కాపురం చేయాల్సిన వయసులో ఈ వైరా గ్యం ఆయనకు నచ్చలేదు. కొడుకుని పిలిచి ఇవన్నీ మాను కోమని గట్టిగా అనేకమార్లు మందలించాడు. కానీ సత్యనారా యణ ఉపన్యాసాలను కొనసాగిస్తూ ఈశ్వర చింతనతో కాలం గడపసాగాడు. నిత్యం ఆధ్యాత్మ రామాయణ పారాయణం చేస్తూ దైవ భక్తికి ప్రాధాన్యతనిచ్చి జీవించసాగాడు.

శంభుదేవుడు తన గ్రామాధికారిని కలిసి చెప్పాడు.

“మావాడి తీరు చూస్తున్నారుగా? మీరంటే వాడికి గౌరవం. కాబట్టి దయచేసి ఇది వైరాగ్య వయసు కాదని, ఈ ఉప న్యాసాలు మానమని వాడితో చెప్పండి. వాడు మీ మాట వినచ్చనిపిస్తోంది నాకు.”

ఆయన ఆ పనిచేసినా సత్యనారాయణలో ఎలాంటి మార్పూ లేదు. అంతేగాక అతను దేవతారాధనని, భజనని ఇంకా ఎక్కువగా చేశాడు. అకస్మాత్తుగా సత్యనారాయణకి కడుపులో శూల వ్యాధి వచ్చింది. శూలనొప్పి పెరిగేకొద్దీ ‘ప్రారబ్ధకర్మ క్షయా నికే కాక తను భగవంతుణ్ణి మరువకుండా ఉండడానికి కూడా ఆ ఈశ్వరుడే ఈ వ్యాధిని తనకు కలిగించాడని’ సత్యనారాయణ సంతోషించసాగాడు. మిగిలిన గ్రామస్తులలా లోకాభిరామాయ ణం మాట్లాడకుండా భగవన్నామస్మరణ చేయడమో లేదా ఆసక్తిగలవారికి భోగాలు అల్పమైన అశాశ్వతాలని వైరాగ్యం భగవద్భక్తే మనల్ని ఉద్ధరించేవని బోధించసాగాడు.

“నీటిలోని తాబేలుని చూసి రాయి అనుకుని దానిమీద నిలబడి నీరు తాగే ప్రయత్నం చేస్తే తాబేలు కదిలి వాడుకూడా ఎలా నీళ్లలో కలిసిపోతాడో అలా నువ్వు భోగాలని ఆశ్రయిస్తే అవి నశించిపోయి వాటిని ఆశ్రయించిన నువ్వు కూడా నశించిపోతావు. ఏ భోగం ఏ సుఖం ఈ లోకంలో శాశ్వతమో నాకు చూపించండి.”

ఆ గ్రామాధికారితో సహా ప్రతివారు సత్యనారాయణ చెప్పే మాటల్లోని వాస్తవాన్ని గుర్తించసాగారు. దాంతో అతను చెప్పేది వినే శ్రోతల సంఖ్య క్రమంగా పెరగసాగింది. గ్రామం బయట ఉన్న శివాలయానికి వెళ్లి భక్తి పొంగిపొర్లడంతో అతను విపరీతంగా భగవత్ వియోగంతో దుఃఖించసాగాడు.

❖ ❖ ❖



ఓసారి తన తల్లితండ్రులతో కలిసి సత్యనారాయణ రామేశ్వరం తీర్థయాత్రకి వెళ్లాడు. అక్కడ రామతీర్థం, లక్ష్మణ తీర్థం, హను మత్తీర్థం, గంధమాదన తీర్థం, ఇలా ఇంకా అనేక తీర్థాలు న్నాయి. ముందు లక్ష్మణ తీర్థంలో స్నానం చేసి తర్వాత రామ తీర్థంలో స్నానం చేయాలి అనే నియమం ఉంది. ఆ ప్రకారం సత్యనారాయణ ముందు లక్ష్మణతీర్థంలో స్నానం చేయడానికి వెళ్లాడు. లక్ష్మణుడ్ని చూడాలన్న తీవ్రమైన కోరిక కలగడంతో సత్యనారాయణ లక్ష్మణుడి కోసం విలపించ సాగాడు. రామ తీర్థం చేరుకున్నాక అక్కడ సీతారామలక్ష్మణ హనుమం తుల విగ్రహాన్ని చూసి 'స్వామీ! ఇక్కడ వున్నారా?' అంటూ ఆ మూర్తులని నిమిరి వారికి అభిషేకం చేసాడు.

తండ్రి ఓ రోజు సత్యనారాయణని పిలిచి బాలామంత్రాన్ని ఉపదేశించి చెప్పాడు.

"నాయినా! ఒకడు బాలా మంత్రాన్ని జపించాడు. సింహవా హనయై సాక్షాత్కరించిన శ్రీదేవిని చూసి భయపడి పిచ్చివాడయ్యా డు. కాబట్టి జాగ్రత్త."

కాని సత్యనారాయణ త్వరలోనే లక్ష జపాన్ని చేసేసాడు. లోకేశ్వరిని చూడాలన్న కోరిక సత్యనారాయ ణలో మొదలై తీవ్రంగా మారింది. అతనికి మైకం కమ్మినలాంటి ఓ విచిత్ర స్థితి ఏర్ప డింది. ఆ స్థితిలో సముద్ర మధ్యంలోని ఓ తోటలో వున్న సింహాసనం మీద కూర్చుని వున్న జగజ్జనని సత్యనారాయణకి దర్శనం ఇచ్చింది. కోరి, కానడరాగంలో ఓ పద్యాన్ని పాడిం చుకుంది. ఆ




తర్వాత కొద్ది రోజులకి సత్యనారాయణ వేరే గ్రామానికి వెళ్లినప్పుడు ఓ వైశ్యుల ఇంట్లో బస దొరికింది. ఇంటి వెనక స్నానం చేసి ధ్యానం చేసుకున్నాడు. అది చూసి ఆవైశ్యుడు తన భార్యకి దయ్యం పట్టి పీడిస్తోందని, నయం చేసి తనని ఆదుకొమ్మని ప్రార్థించాడు.

"నేను మాంత్రికుణ్ణి కాను. ఐనా ప్రయత్నిస్తాను." సత్య నారాయణ బదులు చెప్పాడు.

అతను బాలామంత్రాన్ని ఓ కాగితం మీద రాసి శ్రీదేవిని ఆమెకి గ్రహబాధని తొలగించమని ప్రార్థించి, ఆ బాలా మంత్రం కాగి తాన్ని తావీజుగా వైశ్యుడి భార్యకి కట్టగానే దయ్యం వదిలింది. ఈ సంగతి తెలిసిన శంభు దేవుడు తన కొడుకుని, అలాంటివి చేయవద్దని వారించాడు. ఆ తర్వాత మళ్లీ అతను ఎవరి గ్రహ రోగాలకి ఉపశమనం చేయలేదు.

సత్యనారాయణకి ఇద్దరు భృత్యులు ఏర్పడ్డారు. వారిద్దరూ అత్యంత శ్రద్ధతో సత్యనారాయణ పనులని చేసిపెట్టసాగారు. సత్యనారాయణ సంరక్షణని వారిద్దరూ తమ బాధ్యతగా చేసు కున్నారు. భజనలు, ఇతర ఆరాధనలలో పాల్గొనేవారు. వారిలో ఒకరు సిద్ధ శివయ్య, మరొకరు ఈశ్వరయ్య. ఓ రాత్రి పదింటికి సత్యనారాయణ శివయ్యతో వాసాలమర్రి గ్రామస్థుడు తన పుస్త కం తీసుకుని తెచ్చిస్తానని చెప్పి అంతదాకా తిరిగి ఇవ్వలేదని చెప్పాడు. వెంటనే శివయ్య పది

మైళ్లకి పైగా దూరంలో వున్న ఆ గ్రామానికి వెంటనే బయలుదేరి వెళ్లి ఆ పుస్తకాన్ని తెచ్చాడు. మర్నాడు ఉదయం నిద్ర లేచిన సత్యనారాయణకి ఆ పుస్తకం కనపడగానే ఆశ్చర్యపోయాడు. జరిగింది తెలుసుకుని సంతోషించాడు.

అయితే వారిద్దరి తల్లితండ్రులు మాత్రం వారి ఈ చర్యలకి ఎంతమాత్రం ఇష్టపడలేదు. సత్యనారాయణ దగ్గరకి వెళ్లద్దని వాళ్లని పోరేవారు. ఐనా వారిద్దరూ తమ తల్లితండ్రుల మాటని ఖాతరు చేసేవారు కారు.

ఓసారి మరుకూకు గ్రామంలో ప్లేగు వ్యాధి ప్రబలింది. ప్లేగు లాంటి వ్యాధులు వస్తే వారు ఆ రోజుల్లో అనుసరించే పద్ధతి ప్రకారం గ్రామస్తులంతా ఊరు బయట దూరంగా గుడిసెలు వేసుకుని అక్కడ నివసించసాగారు. సత్యనారాయణ కూడా వారితో పాటు గ్రామం వదిలి వచ్చేసాడు. ఓ గుడిసెలో శ్రీరామ చంద్రుడి పటాన్ని వుంచి గ్రామస్థుల చేత భజనలని చేయించసాగాడు.

అయితే భజనకి అందరూ రాకపోవడం గమనించి కారణం అడగ్గా రానివారు జవాబు చెప్పారు.

"అనారోగ్యంతో చావు భయంలో ఉన్న మాకు భజనల మీదకి మనసెలా పోతుంది? మీరు మాకు ఏ జ్వరమూ, అనారోగ్యం రాదని అభయం ఇస్తే అప్పుడు భజనలకి వస్తాం".

సత్యనారాయణ వెంటనే కళ్లు మూసుకుని 'స్వామీ! అన్నిటికీ నువ్వే కదా? నాదేముంది; వీరడిగిన అభయం ఇచ్చే శక్తి నాకు ఎక్కడిడి? కాని నీ పవిత్ర నామ స్మరణని అంతా చేయాలన్నది ఒక్కటే నా కోరిక. నీ నామం మీద నాకు గల ప్రేమతోనే వీరికి అభయం ఇస్తున్నాను. ఒకవేళ అది నేరం అయితే వారందరినీ రక్షించి నన్ను మాత్రం శిక్షించు. నా భారాన్ని గ్రహించి నువ్వు ఏం చేసినా నాకు సంతోషమే.' అని శ్రీరామచంద్రుడ్ని ప్రార్థిం చాడు. తర్వాత కళు ్ళ తెరచి వాళ్లతో చెప్పాడు.

"నాయనలారా! మీరంతా నిర్భయంగా భజనకి రండి. ఇద్దరున్న కుటుంబంలోంచి ఒక్కరు, ముగ్గురు ఉన్న కుటుంబంలోంచి ఇద్దరు రండి. ఇవాళ వచ్చిన వారు రేపు ఇంటి దగ్గరే వుండి, ఇవాళఇంటి దగ్గర ఉన్నవారు

రేపు రావాలి. నేచెప్పినట్లుగా నియమం ప్రకారం భజన చేస్తే మనలో ఒక్కరికి కూడా అనారోగ్య బాధ రాదని మీకు మాట ఇస్తున్నాను."

ఆ రోజు నించి అంతా ఆ ప్రకారం రాసాగారు. వీరంతా కలిసి చేసే భజన, రెండు మైళ్ల దూరంలో గల గూడెంలోని గుడిసెల్లోని వారికి వినబడేది. ఆ గూడెం పటేలు ఓ పక్క ప్లేగు భయంతో చస్తూంటే భజనలు ఏమిటి? ఆపమని కబురు పంపాడు. కాని సత్యనారాయణ ఆ ఉత్తర్వుని ఖాతరు చేయలేదు. వీరి గ్రామంలోని ప్రజలంతా సురక్షితంగా ఉంటే, ఆ పటేలు గూడెంలోని ప్రజలు ప్లేగు వ్యాధి బారిన పడసాగారు. దాంతో ఆ గూడెంలోని వారు సత్యనారాయణ గ్రామస్థుల గుడిసెల వైపు రాసాగారు. వారు కూడా అక్కడే గుడిసెలు వేసుకోవడం చూసి మరుకూకు గ్రామస్థులు ఆ సంగతి సత్యనారాయణకి చెప్పి ఏమంటారని అడిగితే అతను ఇలా జవాబు చెప్పాడు.

"నాయనలారా! వారిని ఎవరూ నివారించవద్దు. ఇదివరకు మీకు ఎలా భయం ఉండేదో అలా వీరికి ఇప్పుడు ప్రాణ భయం ఉంది. భయస్థులకి అభయం ఇవ్వడమే ధర్మం. వచ్చేవారికి గుడిసెలు వేసుకోవడానికి మీరు సహాయం చేసి, వారినీ భజనలకి రమ్మని చెప్పండి."

ఇదిలా ఉండగా సత్యనారాయణ ఇద్దరు ఆంతరంగిక భక్తుల్లోని వడ్ల శివయ్య రెండు మైళ్ల దూరంలో ఉన్న ఆ గూడెంలో తల్లితండ్రుల దగ్గర ఉండిపోయాడు. అతనికి ప్లేగు వ్యాధి అంటుకుని ఒంటి మీద గడ్డ లేచింది. అతడి నించి అది మిగిలి వాళ్లకి కూడా అంటుకుంటుందనే భయంతో వాళ్లు గూడేనికి దూరంగా ఉన్న ఓ బావి దగ్గర చొప్పకట్టలు పరిచి, దాని మీద అతన్ని పడుకోబెట్టి వెళ్లిపోయారు.

మళ్లీ అన్నం ఇవ్వడానికి కూడా ఎవరూ అతని దగ్గరకి భయంతో రాలేదు.

కొందరు ఓ రాత్రి వచ్చి శివయ్య మిత్రుడైన ఈశ్వరయ్యకి ఈ విషయం తెలియచేసారు. వారిలో కొందరు అతను కొన ఊపిరితో ఉన్నాడంటే, మరికొందరు ప్రాణం పోయి కూడా ఉండచ్చని చెప్పారు. ఈశ్వరయ్య వెంటనే సత్యనారాయణ పూజ చేసుకునే చోట శివయ్య దురవస్థ గురించిన ఉత్తరం రాసి వుంచి, చేతిలో

భజన తాళాలతో దైవ భజన చేస్తూ, తన మిత్రుడ్ని రక్షించుకోడానికై వెళ్లాడు.

మర్నాడు ఉదయం స్నానం అయాక సత్యనారాయణ పూజ చేయడాఇకి వెళ్లగానే, అక్కడ వున్న ఉత్తరాన్ని చదివి, అయన ఆధ్యాత్మ రామాయణం పుస్తకం, భజన తాళాలు తీసుకుని తన కుటుంబ సభ్యులతో కలిసి శివయ్య దగ్గరకి వెళ్లాడు. శివయ్య స్మృతి లేక అవసాన దశలో ఉన్నాడు. కనుబొమల దగ్గర చెదలు పట్టి ఉన్నాయి. ఆధ్యాత్మ రామాయణం పూర్తయ్యే సరికి అతన్ని బ్రతికించాలన్న సంకల్పంతో, సత్యనారాయణ ఆధ్యా త్మ రామాయణం పారాయణాన్ని ప్రారంభిం చారు.

కొందరు శివయ్య నోట్లో కొద్దికొద్దిగా పాలు పోయసాగారు. అయితే మింగుడు పడక అది పక్కకి జారిపోసాగింది. బాలకాండ దాకా పారాయణం అవగానే శివయ్య పాలు కొద్దిగా ఆగాడు. యుద్ధకాండ ముగిసే సరికి లేచి కూర్చున్నాడు. సాయంత్రం అయిదు గంటకల్లా పారాయణం పూర్తయ్యే సరికి శివయ్యకి పూర్తి స్పృహ వచ్చింది. శివయ్య తన గురువుకి సమ స్కరించాడు. ఈ సంగతి తెలిసి వచ్చిన తల్లితండ్రులని చూసి, వాళ్ల మీద కోపంతో శివయ్య తన దగ్గరకి రాకుండా రాళ్లతో కొట్టసాగాడు. అతన్ని వారిస్తూ సత్యనారా యణ చెప్పాడు.

"నాయినా! కొట్టద్దు. వాళ్లు నాకు పూజ్యులు. వారు నిన్ను దూరంగా విడిచిపెట్టిన పాపానికి వాళ్లని శిక్షించడానికి దైవం ఉన్నాడు. నువ్వు వెళ్లి ఎప్పటిలా వాళ్ల దగ్గరే ఉండాలి."

కొద్ది రోజులకి సత్యనారాయణ తండ్రి శంభుదేవుడు జబ్బు పడ్డాడు. ఈశ్వరుడు ఆయనకి శ్రద్ధగా సేవ చేశాడు. మల మూత్రాలని కూడా తీశాడు. తండ్రి అవసాన దశకి చేరుకున్నా డని గ్రహించిన సత్యనారాయణ గీతాధ్యాత్మ రామాయణాన్ని పారాయణం చేస్తూ, తండ్రికి తులసి తీర్థం పోశాడు. ఆ ప్లేగు గుడిసెల్లోనే శంభుదేవుడు తుది శ్వాసని వదిలాడు. ఆయనకి శాస్త్రప్రకారం సత్యనారాయణ దహన సంస్కారాలని చేసాడు. ప్లేగు వ్యాధి తగ్గాక అంతా తిరిగి మరు కూకుకి చేరుకున్నారు.

**ఈశ్వరుడు :**

సత్యనారాయణ ఇద్దరి శిష్యుల్లో ఒకడైన ఈశ్వరుడు వైశ్యుడు. తన పదకొండో ఏటే ఇతను సత్యనారాయణకి శిష్యుడు అయ్యా డు. సత్యనారాయణ దగ్గర నిత్యం యోగాభ్యాసం, ప్రాణాయా మం నేర్చుకుంటూ అతనికి సర్వ సపర్యలు చేస్తూ, రాత్రుళ్లు ఆయన పక్కనే పడుకునేవాడు. తల్లి, తండ్రి, తోబుట్టువులు, బంధువర్గం ఉన్నా సత్యనారాయణ ఇంట్లోనే తన ఇంట్లో ఉన్నంత ధీమాగా ఉ ండేవాడు. తన కుటుంబ సభ్యులని బయటవారిలా చూనేవాడు. తన ఇంటికి రోజులో ఓ అరగంట మాత్రయే వెళ్లేవాడు. యోగాభ్యాసానికి ఆహార నియమం అవసరం. అందుచేత తన ఇంటికి వెళ్లినప్పుడు దయ్యం పట్టిన వాడిలా నటిస్తూ, పెద్ద గొంతుతో చెప్పేవాడు.

"ఇవాళ వీడికి రెండు తులాల పేలాలే పెట్టాలి. అంతకంటే వీడు ఎక్కువ తింటే మాత్రం చంపేస్తాను."

అమాయకురాలైన అతని తల్లి అది నిజమని నమ్మి అంతే పెట్టేది. ఈశ్వరుడు అరగంట దాకా కుంభకాన్ని చేయగలి గేవాడు. కాని గురువు మాట మీద ఆ అభ్యాసాన్ని నిలిపేసాడు.

ఓసారి ఈశ్వరుడు తోటి పిల్లలతో ఆడుకుంటూంటే కింద పడి దెబ్బ తగి లించుకున్నాడు. అది తెలిసి తల్లి తండ్రు లిద్దరూ పరిగెత్తుకొచ్చి ఏడవసాగారు. ఈశ్వరుడు ఎప్పటిలా దయ్యం పట్టిన వాడిలా చెప్పాడు.

"ఇదిగో వినండి. వీడిని మీరు సత్యనారాయ ణకి దానం ఇస్తే సరే. లేదా వీడి మీద ఆశ వదు లుకోండి. ఇపుడే వీడ్ని చంపేస్తాను."

పుత్ర ప్రేమతో ఆ తల్లితండ్రులిద్దరూ కొడుకు బ్రతికి వుంటే చాలనుకుని, ఈశ్వరుడ్ని సత్యనారాయణకి దానం ఇచ్చి ఓ నమ స్కారం చేసారు.

ఓసారి సత్యనారాయణకి జ్వరం వచ్చింది. నోటికి ఏదీ హితవుగా తోచలేదు.

"ఇప్పుడు బుడిమకాయలు వుంటే బాగుండేది." అని తల్లితో అనడం విన్న ఈశ్వరుడు వెంటనే గురువుగారు కోరింది తేవాలని ఎవరికైనా చెప్తే వారిస్తారని, ఎవరికీ చెప్పకుండానే బయలు దేరాడు. అది బుడిమకాయలు దొరికే కాలం

కాదు కాబట్టి పట్టణంలో దొరకవచ్చనుకుని, హైద్రాబాద్‌కి పరుగెత్తుతూ వచ్చాడు. అందుకతనికి నాలుగు గంటలు పట్టింది. వీధులన్నీ వెదికి ఓ చోట ఓ శేరు బుడిమకాయలని పెట్టుకుని కూర్చున్న ఓ వర్తకుడ్ని చూసి వాటిని ఆనందంగా కొని, విశ్రాంతి తీసుకో కుండా తిరిగి తమ గ్రామానికి పరిగెత్తుతూనే రాత్రి బాగా పొద్దుపోయాక చేరుకున్నాడు. మర్నాడు ఉదయం సత్యనారాయణకి బుడిమకాయలు సమర్పించాడు. దారిలో ముళ్లు గుచ్చుకున్న ఈశ్వరుడి కాళు ్లు బాగా ఉబ్బాయి. సత్యనారాయణ ఈశ్వరుడికి తన మీద గల దృఢ ప్రేమ గురించి చాలా సార్లు చెబుతూ, ఈ సంఘటన గురించి చెప్పేవాడు.

ఈశ్వరుడు సత్యనారాయణ అక్క నర్సమ్మగారిని తన తల్లిలా భావించేవాడు. సత్యనారాయణ ప్రవచనాలు విన్నాక ఎక్కడికైనా తీర్థయాత్రకి వెళ్లాలనుకుని నర్సమ్మతో ఆ సంగతి చెప్పాడు. “నువ్వు ఎక్కడికైనా వెళితే, నాకు చెప్పే వెళు ్ల” అని హుకుం జారీ చేసింది నర్సమ్మ.

ఈశ్వరుడు ఓ రోజు నర్సమ్మతో “ అమ్మా! చలిగా వుంది.” అన్నాడు. నర్సమ్మ అతనికి ఒక ధోవతిని ఇచ్చింది. అది కప్పు కుని కాసేపు కూర్చున్నాక “అమ్మా! వెళ్తున్నాను” అన్నాడు. “సరే. వెళ్లు” అని ఈశ్వరుడు ఎక్కడికి వెళ్లదలిచాడో తెలీని నర్సమ్మ చెప్పింది. దాన్నే ఆవిడ అనుమతిగా స్వీకరించిన ఈశ్వరుడు సరాసరి మహారాష్ట్రలోని పండరిపురానికి బయలుదేరి కొన్ని రోజులకి అక్కడికి చేరుకున్నాడు. వాడు ఎక్కడికి వెళ్లాడో సత్య నారాయణకి కూడా తెలీదు. ఈశ్వరుడు పండరీనాథుడ్ని చూడా లన్న తలంపుతో ఉపవాస దీక్ష, భజన చేయసాగాడు. ఈశ్వరు డిలానే మరో వ్యక్తి కూడా ఆ సమయంలో అదే రకం దీక్షలో వున్నాడు.

సాక్షాత్తు పండరినాథుడు ముసలి బ్రాహ్మడి రూపంలో వచ్చి, ఈశ్వరుడికి, ఆ మరొకతనికి రొట్టెలు తెచ్చిచ్చి తినమని కోరాడు. ఈశ్వరుడు మాత్రం వాటిని తినకుండా చంద్రభాగ నదిలోని జలచరాలకి ఆ రొట్టెలు వేసి వచ్చాడు. మర్నాడు ఆ బ్రాహ్మడు వచ్చి స్వయంగా ఇద్దరికీ రొట్టెలు దగ్గరుండి తినిపించి వెళ్లాడు. తర్వాత గురువుని చూడాలన్న కోరిక కలిగి ఈశ్వరుడు తిరిగి మరుకూకు వచ్చాడు.

సత్యనారాయణకి ఏదైనా సంకల్పం కలిగితే అది అక్షరాలా జరిగి తేరేది. ఇందుకు ఈశ్వరుడికి సంబంధించిన ఈ సంఘటన ఓ ఉదాహరణ. మరోసారి కూడా ఈశ్వరుడు ఎవరికీ చెప్పకుండా ఎక్కడికో వెళ్లాడు. సత్యనారాయణ, ఇతరులు అతను పండరీపురానికే వెళ్లి వుంటాడని నిర్ణయించుకున్నారు. రెండు రోజులు గడిచాయి. సత్యనారాయణని ఈశ్వరుడితో మంచి స్నేహం గల ఒకడు ప్రశ్నించాడు.

"స్వామీ! ఈశ్వరుడు ఇంకా రాలేదు. ఎప్పుడు వస్తాడు?"

"ఈశ్వరుడ్ని నీకు చూడాలనుందా?" ప్రశ్నించాడు సత్యనారా యణ.

"అవును." కొద్దిసేపు కళ్లు మూసుకుని ధ్యానం చేసి సత్య నారాయణ చెప్పాడు.

"సరే. ఇవాళే వస్తాడు."

సత్యనారాయణ ఆ సంకల్పం చేసిన సమయంలో ఈశ్వరుడు చంద్రభాగ నది ఒడ్డున కూర్చుని తినడానికి రొట్టెల మూట విప్పుతున్నాడు.

అకస్మాత్తుగా అతనికి తన గురువుని చూడాలన్న తీవ్రకాంక్ష కలిగింది. ఆకలి కూడా చచ్చిపోవడంతో, సమయం వృధా చేయకూడదనుకుని ఆ రెట్టెలను జలచరాల కోసం చంద్రభాగ నదిలోకి విసిరేసాడు. పాండురంగ విఠలుడి ఆలయానికి వెళ్లి నమస్కారం కూడా చేసుకోకుండా బయలుదేరి రాత్రి పన్నెండు గంటలకి మరుకూకుకి, సత్యనారాయణ దగ్గరకి వచ్చాడు.

"పండరిపురం నించి ఎప్పుడు బయలుదేరావు?" ఒకరు ప్రశ్నించారు.

"ఉదయం పన్నెండు గంటలకి." జవాబు చెప్పాడు ఈశ్వ రుడు.

సత్యనారాయణ ఈశ్వరుడు ఆ రోజే వస్తాడని చెప్పిన సమ యం సరిగ్గా అదే!

ఇది సత్యనారాయణ ఇరవై ఒకటో ఏట జరిగిన సంఘటన.

ఓ సందర్భంలో సత్యనారాయణ ఈశ్వరుడికి, తనకి గల పూర్వ జన్మ కర్మబంధాన్ని గురించి ఇలా వివరించాడు.

సత్యనారాయణ ఎనిమిది వందల ఏభై ఏళ్ల క్రితం ఓ జన్మలో జంగమ మఠాధిపతిగా వుండేవాడు. అతనికి ఇద్దరు భార్యలు. మొదటి భార్య వంట, వార్పు, ఇంటి పని చేసూండేది. రెండో భార్య మాత్రం భర్త ఆజ్ఞానుసారం వ్యవసాయం, ఇతర పురుష వ్యవహారాలన్నింటినీ చేసేది. ఆ జన్మ వల్ల ఈమె పురుష వాసనలు కలిగి ఉండటంతో ఈ జన్మలో ఈశ్వరుడుగా పుట్టి సత్యనారాయణకి పూర్వ జన్మలో లాగానే సేవ చేస్తున్నాడు.

## నర్సమ్మగారు

సత్యనారాయణకి చెల్లెలైన నర్సమ్మకి భర్త చిన్నతనం లోనే మరణించాడు. దాంతో అన్న దగ్గరే శేష జీవితాన్ని గడపసాగింది. చాలా మంది ఎవర్నయినా పెంచుకోమని సలహాలు ఇచ్చారు. కాని, ఆమె అందుకు మనస్కరించలేదు. ఎలాగైనా భగవం తుడ్ని చేరుకోకాలన్న తపన కలిగి దాన్నే తన జీవిత లక్ష్యంగా నిర్ణయించుకుంది. ఇంకెక్కడైనా వుంటే లౌకిక జీవనం పై ఆసక్తి కలగవచ్చన్న భయంతో, నర్సమ్మ భగవత్ భక్తుడైన అన్న దగ్గరే వుండ నిశ్చయించుకుంది. ఆమెకి కోపమనేదే వచ్చేది కాదు.

ఓసారి సత్యనారాయణ ఓ భక్తద్రోహిని ఛడామడా తిట్టాడు. ఆ రాత్రి అతనికి కలలో జగన్నాథుడు కనిపించి చెప్పాడు.

“నాయినా! ఇంత కోపం వద్దు. నీ చెల్లెలు నర్సమ్మను చూడు. ఎంత శాంత స్వభావం కలదో నీకు తెలుసు కదా! ఆమెని చూ సైనా నేర్చుకో.”

మెలకువ వచ్చిన సత్యనారాయణకి సిగ్గు, ఆనందం కూడా కలిగాయి. సిగ్గు తన కోపానికి. ఆనందం తనకి అలాంటి చెల్లెలు లభించినందుకు. నర్సమ్మకి ధనవ్యామోహం లేదు. ఓసారి ఓ భగవత్కార్యానికై సత్యనారాయణ డబ్బుకోసం ఎంత ప్రయ త్నించినా దొరకలేదు. అది తెలిసి నర్సమ్మ తన బంగారు నగలని అన్నకి ఇచ్చి చెప్పింది.

“నాకివి దేనికీ ఉపయోగపడవు. వీటిని దైవకార్యానికి ఉపయోగిస్తే వీటి ప్రయోజనం నెరవేరుతుంది.”




సత్యనారాయణ వాటిని తీసుకుంటే ఆమె ఎంతో సంతోషించింది. తన ఆస్తిని కూడా ఆమె ఓ బ్రాహ్మణ కుటుం బానికి ఇచ్చేసింది. కృష్ణుడికి సుభద్ర ఎలాగో నర్సమ్మ సత్య నారాయణకి అలా.

పూర్వ జన్మ సంస్కారాల వల్ల సత్యనారాయణకి బాల్యం నించే దేవుడి మీద భక్తి నిండుగా వుంది. వయసుతో పాటు అదీ పెరగసాగింది. భగవత్ ప్రార్థన, భగవత్ చింతన, భజన లతో అతని దినచర్య నిండి ఉండేది. వైరాగ్యం అనే అగ్నిలో అతనికి బాహ్య ప్రపంచం పూర్తిగా కాలిపోయింది. లౌకిక భోగా ల మీద ఆవగింజంత ఆసక్తి కూడా ఉండేది కాదు. భగవ ధ్యానంలో ఉన్నప్పుడు బాహ్యస్మృతి కోల్పోయి, నిశ్చలంగా ఉండేవాడు. ఎప్పుడూ భగవంతుడితో ఏదో మాట్లాడు తు న్నట్లుగా పెదవులని కదిల్చేవాడు. లేదా వేదాంత, పురాణ గ్రంథాలని చదివేవాడు. తాళాలు చేతిలో ఉంచుకుని మృదు మధురమైన కంఠంతో భగవన్నామ భజనలని చేసేవాడు. నిద్రకి, లోకాభిరామా యణానికి, అనవసర విషయాలకి ఏ మాత్రం చోటివ్వక, సదా ఈశ్వరా న్వేషణలో కాలం గడిపేవాడు.

లోకానికి విముఖులైనా, లోకులకి సత్యనారాయణ సుముఖులే! సత్య నారాయణ గురించి తెలుసుకుని, వందల మంది ఆయన దగ్గరకి రాసాగారు. గంధం చెట్టు తాలూకు సువాసన బహుదూరం వ్యాపించే ట్టుగా సత్యనారాయణ పేరు దూర ప్రాంతాలకి కూడా చేరేది. ఎంత మంది వచ్చినా విసుక్కోకుండా వారిని ఉద్ధరించే ఉపదేశాలని, మాటలని సత్యనారాయణ ఓపికగా చెప్పేవాడు.

దివ్యపురుషులు మొదట్లో దేవుని మీద విరహంతో ఆర్తిగా విలపించడం సర్వసాధారణం. రామకృష్ణ పరమహంస జీవిత చరిత్రలో ఆయన కాళికా దేవి దర్శనం కోసం సదా విలపిం చినట్లుగా, సత్యనారాయణ రామ దర్శనం కోసం అధికంగా విలపించేవాడు. భోరున వెక్కి వెక్కి ఏడుస్తూంటే అతని కన్నీటి ధారలతో పడుకున్న పరుపు తడిసిపోయేది.

సత్యనారాయణ జన్మత: శిల్ప కళా ప్రవీణులు. అందు వల్ల అతను స్వయంగా సిమెంట్‌తో 'రామకృష్ణ హరి' విగ్రహాన్ని తయారు చేసాడు. దానిని ఓ మందిరంలో ఉంచి నిత్యం పూజ చేయసాగాడు. దానికి ఉదయమే స్నానం చేయించి గంధం పూసి, గోవింద నామం దిద్ది, మురళిని చేతిలో ఉంచి, పీతాం బరాలని కట్టి, నివేదనలు, హారతులు ఇచ్చి, ఆ మూర్తితో మాట్లాడుతూ, ఒకోసారి నవ్వుతూ, మరోసారి ఏడుస్తూ మృదువుగా భజనని చేసేవాడు. కీర్తనలని మనసులోనే అ ల్లుకుని గానం చేసేవాడు. వీరి కవిత్వం కూడా మధుర భక్తి భావాలతో, సర ళమైన పదాలతో ఉండేవి.

జీవనానికై సత్యనారాయణ పౌరోహిత్య వృత్తిని చేసేవాడు. ఎవరికి వారు ముందు తమ ఇంటికి రమ్మంటే కాదు తమ ఇంటికి రమ్మని సత్యనారాయణని అడిగేవారు. ఒకేసారి రెండిళ్లకి ఎలా వెళ్లగలడు? క్రమేపీ సత్యనారాయణకి పౌరో హిత్య వృత్తి మీదే చీదర కలిగి, ఇక అక్షితలు ముట్టనని చెప్పి ఆ వృత్తినుంచి విరమించుకున్నాడు.

❖ ❖ ❖




ఆ రోజుల్లో బ్రాహ్మణులు పంట చేతికి వచ్చే రోజుల్లో కళ్ళాలకి వేళ్లే, ముందుగా వారికి భిక్ష పెట్టేవారు. ఓ రోజు తండ్రి శంభు దేవుడు సత్యనారాయణతో చెప్పాడు.

"నాయినా! కళ్ళాలకి వెళ్తే అంతో ఇంతో ధాన్యం దొరుకు తుంది కదా. సంసారం లాగడానికి ఎంత దొరికితే అంత లాభం అనుకోవాలి."

తండ్రి మాట ప్రకారం సత్యనారాయణ గొంగడి మీద వేసుకుని కళ్ళానికి వెళ్లాడు.

భిక్ష అడగడం ఎలాగో తెలీని అతను ఓ చోట కూర్చున్నాడు. ఆ కళ్ళపు యజమాని సత్యనారాయణని సరిగ్గా చూడక పోవడంతో, మిగిలిన బ్రాహ్మణులకి భిక్ష ఇచ్చినా అతనికి ఇవ్వలేదు. అంతా ఇళ్లకి వెళ్లిపోయారు. కళ్ళంలోని ధాన్య కూడా అయిపోయింది. ఆ రైతు ఇంటికి వెళ్లడానికి సిద్ధపడుతూండగా సత్యనారాయణ అతనితో శాంతంగా ఇలా చెప్పాడు.

"నాయినా! ఈ రోజు నువ్వు నాకు గురువయ్యావు. ఎందు చేతంటే, ఇక ముందు యాచనకి వెళ్లకూడదని ఈశ్వరుడు ఏం ఇస్తే దాన్నే అనుభవించాలన్న పాఠం నీ నించి నేర్చుకున్నాను. మరణిచినా సరే యాచన మాత్రం చేయను."

ఆ కాపు ఆ మాటలకి నొచ్చుకుంటూ బదులు చెప్పాడు.

"అయ్యా! మన్నించండి. నేను మిమ్మల్ని చూడలేదు. తప్పయింది. మీకు ఇవ్వాల్సిన ధాన్యాన్ని మీ ఇంటికే పంపుతాను మీరు అలా నామీద కోపగించుకుంటే




నాకు మంచి జరగదు.”

“నాయినా! తప్పుగా అర్థం చేసుకోకు. నాకు నీ మీద ఎలాంటి కోపం లేదు.” చెప్పి సత్యనారాయణ ఇంటికి వెళ్లిపో యాడు.

ఆనాటి నించి సత్యనారాయణ బ్రాహ్మణులకి వృత్తి అయిన యాచన మాని ఈశ్వరానుగ్రహంతో అందిన దాన్నే ప్రసాదంగా భావించి స్వీకరించసాగాడు. యాచన చేయ కూడదన్న దృఢసంకల్పంతో మరెన్నడూ సత్యనారాయణ ఎవరినీ యాచించి ఎరగడు.

ఓసారి సత్యనారాయణ కేశవపురానికి వెళ్తూ ఎప్పటిలా పెద్దగా భగవత్ కీర్తనలు పాడుతూ నడుస్తున్నాడు. మార్గమధ్యంలో మనుషులు ఎవరూ లేని చోట అతనికి దాహం వేసింది. ఎటు వైపు చూసినా బావి కాని, చెరువు కాని కనపడలేదు. దాహం అధికం అవడంతో ఇక నడవలేక జగ న్నాథుని ధ్యానిస్తూ ఓ చోట కూర్చుండిపోయాడు. కొద్ది సేపటికి రెండు గజాల దూరంలో అకస్మాత్తుగా అతనికి ఓ జలాశయం కనిపించింది. అందులోంచి నీళ్లు తాగి దాహాన్ని తీర్చుకుని బయలుదేరాడు. తన పని ముగించుకుని తిరిగి వచ్చేప్పుడు సత్యనారాయణకి ఆ జలాశయం అక్కడ కనపడలేదు! తన దప్పికని తీర్చడానికి శ్రీరామచంద్రుడు దాన్ని సృష్టించి ఉంటాడని సత్యనారాయణకి అప్పటికి కాని తెలీ లేదు.

కేశవపురం చేరుకుని ఓ ప్రదేశానికి వెళ్లేసరికి అతనికి అక్కడ ఉంటే బావుంటుందన్న భావన కలిగింది. కాని అంత లోనే 'నేనెప్పుడూ ఈ ఊరికి రాలేదు. ఈ ఊళ్లో ఎవరితోనూ పరి చయం కూడా లేదు. ఇక్కడ ఎలా ఉ ండటం?' అని ఆలోచిం చుకున్నాడు. కేశవపురంలో పని అయ్యాక తిరిగి ఇంటికి వెళ్తూంటే 'ఇక్కడే తప్పక ఉండి తీరాలి. ఇదే నాకు ఇల్లు అవుతుంది.' అన్న సంకల్పం మనసులో గాఢంగా కలి గింది.

ఆ గ్రామ పటేలు కృష్ణారెడ్డి అనే అతను దేవీ భక్తుడు. పరిచయం లేకపోయినా అతనింటికి సత్యనారాయణ వెళ్లాడు. కృష్ణారెడ్డి అతన్ని తేరిపార చూసి చెప్పాడు.

"మీరిక్కడే ఉంటే బావుంటుందని నాకు అనిపిస్తోంది."

"అలాగే ఉంటాను." జవాబు చెప్పాడు సత్యనారాయణ.

పేరు, ఊరు, కులం లాంటి వివరాలేమీ అడగకుండానే కృష్ణారెడ్డి సత్యనారాయణని ఉండమనడం దైవ సంకల్పమే అయివుండాలి. మర్నాడు సత్యనారాయణ ఏ చోట తనకి వుండాలనిపించిందో ఆ స్థలాన్ని కృష్ణారెడ్డికి చూపించి జరిగింది చెప్తే, కృష్ణారెడ్డి అక్కడ సత్యనారాయణ నివాసం నిమిత్తం ఓ కుటీరాన్ని నిర్మించాడు. కొద్దిరోజులు గ్రామస్థులకి ప్రవచనాలు చెప్తూ సత్యనారాయణ అక్కడే గడిపాడు. సాధ్య మైనంత ఎక్కువకాలం కృష్ణారెడ్డి సత్యనారాయణతోనే గడప సాగాడు. ఇంటికి వెళ్లడం కూడా తగ్గించేసాడు.

ఓరోజు కృష్ణారెడ్డి హైద్రాబాద్‌కి వెళుతూ, వెంట సత్యనారా యణని కూడా తీసుకువెళ్లాడు. వెళ్తూ ఆఫీసు డబ్బు పదహారు వందల రూపాయలు కూడా తీసుకెళ్లాడు.

"మీకేం కావాలి?" సత్యనారాయణని అడిగాడు కృష్ణారెడ్డి.

ఏం వద్దన్నా బలవంతం చేయడంతో తనకి పంచె, ఉత్తరీయం చాలని చెప్పాడు సత్యనారాయణ. వాటితోపాటు ధోవతులు కూడా కొని, కృష్ణారెడ్డి మూడు రూపాయలతో తనకో వస్త్రాన్ని కొనుక్కున్నాడు. గ్రామానికి తిరిగి వెళ్లాక కచ్చేరికి వెళ్లి లెక్క చూసుకుంటే, పదహారు వందల్లో కేవలం మూడు రూపాయలే తగ్గాయి. సత్యనారాయణకి కొన్న డబ్బు తగ్గక పోవడంతో కృష్ణారెడ్డికి పరమాశ్చర్యం

కలిగింది. వెంటనే అతని మహిమ అందరికీ చాటాడు.

మరుకూకునించి బయలుదేరి చాలా రోజులవడంవల్ల ఇం టికి తిరిగి రమ్మని సత్యనారాయణకి కబురు వచ్చింది. సత్య నారాయణ ఎడబాటుని సహించలేని కృష్ణారెడ్డి కూడా అతని వెంట మరుకూకుకు వెళ్లాడు. అక్కడ ఓ రోజు వున్నాక సత్య నారాయణని తన వెంట తిరిగి కేశవపురానికి తీసుకెళ్లాలన్నది కృష్ణారెడ్డి సంకల్పం. కాని తండ్రి శంభుదేవుడు సత్యనారా యణని వెళ్లనివ్వలేదు. కృష్ణారెడ్డి అతన్ని విడిచి వెళ్లలేడు. తండ్రి పంపితేకాని సత్యనారాయణ ఇంట్లోంచి ప్రయాణం కాడు.

సత్యనారాయణ రాకపోతే తను ఒంటరిగా పోనని కృష్ణారెడ్డి భోజనం మాని సత్యాగ్రహం మొదలెట్టాడు. అలా పదకొండు రోజులు గడిచాక తండ్రి కాదనలేకపోయాడు. సత్యనారాయణని తీసుకునే కృష్ణారెడ్డి కేశవపురానికి వెళ్లాడు. అక్కడ పదినెలల పాటు సత్యనారాయణ బస చేసాడు. నిత్యం సత్యనారాయణ షట్చక్రపూజ, సాలగ్రామ పూజ చేసేవాడు. ఏ ఊరెళ్లినా ఆ అర్చా మూర్తులని తన వెంట తీసుకువెళ్లి క్రమం తప్పకుండా పూజ చేసేవాడు. ఆ పూజలో తులసీదళం తప్పనిసరిగా ఉండి తీరాలి.

ఓసారి సత్యనారాయణ తండ్రి శంభుదేవుడికి జరిగిన దివ్యానుభవం సత్యనారాయణకి కూడా జరిగింది. మరుకూకు నించి వేరే గ్రామం వెళ్తూంటే, అమిదీపురం అనే గ్రామ సమీపంలోని ఓ విశాలమైన చెరువు కనిపించింది. దానిలోకి దిగి స్నానం చేసాడు. చెరువు గట్టు మీదే హనుమంతుడి ఆలయం అతనికి కనిపించింది. దాని పక్కన కూర్చుని పూజ చేయడానికి సాలగ్రామం, ఇతర పూజా వస్తువులని సంచీలోంచి బయటకి తీసాడు. కాని తులసీ దళాలని వెంట వేసుకురావడం తను మరిచిన సంగతి గ్రహించాడు. చూస్తే చుట్టుపక్కల ఎక్కడా తులసీ చెట్లు కనిపించలేదు. ఎక్కడ్నించైనా తీసుకురావడానికి కూడా ఎవరూ లేరు. తులసీదళం లేకుండా సత్యనారాయణ ఎన్నడూ సాలగ్రామానికి పూజ చేసి ఎరగడు. దాంతో అతనికి ఎంతో దుఃఖం కలిగింది.

దాంతో తన ఇష్టదైవం అయిన రాముడ్ని భక్తిగా కళ్లు మూసుకుని

ప్రార్థించాడు. కొద్దిసేపటికి కళ్లు తెరిచేసరికి ఎదురుగా చిగిర్చిన చిన్న తులసి మొక్క కనిపించింది. చచ్చిన కొడుకు పాడె మీంచి లేస్తే తండ్రికి కలిగేంత సంతోషం సత్య నారాయణకి ఆ మొక్కని చూడగానే కలిగింది. తులసీదళాలని కోసి పూజ చేసాడు. మర్నాడు తిరిగి అదే దారిన మరుకూకుకు వెళ్లేప్పుడు చూస్తే తులసీ చెట్టు అక్కడ లేదు! శివుడు శంభు దేవుడ్ని బిల్వచెట్టుతో అనుగ్రహించినట్లుగా, సత్యనారాయణని రాముడు తులసి చెట్టుతో అనుగ్రహించాడు.

ప్రతీ ఏడు సంవత్సరాదినాడు సత్యనారాయణ పంచాంగం తమ గ్రామ ప్రజలకి వినిపించి, రాబోయే సంవత్సరంలో కలిగే ఫలాలని చెప్పేవాడు. ఆ ఏడు పంచాంగ పఠనం అయాక ఓ పటేలు సత్యనారాయణని తన వ్యక్తిగత ఫలితాలని చెప్పమని కోరాడు. అతని నక్షత్రం, రాశి అడిగి తెలుసుకుని సత్యనారా యణ చక్రం వేసి, లెక్కలు కట్టి జవాబు చెప్పాడు.

“మీకు ఓ వారంలో ధననష్టం కలుగుతుంది. జాగ్రత్తగా ఉండండి.”

ఆ రాత్రి పటేలు ఇంట్లో దొంగలుపడి డబ్బును దోచుకు వెళ్లారు. పటేలు అమీనుని కలిసి ఫిర్యాదు చేసాడు. మాటల్లో అమీను సాహెబ్‌కి సత్యనారాయణ చెప్పిన జాతకం గురించి చెప్పాడు. వెంటనే అమీను సత్యనారాయణని స్టేషన్‌కి రమ్మని కబురు పంపాడు. ఆ రోజుల్లో అమీన్ సాహెబ్ అంటే ప్రజలు బాగా భయపడేవారు. అందువల్ల సత్యనారాయణ తల్లి, బంధుమిత్రులు అతన్ని ఆమీను దగ్గరకి వెళ్లద్దని, వాడేం చేస్తాడో అని సలహా ఇచ్చారు.

తల్లి కూడా వెళ్లద్దని అతన్ని గట్టిగా వారించింది. కాని దైవభక్తి కలిగి, దైవాన్ని నమ్ముకున్న వారికి లోకభీతి, అధికారవర్గ భీతి ఉండవు కదా.

“నేను ఆ పరమేశ్వరుడికి తప్ప మరెవరికీ జంకను. అమీనంటే నాకేం భయం?” అని అమీను దగ్గరకి సత్యనారాయణ వెళ్లాడు. అమీను ఇతన్ని తేరిపార చూసి అడిగాడు.

“మీరు ప్రశ్న చెప్పారట, నిజమేనా?”

"ఔను." చిరునవ్వుతో జవాబు చెప్పాడు సత్యనారాయణ.

"మీరు చెప్పిన ప్రశ్న నిజం అవుతూంటుందా?" మళ్లీ ప్రశ్నించాడు అమీను.

"అవుతుంది."

"అయితే ఆ డబ్బుని ఎవరు దొంగిలించారో వాళ్ల పేర్లు చెప్పండి." అమీను కోరాడు.

"వాళ్ల పేర్లు చెప్పడం కుదరదు. ప్రశ్నాశాస్త్రం గురించి మీకు తెలీదు కాబట్టి చెప్తున్నాను వినండి. ప్రశ్న అడిగిన లగ్నాన్ని అనుసరించి ఫలం చెప్పాల్సి ఉంటుంది." అని ఆ వివరాలని చెప్పి తన వెంట తెచ్చిన శాస్త్ర గ్రంథాన్ని చూపించాడు.

"ఐతే నాకో ప్రశ్న చెప్తారా?" అడిగాడు అమీను.

"అలాగే. అడగండి."

"నేనీ తాలూకాలో ఇదే పదవిలో ఉంటానా?" ప్రశ్నించాడు అమీను.

"ఉహు. మీరీ తాలూకాలో ఉండరు. మరో వారం రోజుల్లోగా ఈ పదవి నించి తొలగింపబడుతారు." లెక్కలు కట్టి సత్య నారాయణ జవాబు చెప్పాడు.

"సరే! మీరీ పరీక్షలో నెగ్గుతారో లేదో చూద్దాం." భయపడు తూనే చెప్పాడు అమీను.

ఇంటికి వచ్చిన కోడుకుని చూసి తల్లి ఎంతో సంతోషించింది.

మూడవరోజు అమీనుని ఆ పదవి నించి తొలగిస్తూ పై నుంచి ఉత్తర్వులు వచ్చాయి!

❖ ❖ ❖

ఓసారి సత్యనారాయణకి బాగా జబ్బు చేసింది. అపస్మారకం రావడం, ఒంటి నిండా చెమటలు, జ్వరం. ఇద్దరు మనుషులు పక్కనే కూర్చుని అతనికి పట్టే చెమటలని తుడవసాగారు. తల్లికి వైద్యం తెలుసు కాబట్టి ఆయుర్వేద చికిత్సని ఆవిడే చేయసాగింది. భజన చేయకుండా సత్యనారాయణ ఒక్కరోజు

కూడా ఉండలేదు. జ్వరం వచ్చినప్పటినించీ భజన లేదు. ఆ రాత్రి సత్యనారాయణ భజన చేయలేకపోతున్నందుకు బాధ పడుతూ పడుకున్నాడు. బాగా నిద్ర పట్టింది. అతనికి నిద్రలో ఓ కల వచ్చింది.



'భక్త విజయం' అనే గ్రంథంలో 'దామాజీ పంతు' అనే భక్తుడి కథ వస్తుంది. తలపాగా చుట్టుకున్న ఆ దామాజీ పంతు తన శిష్యులతో భజనలు చేస్తూ సత్యనారాయణ ఇంటి ముందుకు వచ్చి నిలబడి, కొంతసేపు భజన చేసాక, ఇంటి బయట నిలబడ్డ ఒకతన్ని అడిగాడు.

"మీ సత్యనారాయణ ఈ భజన విని బయటకి వచ్చి మాతో కలిసి భజన చేయడం లేదేమిటి?"

"వారికి జ్వరం వచ్చింది. అంచేత కదల్లేకుండా ఉన్నారు." జవాబు చెప్పాడు అతను.

"జ్వరం గిరం ఏం లేదాయనకి. ఉన్న చెమటలు, మత్తు నేను నా వెంట తీసుకువెళ్తున్నాను. ఇంక బాధలేదు. రమ్మను." చెప్పాడు దామాజీ పంతు.

సత్యనారాయణకి వెంటనే మెలకువ వచ్చింది. తన జ్వరం చాలాభాగం తగ్గిందని గ్రహించాడు. మర్నాడు లేచి బయటకి వెళ్లే శక్తి సమకూరింది. తనకి వచ్చిన కలని అతను తన తల్లికి, ఇతరులకి చెప్పాడు.

ఇలాంటి దైవసహాయం అందిన మరో సంఘటన కూడా త్వరలోనే జరిగింది. సత్యనారాయణకి శూలనొప్పి అప్పుడప్పు డూ వస్తూండేది. వెంటనే కొద్దిగా ఆహారం తింటే అది ఉప శమించేది. భగవత్ ప్రార్థనకై తరచు సత్యనారాయణ మనుష ల్లేని ప్రదేశానికి వెళ్తూండేవాడు. ఆరోజు కూడా అలా ఇద్దరు శిష్యులతో

వెళ్లి ఓ పర్వత ప్రదేశంలో కూర్చుని ధ్యానం చేస్తూం డగా, అకస్మాత్తుగా శూలనొప్పి వచ్చింది. వెంట ఆహారం తీసుకు వెళ్లలేదు. అది నిర్జన ప్రదేశం కాబట్టి ఆహారం ఇచ్చే వాళ్లేవరూ లేరు.

ఆ అరణ్య ప్రదేశంలో కనీసం పళ్లైనా దొరకచ్చని ఆ ఇద్దరు శిష్యులు వెదికితే పళ్ల చెట్టు ఒక్కటి కూడా కనపడలేదు. కొద్దిసేపు వెదికాక వాళ్లకి బాగా ఎండిపోయిన జీడిమామిడి చెట్టు ఒకటి కనిపించింది. చిత్రంగా చెట్టు ఎండిపోయినా, పచ్చగా పండిన నిగనిగలాడే ఓ పెద్ద పండు, రెండు చిన్న పళు వారికి కనిపించాయి. వాటిని ఆనందంగా కోసుకుని తీసుకెళ్లి సత్యనారాయణకి ఇచ్చారు. సత్యనారాయణ ఇద్దరికీ చెరో పండు ఇచ్చి తను పెద్ద పండుని తిన్నాడు. ఎండిన చెట్టుకి పండిన తాజా పళ్లు ఉండటం, ఇతరులకి పెట్టకుండా తను తినని నియమం గల సత్యనారాయణ వెంట ఇద్దరు ఉండబట్టి మూడు పళ్లు ఆ చెట్టుకి ఉండటం భగవంతుడి లీలే. ఆ పండు తిన్నాక సత్యనారాయణ శూల నొప్పి తగ్గింది.

షషష

సత్యనారాయణ నిరుపమ భక్తి గురించి గ్రామ గ్రామాల్లో చాలామందికి తెలిసిపోవడంతో తరచు అతన్ని చూడటానికి అతనింటికి మనుషులు వస్తూండేవారు. ఓసారి శ్రీచంద్రమౌళి శాస్త్రి, రామచంద్రయ్య అనే ఇద్దరు వచ్చి సత్యనారాయణతో భగవదన్వేషణ, అందుకు సాధనాలు, పరమార్ధ చింతన మొదలైన విషయాల మీద మాట్లాడారు. ఇలాంటి సమావేశా లని సభాపద్ధతిలో ఏర్పాటు చేయాలని, అందుకు సత్యనారా యణ అధ్యక్షుడుగా ఉండాలని వారు తీర్మానించారు. ముందుగా మొదటి సభని మరుకూకులో నిర్వహించాలని కూడా ప్రతిపాదించారు.

అయితే మొదటి సభకి వారు ఎప్పుడు వస్తారో చెప్పకుండానే ఓరోజు అందుకోసం ఇరవైమంది వచ్చారు. తన తండ్రి మరణించాక సంసారం కొత్తగా ఉంది. ఆయన బ్రతికి ఉండగా అంతా ఆ పెద్దాయనే చూసుకునేవారు. ఇప్పుడు ఆ భారం అంతా సత్యనారాయణ మీద పడింది. వచ్చే బియ్యం, ఇతర వస్తువులు

ఏ పూట కాపూట సరిపోతున్నాయి. ఇతరులని అడగడం సత్యనారాయణకి తెలీని విషయం. పైగా పొరుగూరు నించి తనింటికి చాలామంది వచ్చారు. మర్నాడు వారికి భోజ నాలు ఎలా ఏర్పాటు చేయాలా అన్న మీమాంసలో పడి ఆ రాత్రి సత్యనారాయణ శ్రీరామచంద్రమూర్తిని ఇలా ప్రార్థించి నిశ్చింతగా నిద్రపోయాడు.

"ప్రభూ! నా సంసార స్థితి గురించి నీకు సర్వం తెలుసు. తెలిసీ ఇంతమంది నీ భక్తులని పంపావు. నిన్ను నమ్మిన నాకు మానావమానాలనేవే లేవు. నువ్వు ఏం చేస్తే దాన్ని అనుభవి స్తాను. వీరిని ఎలా సత్కరిస్తావో నీ ఇష్టం."

మర్నాడు ఉదయం పొరుగు గ్రామం నించి ఒకతను మరు కూకుకి తన బంధువు ఇంటికి వచ్చాడు. సత్యనారాయణ గురించి విచారించి అతనింటికి కొంత బియ్యం, పప్పు ఇతర దినుసుల మూటలని తెచ్చి దింపి, సత్యనారాయణకి నమస్క రించి చెప్పాడు.

"స్వామీ! నిన్న రాత్రి నాకు కలో జగన్నాధుడు పన్నెండేళ్ల పిల్లాడుగా, నెమలి పింఛంతో కనిపించి 'నాయనా! నువ్వు ఇరవై మందికి సరిపడే సంభారాలతో వెళ్లి దాన్ని మరుకూకులోని నారాయణకి ఇవ్వు.' అని చెప్పారు. నాకు మెలకువ వచ్చినా నేను నిద్రమత్తులో ఆ కలని నమ్మలేదు. నాకు ఇదే కల మూడు సార్లు వచ్చింది. నేను అర్ధరాత్రి దుకాణం యజమాని ఇంటికి వెళ్లి అతన్ని నిద్రలేపి, దుకాణం తెరిపించి, నిన్న రాత్రే ఈ సరుకులన్నింటినీ తీసుకున్నాను. పొద్దున్నే వీటిని తీసుకుని గ్రామానికి వచ్చి, నాబంధువుకి జరిగింది చెప్తే, మీరే అయివుంటారని చెప్పాడు. దయతో వీటిని స్వీకరించండి."

తన భక్తుడు అవమానానికి గురవకుండా, ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆ విధంగా శ్రీరామచంద్రుడు ఆ ఇరవైమందికి భోజనాల ఏర్పాటు చేశాడు.

❖ ❖ ❖




సత్యనారాయణ పర్వత ప్రాంతాల్లో తిరుగుతూ జగత్ప్రభు వుని భక్తితో ధ్యానించేవాడు. ఓసారి అతను భగవంతుడ్ని ఇలా ప్రార్థించాడు.

“స్వామీ! శాస్త్రాల్లో బంధవిమోచనానికి ఎన్నోమార్గాలు చెప్పా రు. కాని ఈ సంసారంలో చిక్కుబడ్డ నేను ఏదీ చేయలేకుండా ఉన్నాను. నిన్ను దర్శించడం ఎలా? నిన్ను చేరడం ఎలా? వాటిలో ఏ మార్గాన్ని నేను అనుసరించేది? నాకేమీ బోధపడ కుండా ఉంది.”

అప్పుడు సత్యనారాయణకి భగవంతుడు కనపడి మూడు మార్గాలని సూక్ష్మంగా ఆదేశించి అదృశ్యమయ్యాడు. అవి: 1. విపరీత భావం, 2. సద్భావం, 3. భావశూన్యం.

విపరీత భావం అంటే అంతా వస్తు రూపాల్లో కనిపించే స్థితి. ఇదే జనన మరణ చక్ర భ్రమణానికి కారణం. అంతులేని దుఃఖానికి, ఘోర నరకానికి కూడా ఇదే కారణం. తాడుని చూసి పాము అనుకునే దశ ఇది.

రెండోదైన ‘సద్భావం’ అంటే పై భావాలకి వ్యతిరేక భావాలు – అంటే అంతటా ఉన్నది ఒక్క భగవంతుడే, పాము లేదు, ఉన్నది తాడే అనే భావన

కలగడం. ఈ స్థితిలో ప్రపంచంలో 'నేను-నాది' అనే భావాలు క్రమంగా అంతరిస్తాయి. ఉపాస నలు, ఇతర సాధనలు ఆచరించాల్సిన సమయం ఇదే.

ఇక సద్భావ పరిపాక దశే మూడవదైన "భావశూన్య" దశకి తీసుకెళ్తుంది. నామ రూపమయం అయిన ప్రపంచం లేనే లేదని, అంతటా చిదానంద పుంజమైన సత్యపదార్థం ఉందన్న సంగతి అనుభవానికి వస్తుంది.

దాంతో సత్యనారాయణ ఇంక ఏ గురువునీ ఆశ్రయించక, దాన్నే మననం చేసుకోసాగాడు.

మానసిక పూజ

సత్యనారాయణకి ఇరవై ఎనిమిదో ఏడు వచ్చేసరికి శ్రీరాముడ్ని మనసులో భావనాపరంగా ఉపాసించడం అధ్య యనం చేసుకున్నాడు. మణిమయ దివ్య సింహాసనం మీద మహారాణి సీతామాతని, సార్వభౌముడు శ్రీరాముడ్ని దాస్య భక్తితో మానసికంగా కూర్చోబెట్టి, వారిని హనుమంతుడు సేవిస్తున్నట్లుగా భావిస్తూ ఈ భావనని చాలాసేపు మనసులో నిలుపుకునేవాడు.

వారికి నైవేద్యం మొదలైన ఉపచారాలన్నిటిని భక్తిగా చేసేవాడు. ప్రయాణం అయి వెళ్లేప్పుడు మానసికంగా ఇలా ఊహించుకునేవాడు. తేజోమయమైన రామచంద్ర ప్రభువు, సీతాదేవిని పుష్పకవిమానంలో కూర్చోపెట్టి, చుట్టుపక్కల వానర వీరులు భక్తితో చూస్తూండగా, భరత, లక్ష్మణ, శత్రు ఘ్నులు వింజామరలు వీస్తుండగా, తనతో పాటు ఆ పుష్పక విమానం కూడా ప్రయాణం చేస్తున్నట్లుగా భావించేవాడు.

దారిలో తను ఎక్కడైనా ఆగితే ఆ విమానం కూడా ఆగి నట్లుగా భావించి, ఓ మూల రామచంద్రుడికి వంటశాల, మరోచోట స్నానశాల, మరోచోట రాజధాని ఇలా మానసికంగా ఏర్పాటుచేసి, అభిషేకం మొదలైనవి చేసి, తను తినబోయే ముందు భోజనాన్ని రామునికి తినిపించి, తాంబూలం ఇచ్చి, వారికి ప్రదక్షిణం చేసి ప్రార్థించేవాడు.

"శ్రీరామ సార్వభౌమా! నన్ను ఆదరించి నాకు దారి చూపు. తరించడానికి శాస్త్రాల్లో అనేక విధాలుగా చెప్పిన మార్గాల వల్ల నాకు బెదురు కలుగుతోంది.

నీ దివ్య దర్శనం ఇచ్చి నన్ను తరింపచేయి."

ఇలా పారమార్ధిక చింతనతో సూర్యాస్తమయం దాకా గడిపి, తిరిగి రాముడు తన పరివారంతో బయలుదేరినట్లుగా ఊహించి, తనూ వారితో బయలుదేరేవాడు. అలాగే గ్రామంలోకి వెళ్లాక సంకుచితమైన ప్రజలున్న గ్రామంలో రామునికి విడిది ఏర్పాటు చేయడానికి మనసు రాక, ఓ గజం బద్దతో రాముని రాజధానికి ఇంత స్థలం, వంటశాలకి ఇంత, పరివారానికి ఇంత అనుకుంటూ గ్రామం బయటే విశాలమైన స్థలాన్ని కొలిచి, మానసికంగా అక్కడ వారందరికీ విడిదిని ఏర్పాటు చేసి, గ్రామంలోకి వెళ్తూ చెప్పేవాడు.

"స్వామీ! క్షమించు. దేహధారులమైన మాకు సంసార లంపటం తప్పదు కదా! హనుమన్నా నువ్వు భాగ్యవంతుడివి. చక్కగా ఇక్కడే ఉండి సీతారాములకి సేవ చేసే భాగ్యం నీకు కలిగింది. అన్ని పరిచర్యలు నువ్వే చెయ్యి."

మనసు బయట విడిదిలో ఉన్న రామచంద్రుని మీదే ఉండటంతో గ్రామంలో తన భోజనం అయ్యాక విడిదికివచ్చి 'రామప్రభువు భోజనం అయిందా? వంటలన్నీ చక్కగా అమ రాయా?' అని హనుమన్నని పరామర్శించి మళ్లీ గ్రామంలోకి వెళ్లి పనిచూసుకునేవాడు. తిరిగి రాత్రికి ఇల్లు చేరేప్పుడు కూడా తన వెంటే శ్రీరాముడి పుష్పక విమానం వస్తున్నట్లుగా భావిం చేవాడు. ఇలా ఎప్పుడూ రామచంద్రుడి చింతన తప్ప ఇంకోటి సత్యనారాయణకి తెలియదు. అవిచ్ఛిన్నంగా రామ నామాన్ని మానసిక జపం చేస్తూనే ఉండేవాడు.

ఆ భగవత్ప్రీతి వల్ల సత్యనారాయణ ఈ ప్రపంచంలోని అనందం ఇచ్చే వస్తువులకి విముఖంగా ఉండే వాడు. మనుషులున్నచోట ఉండటానికి అతనికి మనస్కరిం చేది కాదు. ఇలా రాముడి మీద ప్రేమోన్మాదంతో, రామదర్శ నం కావాలన్న తీవ్ర కాంక్షతో నెలలు గడిపేవాడు.

చాలామంది మహాత్ముల జీవన విధానాలు కూడా దివ్య ప్రేమతో సత్యనారాయణ జీవితంలానే ఉండేవి. ఇలాంటి నిష్కపట ప్రేమకే భగవంతుడు లొంగుతాడని శాస్త్రాలు చెప్తున్నాయి. సమస్త ప్రపంచాన్ని తృణప్రాయంగా త్యజించి, భగవంతుని కోసం విలపించడం చాలామంది మహాత్ములు చేసిన

పనినే సహజ స్వభావంతో సత్య నారాయణ కూడా చేస్తున్నాడు. దానికి తగ్గ ఫలితాన్ని సత్యనారాయణకి రామ చంద్ర ప్రభువు ప్రసాదించాడు.

ఓరోజు ఆకాశం నిండా ఉన్న వానర వీరుల మధ్య, కోటి మన్మథులు కూడా సాటిరాని సౌందర్యంతో సీతామాతతో సహా రామచంద్రుడి దర్శనం సత్య నారాయణకి లభించింది. ఆనందం పట్టలేక సత్యనారాయణ చాలాసేపు పాడుతూ భజన చేశాడు.

ఓరోజు సత్యనారాయణ అస్వస్థురా లైన తన తల్లికి మందు తీసుకురావడానికై భార్యాపిల్లలతో ఎద్దుల బండి మీద వేరే గ్రామానికి వెళ్తున్నాడు. ఇంతలో ఎద్దు లు అనక వేసుకున్నాయి. బండి వెనక ఉన్న సత్యనారాయణ తోలేవాడ్ని కూర్చోమని చెప్పి, బండి దిగి వెళ్లి జోడు ఎద్దులని సవరిస్తూ అనక తీస్తుండగా తల వంచుకుని ఉన్న ఓ ఎద్దు తల విసిరింది. దాని కొమ్ము సత్యనారాయణ మర్మస్థానంలో కొంతభాగాన్ని చీల్చివేసింది. రక్తం కారుతూ సత్యనారాయణ నేల మీద స్పృహ లేకుండా పడిపోయాడు. బండి తోలేవాడు అరిచిన అరుపుకి సత్యనారాయణ భార్య యశోద బండి దిగి గబగబ అతని దగ్గరకి పరిగెత్తింది. ఇద్దరూ కలిసి లేవదీసి అతన్ని బండిలో పడుకోబెట్టారు. బండివాడు బండిని వైద్యుడి దగ్గరకి తోలుకెళ్లసాగాడు.

కొన్ని తేళ్లు గుమిగూడి కరిచినంత బాధపడుతూ, సత్య నారాయణ భగవన్నామాన్ని గట్టిగా పైకి జపించసాగాడు. బండి ఇల్లు చేరాక ఇద్దరు మహమ్మదీయులు వచ్చి లావు సూదితో ఆరంగుళాల మేర చీలిన చోట చర్మాన్ని కుట్టారు. కాలిన పుండు మీద కారం చల్లినట్లుగా బాధ పడుతూ కూడా, ఆ పట్టలేని బాధలో కూడా 'పాండురంగా! కృష్ణా! రామచంద్రా!' అంటూ దైవ నామ స్మరణతో ఆ బాధని అణచడానికి శత విధాల ప్రయత్నం చేశాడు. నెల దాకా ఆ గాయం మానలేదు. సత్యనారాయణకి వైద్యంలో కొంత ప్రవేశం ఉ ంది కాబట్టి చికిత్స చేసిన వారు విప్పాల్సిన కుట్లని తానే విప్పుకున్నాడు. ఆ విధంగా ప్రారబ్ధ బాధని సత్యనారాయణ అనుభవించాల్సి వచ్చింది.

సత్యనారాయణకి ముప్పైయ్యవ ఏడు వచ్చేసరికి రాముడి మీద గల ప్రేమ కృష్ణుడి మీదకి మళ్లింది. పూర్వం రాముడ్ని ఎలా భజించాడో అదేవిధంగా ఆ స్థానంలో కృష్ణుడ్ని భజించ సాగాడు. 'ఈ మార్పు చాలా విచిత్రం' అని సత్యనారాయణ చాలా సంద ర్భాల్లో చెప్పాడు.

ఓ రాత్రి సత్యనారాయణకి ఓ కల వచ్చింది. ఉద్యాణ బాబా అనే ఓ గొప్ప మహాత్ముడు ఆ కలలో కనిపించి 'నాయినా! నీకు వీటి అవసరం ముందు, ముందు రాగలదని వీటిని నీకు ఇస్తున్నాను'. అని ఏది తీసినా ఇంకా వచ్చే అక్షయ జోలెని ఇచ్చి చెప్పాడు. 'నాయినా! దీనిలో ఓ రూపాయ, ఓ కొత్తబట్ట, పిడికెడు తండులాలు ఉన్నాయి. వీటిని ఎంత తీసినా ఇంకా వస్తాయి.' అని దాన్ని సత్యనారాయణకి ఇచ్చి, అతని శరీరమంతా నిమిరి అదృశ్యమయ్యాడు. కొద్దిసేపటికి అతని దగ్గరకి ఇద్దరు వచ్చారు. ఒకడు 'అయ్యా! స్నానం చేసాక నాకు తుడుచుకోడానికి వస్త్రం లేదు. ఒకటి ఇప్పించండి.' అని అడిగాడు. ఉ ద్యాణ బాబా ఇచ్చిన జోలెలో చేతిని పెట్టి తీస్తే ఓ బట్ట బయటకి వచ్చింది. కాని అందులో మళ్లీ ఇంకో బట్ట ఉండటం సత్యనారాయణ గమనించాడు. రెండోవాడు తనకి డబ్బివ్వమని కోరితే, ఆ జోలెలో చెయ్యిపెట్టి తీస్తే ఓ రూపాయ వచ్చింది. చూస్తే అందులో ఇంకో రూపాయ మిగిలి ఉంది. ఆవిధంగా ఆ జోలె లోంచి ఏది తీసినా ఇంకోటి మిగిలిపోతుంది. ఆ మహాత్ముడి కృపకి సత్యనారాయణకి బాగా ఆనందం కలిగింది. ఇంతలో అతనికి మెలుకువ వచ్చింది.

బహుశా భవిష్యత్తులో స్వామి సేవా విధులకి తనకి కొరత ఉండదన్న దానికి సూచనే ఆ కలగా భగవంతుడు కల్పించి ఉంటాడని సత్యనారాయణ భావించాడు. సత్య నారాయణ దగ్గరికి వందల కొద్దీ జనం ఉపదేశం కోసం వచ్చి వెళుతున్నారు. కానీ తనకి లభించిన అఖండ గౌరవాన్ని అతను పట్టించుకోక భగవత్పరవశంతో ఉండసాగాడు. అయితే భగవత్ తత్వోపదేశానికి కానీ, భగవదన్వేషణ సాధనాలు గానీ పారమార్థిక పద్ధతులు గానీ అనుసరించే వాతావరణం సత్యనారాయణ నివసించే మరుకూకు గ్రామంలోగానీ, అతను సంచరించే చుట్టుప్రక్కల గ్రామాల్లోగానీ లేదు. ఆ కొరత తీర్చడానికా అన్నట్టుగా ఓ రోజు జగన్నాథుడు సత్యనారాయణకి ఓ కలలో కనబడి చెప్పాడు.




"అంగడిపేటలో రాజాధిరాజ బిరుదు గల మాణిక్యప్రభువు అంశ అయిన జీవన్ముక్తులు, మహాయోగి అయిన రాంబాబా మహారాజు అనే ఒకరు ఉన్నారు. ఆయన నీకు మహావాక్యాన్ని ఉపదేశిస్తారు." తక్షణం రాంబాబా దర్శనమిచ్చి 'తత్వమసి' వాక్యాన్ని చూపుడువేళ్లు, బొటనవేళ్లని కలిపి చూపించి ఉపదేశించారు.

"నాయనా! సర్వవ్యాపక శుద్ధ విద్యకి ఉపాధిగా ఉండే మహాచైతన్యమే 'త్వం' అంటే, 'అసి' అంటే అవిద్యకి ఉపాధిగా ఉన్న, పరిచ్ఛిన్నమైన జీవచైతన్యమే నువ్వు అని అర్థం." ఆ తత్వోపదేశం అయ్యాక సత్యనారాయణ వెన్న కోసం పెరుగుని చిలికినట్టుగా ఆ మహోపదేశం యొక్క అర్థాన్ని ఎప్పుడూ మననం చేసుకునేవాడు అఖండ కృష్ణ భక్తితో భజనలు, ప్రార్థనలు చేసేవాడు.

ఏమాత్రం సమయం చిక్కినా చెట్ల మధ్య, నదులు పారే చోట, పర్వత చరియల్లో గంటలకొద్దీ పరమేశ్వర ధ్యానంలో, పారమార్థిక చింతనతో గడపసాగాడు. అయితే కనీసం ఒక్కరైనా ఇతన్ని అనుసరించి వెంటవెళు తుండేవారు. సత్యనారాయణ వద్దని ఎవరినీ వారించకపోయినా ఒంటరితనాన్ని తీవ్రంగా అభిలషించేవారు. పడుకునేటప్పుడు మాత్రం పడకగదిలో ఒంటరిగా లోపల తలుపుకి గడియవేసి పడుకునేవాడు.

వరుసగా మూడు రాత్రుళ్లు ఓ యోగిపుంగవుడు వచ్చి యోగసాధనలకి అవసరమైన ధ్యాన, ధారణ, ప్రత్యాహారాలని, ఆసనాలని, ఇతర సదరు విషయాలని అభినయంతో బోధిం చాడు. అయితే కలలో కనబడి ఆ మహాయోగి చెప్పినదంతా కేవలం పరోక్ష జ్ఞానం. కానీ ఆ జ్ఞానం తనకి ప్రత్యక్షంగా అనుభవానికి రావాలని సత్యనారాయణ అలమటించసాగాడు.

ఓ రోజు వెంట ఎవరూ లేకుండా ఒంటరిగా గ్రామం బయటగల ఓ చోటుకి వెళ్లి ఓ మామిడి చెట్టు వేరు మీద కూర్చుని కళ్లు మూసుకుని పరమాత్మ ధ్యానం చేయసాగాడు. అకస్మాత్తుగా అతనికి స్వరూప సాక్షాత్కారం కలిగింది. ప్రపం చాన్ని, శరీరాన్ని విస్మరించి నది మహాసముద్రాన్ని చేరినట్టుగా అఖండాత్మ విజ్ఞాన మహాసాగరంలోకి ప్రవేశించాడు. ఎటు చూసినా దివ్య స్వరూప దర్శనమే కలగసాగింది. మహాత్ములు పొందిన అపరోక్షానుభూతి ఆనాడు అతనికి లభించింది. జీవన్ముక్త సామ్రాజ్య సార్వభౌములయ్యారు. ఆనాటి నుండి 'రామకృష్ణ హరి' అనే పూర్ణ విగ్రహాన్ని పూజిస్తూ భజనల్ని చేయసాగాడు.

స్వప్నంలో తనకి గురువుగా దర్శనమిచ్చిన పాండురంగ మూర్తిని, రుక్మిణీదేవిని తన గ్రామానికి తీసుకురావడానికని ఓరోజు పండరీపురం వెళ్లాడు. విగ్రహాలని అమ్మే దుకాణాల న్నింటినీ తిరిగి తనకి నచ్చే విగ్రహం కోసం వెదకసాగాడు. కానీ దుకాణాల్లో ఏ ఒక్క విగ్రహం సత్యనారాయణకి నచ్చలేదు.

చిన్నప్పటి నుంచే సత్యనారాయణకి మహాత్ములన్నా, దైవ మూర్తులన్నా, యాత్రలన్నా ఆసక్తి. మహిపతి మహారాజనే ఓ మహాత్ముడు ఓ మఠంలో ఉ న్నాడని ఎవరో చెప్తే తెలిసి సత్య నారాయణ తక్షణం ఆయన దర్శనం కోసం వెళ్లాడు. ఆయన సత్యనారాయణ వంక చూసి దగ్గరికి రమ్మని పిలిస్తే ఇంకొకడు తననే పిలిచాడనుకుని లేచి ఆ మహాత్ముడి దగ్గరకు వెళ్లాడు.

'నిన్ను కాదు' అని ఆయన సత్యనారాయణని తన దగ్గరికి పిలిచి తన దగ్గర ఉన్న జ్ఞానేశ్వర్ మహారాజ్ రాసిన జ్ఞానేశ్వరి 12వ అధ్యాయాన్ని ప్రసాదంగా ఇచ్చాడు. ఆ తరువాత సత్య నారాయణ ఆ గ్రంథాన్ని వందలకొద్దీ ముద్రణలు చేయించి ఆశ్రితులకి పంచిపెట్టి, వారిలో భక్తి భావాన్ని పెంపొందించే ప్రయత్నం

చేశాడు.

మరునాడు విగ్రహాలమ్మే వీధిలోకి వెళ్లి చూస్తుంటే ఇంకా పూర్తికాని ఓ విగ్రహం అతన్ని ఆకర్షించింది. దాని మొహంలోని సౌమ్యతను గమనించి దాన్నే తీసుకెళ్లాలని నిర్ణయం చేసు కున్నాడు. కానీ ఇంకా విగ్రహం చెక్కడం పూర్తికాలేదని ఆ శిల్పి చెబితే, మర్నాడు వచ్చి తీసుకుంటానని దాన్ని ఇంకెవరికీ అమ్మవద్దని సత్యనారాయణ చెప్పాడు. మరునాడు ఏమాత్రం బేరమాడకుండా శిల్పి కోరినంత డబ్బు ఇచ్చి ఆ విగ్రహాన్ని కొన్నాడు. ఆ రుక్మిణీ సహిత పాండురంగ విగ్రహంతో సత్య నారాయణ అంగీరస సంవత్సర వైశాఖ శుద్ధ పంచమి నాడు మే 1932లో అంతా భజనలు చేస్తూ వెంటరాగా పండరీపురం నుంచి కాలి నడకనే మరుకూకుకు చేరుకున్నాడు. దాన్ని మరునాడు నిర్ణయించుకున్న మందిరంలో స్థాపించాడు. కొద్ది రోజుల తరువాత ఆషాఢ శుద్ధ ఏకాదశి నాడు 'ఆషాఢి పాండురంగస్వామి ఉత్సవం' ఆరంభించాడు. సత్యనారాయణ మరుకూకులో తన ఇల్లు సరిపోకపోవడం వల్ల ఇల్లు పెద్దది చేసుకునేందుకు రాయిని, కట్టెని సిద్ధపరచుకున్నాడు. అతను ఉండే ఇంటిలోనే శ్రీకృష్ణ రాసమండలి చిత్రపటాన్ని ఓ పీఠంలో స్థాపించి, రాత్రి ఎనిమిది నుంచి పన్నెండు దాకా కాళ్లకు గజ్జెలు కట్టుకుని ఇద్దరు శిష్యులు వెంటరాగా, 'అనాథనాథ! దీనబంధో! పాండురంగా! విఠోబా!' అంటూ భజన చేస్తూ ఎలాంటి సిగ్గూ పడకుండా అందరి ముందూ భక్తిగా నృత్యం చేయసాగాడు. గ్రామంలోని స్త్రీపురుషులు ఇది చూడడానికి రాసాగారు. వీరి ఇళ్లు చాలక వీధిలో కూడా కొందరు నిలబడి చూడసాగారు. వారంతా కూడా సత్యనారాయణతో కలిసి భగవ న్నామ ఉచ్చారణని ఆనందంతో కూడిన ఉత్సాహంతో చేయ సాగారు. రాత్రి పన్నెండుకి ఆ కార్యక్రమం పూర్తి అయ్యాక అంతా ఎవరి ఇళ్లకు వాళ్లు వెళ్ల సాగారు.

సాధారణంగా మంచి కార్యక్రమాలని అడ్డుకునేవారు ఈ కలి యుగంలో ఉండనే ఉంటారు కదా! మరుకూకు గ్రామంలో కూడా కృష్ణుడు ఎవరో గుర్తించక ఆ పరమాత్ముణ్ణి నిందించిన దుర్యోధనుడి లాంటివాడు ఒకడు ఆ రోజుల్లో ఉన్నాడు. అం తా దేవుణ్ణి భజించి ఆనందిస్తుంటే, ఇతను మాత్రం దాన్ని విని

భరించలేకపోయాడు. ఆ గ్రామాధికారి అంతా వినేలా సత్యనారాయణకి ఓ వార్త పంపాడు.

"ఇంత అర్ధరాత్రి దాకా ఇంతమంది కలిసి భజన చేయడం దేనికి? ఇదంతా విపరీతంగా ఉంది. చాలామందికి నిద్ర చెడుతోంది. కాబట్టి వెంటనే ఆ భజనని ఆపేయండి."

సత్యనారాయణ భజన డంభంతో కూడినది కాదు. భగవంతుని మీద ఆర్తితో కూడిన ప్రేమలోంచి వచ్చింది. మహాపురుషులకి లోకభీతి ఉండదు. కాబట్టి అతను భజనని ఆపలేదు. మర్నాడు రాత్రి కూడా యథాప్రకారం సత్యనారా యణ భజన, నృత్య కార్యక్రమాలని తన ఇంట్లో నిర్వహిం చాడు. మర్నాడు కూడా గ్రామాధికారి భజనని ఆపేయమని ఒకరితో వార్తను పంపాడు. ఆ రాత్రి కూడా సత్యనారాయణ తన కార్యక్రమాన్ని నిలపలేదు. ఆ రాత్రి భగవంతుణ్ణి ప్రార్థిం చాడు.

"స్వామీ! అతను కూడా నీ బిడ్డడే కదా, అతనికి దీనిమీద ఎందుకు విముఖతని కలిగిస్తావు? నీ నామ రుచిని అతను కూడా ఆస్వాదించేలా అనుగ్రహించు."

మూడో రాత్రి కూడా ఎనిమిదికి భజన, నృత్యం మొదలయ్యాయి. గ్రామాధికారి చేతిలో బేటరీ లైట్‌తో స్వయంగా వచ్చి సత్యనారాయణతో శాసనంగా చెప్పాడు.

"భజనలు ఇంక మీదట రాత్రిళ్లు చేయక."

"ఇదేమీ పెద్ద పట్టణం కాదుకదా! అయినా ఇది చెడుపని కాదుకదా! భగవత్ భజనని ఆపడం న్యాయమా?" ప్రశ్నించాడు సత్యనారాయణ.

అతనేం బదులు చెప్పకుండా వెళ్లిపోయాడు.

కానీ, నాలుగో రాత్రి కూడా భజనలు మొదలవగానే ఆ గ్రామాధికారి వచ్చి భజనలు ఆపమని గట్టిగా మందలించాడు. ఆ రాత్రి కార్యక్రమం ముగిసిన తరువాత సత్యనారాయణ తన భార్యతో చెప్పాడు.

"భగవత్ భజనకి ఈ గ్రామం గొప్ప ఆటంకంగా ఉంది. అది లేకుండా నేనుండలేను. భగవన్నామం సాగడానికి అవకాశం లేని ఈ గ్రామం నాకెందుకు? ఎక్కడ నాకా అవకాశం ఉంటుం దో అదే నా గ్రామం. అక్కడే నేను నివశిస్తాను. గ్రామాధికారి బెదిరింపు ఉన్న గ్రామంలో ఉండాల్సిన అవసరం నాకేమిటి? కోట్ల రూపాయలనైనా వదలగలను గానీ, స్వామి భజన లేకుండా నేను బ్రతకలేను. బృందావనం, కాశీ, చిత్రకూటం మొదలైన చోట్ల నా స్వామి భజన నిరాటంకంగా సాగే అవకాశం ఉంటుంది. కాబట్టి నేను అక్కడికి వెళ్తాను.

❖ ❖ ❖



సత్యనారాయణ సర్వ స్వతంత్రుడు తప్ప దేనికీ లొంగిన వాడు కాడు. కాబట్టి తను బాల్యం నించి ఉంటున్న గ్రామాన్ని త్రుటిలో త్యజించగలిగాడు. మర్నాడు సత్యనారాయణ గ్రామాన్ని వదిలి వెళ్ళిపోతున్నాడన్న వార్త మరుకూకు అంతా పాకి పోయింది. చాలామందికి అతను వెళ్లకూడదని ఉన్నా, అతని ముందుకు వచ్చి వెళ్లద్దని సత్యనారాయణకి చేప్పే ధైర్యం గలవారు వారిలో ఎవరూ లేరు.

చివరికి అంతా ఓ వైశ్యుడ్ని ముందు పెట్టుకుని, వెళ్లద్దని కోరడానికి సత్యనారాయణ ఇంటికి వెళ్లారు. అప్పటికే అతను ఆదివారం నాడు వెళ్లాలని నిర్ణయం చేసుకున్నాడు. జనం అతన్ని వెళ్లద్దని గట్టిగా నివేదించమని వైశ్యుడ్ని ముందుకి తోసారు. అతను సత్యనారాయణతో వినయంగా చెప్పాడు.

“స్వామీ! మీరు రేపే గ్రామం ఖాళీ చేసి వెళ్తారని తెలిసింది. మీరు వెళ్లకూడదన్నది మా కోరిక. ఒకవేళ వెళ్లాలనుకుంటే రేపు ఆదివారం కాక ఎల్లుండి సోమవారం వెళ్లమని ప్రార్ధన.”

“అలాగే.” ఒప్పుకున్నాడు సత్యనారాయణ.

వారిద్దరి మాటలు విని నెవ్వెర పడ్డ జనం ఆ వైశ్యుడ్ని నిలదీసారు.

"ఇదేమిటి? నేను మీకు చెప్పిందేమిటి? ఆయన్ని అసలు మన గ్రామం విడిచి వెళ్లద్దని కదా చెప్పమన్నది? మరి నువ్వు సోమవారం వెళ్లమని అన్నావెందుకు?"

"నేనిలా అంటానని ఆ మాట నా నోట్లోంచి వచ్చేదాకా నాకే తెలీదు." చెప్పాడు ఆ వైశ్యుడు. చేసేది లేక అంతా నుదుళ్లు కొట్టుకుని వెళ్లిపోయారు. ఆయన చేతుల మీదుగా పాండురంగ ఆశ్రమ నిర్మాణం జరగాల్సి ఉండగా, దాన్ని సాధారణ మనుషులు మార్చలేరు కదా!

సోమవారం నాడు సత్యనారాయణ వెళ్లిపోతా డని తెలిసిన ఓ గ్రామస్థుడు సత్యనారాయణ దగ్గరకి వచ్చి చెప్పాడు.

"స్వామీ! మీరు గ్రామాన్ని వదిలి వెళ్లకండి. మీరు ఉంటానని నాకు మాట ఇచ్చేంతదాకా నేను భోజనం ముట్టను."

"సత్యాగ్రహాలు చేయక. నేను మాత్రం ఇంక ఈ గ్రామంలో ఉండలేను. నా భజన జరిగే చోటే నేను ఉండేది. నా నిర్ణయం మారదు."

"పోనీ గ్రామంలో ఉండకపోయినా మన గ్రామ పొలిమేరల్లో ఎక్కడైనా ఉండండి స్వామీ. అందువల్ల మేమంతా నిన్ను దర్శించుకోగలుగుతాం. మీకు నచ్చిన చోట ఉండండి. అది నా భూమే అయితే ఇక సమస్యే లేదు. ఒకవేళ అది వేరే ఎవరి భూమి అయినా, నా భూమి వారికి మార్పిడి చేసి అది మీకు అప్పగించేలా చేస్తాను." భక్తిగా కోరాడు అతను.

సత్యనారాయణ కొద్దిసేపు ఆలోచించి అందుకు ఒప్పుకుని, పటేలుతో కలిసి, గ్రామానికి దక్షిణ భాగంలో తనకి అనుకూలమైన భూమికోసం చూస్తూ, ఎక్కడా ఇష్టపడక మూడు మైళ్ల దూరం వచ్చాడు. ఓ చోట ఎత్తైన రాళ్లు, గుళ్లు, చెట్లు, పొదలు గల బీడు నేలని చూసి అక్కడ ఉండటానికి ఇష్టపడ్డాడు. అదృష్టవశాత్తు దాని యజమాని అతని వెంట ఉన్న పటేలే. ఆ పటేలు సంతోషించి ఎనిమిది ఎకరాల నేలని సత్యనారాయణకి దానం ఇచ్చాడు.

ఆ ప్రదేశానికి 'జంగము పడె, జంగము రాళ్లు' అనే పేర్లు న్నాయి. ఎనిమిది వందల ఏళ్ల క్రితం అది జంగమ మఠాధిపతిగా ఉన్న సత్యనారాయణదే.

ఆ పూర్వ జన్మ కర్మాను బంధాన్ని బట్టి ఆ నేల సత్యనారాయణ చేతికి మళ్లీ వచ్చింది. అంతా కలిసి తిరిగి గ్రామానికి వెళ్లారు.

ఇంటికి వెళ్లాక తన కుటుంబ సభ్యులతో సత్యనారాయణ చెప్పాడు.

"స్థల నిర్ణయం అయింది. నేను ఒక్కడ్నే వెళ్లి అక్కడ ఉం టాను. చుట్టుపక్కల ఎవరూ లేనిచోటికి మీరు రావద్దు. మరుకూకులోనే మీరు ఉండండి."

కాని భార్య యశోద, సోదరి నర్సమ్మ మాత్రం అందుకు అంగీకరించలేదు. తాము కూడా వచ్చి అతనితోనే ఉంటామని గట్టిగా చెప్పారు. దాంతో సత్యనారాయణ వారితోను, ఇంకా తన ఏడునెలల, ఏడేళ్ల కొడుకులు ఇద్దరితోను, 1933 జనవరిలో ఇల్లు కట్టడానికి తెచ్చిన వాసాలు, రాళ్లు ఇతర సామాగ్రి అంతా వదిలి వెళ్లారు. అక్కడ చిన్న గుడిసె కూడా లేదు. రాళ్లు, గుట్టలు, బండలతో నిండిన ఆ అడవిలో ఎప్పుడు ఏ ప్రమాదం తేళ్లు, పాములు, లేదా పెద్దపులి ఏ రూపంలో వస్తుందో తెలియని పరిస్థితి.

ముందర మట్టితో ఓ అరుగులాంటిది నిర్మించి, దాని మీద పాండురంగస్వామి విగ్రహాన్ని ఉంచి, కాసేపు అంతా భజన చేసారు. తర్వాత ఎండిన ఆముదపు కట్టలతో, చొప్ప కట్టతో చిన్న గుడిసెలు వేసి చంటిపిల్లని పడుకోబెట్టారు. ఓ చోట వంట చేసుకుని తిని తిరిగి భజనని కొనసాగించారు. బుసలు కొడుతూ పాములు చొప్పకట్టల్లోకి దూరేవి కాని పాండురంగడి శాసనమా అన్నట్లుగా ఎవరినీ ఏమీ చేసేవి కావు. సత్యనారాయణ పాముని, తేలుని చంపద్దని శాసనం చేసాడు. దానికి పాండురంగాశ్రమం అనే పేరు పెట్టాడు.

ఆశ్రమానికి పశ్చిమ దిక్కున ఓ తీర్థం ఉండి. అది ఏనాటిదో కాని, వందేళ్ల క్రితం నించి దాని గురించి అందరికీ తెలుసు. ఆ చెలిమెలో నీరు ఎప్పుడూ ఎండిపోదు. ఎప్పుడూ అందులో తాజా నీరు లభ్యం అవుతుంది. దానికి సత్యనారాయణ 'హరిగంగ' అనే పేరు పెట్టి, అందులోని నీటిని నీరు లేదా జలం అనకూడదని, గంగ అనాలని శాసనం చేసాడు.

ఆశ్రమానికి వాయవ్య దిక్కున గజమున్నర విస్తీర్ణం గల ఇంకో తీర్థం ఉంది. పూర్వం దానికి జంగము పడె అని పేరు. అది మూరెడు లోతు మాత్రమే

ఉండి లోపల ఇసక ఉంటుంది. కాని సత్యనారాయణ దానికి చంద్రభాగ అనే పేరు పెట్టాడు. దాని చుట్టూ ఎత్తుగా ఉన్న ఏ ప్రదేశంలో బావి తవ్వినా ఇరవై గజాల లోతులో నీళ్లు పడతాయి. హరిగంగ, చంద్రభాగ వారి నీటి అవసరాలని తీర్చసాగాయి.

ఓసారి ఓ యువతి నీటి కోసం వెళ్తూండగా ఓ చిరుతపులి ఎదురయ్యింది. కాని అది ఆమెని ఏమీ చేయకుండానే వెళ్లిపోయింది. చుట్టుపక్కల ఎన్ని క్రూరమృగాలు తిరుగుతున్నా అవి ఎవరినీ ఏమీ చేసేవి కావు. గ్రామాలనించి ఆ అరణ్యానికి వందలకొద్దీ మనుషులు ప్రవచనం వినడానికి వచ్చి వెళ్లసాగారు. గోడలు కట్టి వాటి మీదకి వాసాలు ఎక్కించి గుడిసెలు వేయసాగారు. సత్యనారాయణ స్వయంగా ఆ వాసాలకి మేకులు కొట్టేవాడు.

గ్రామం నించి పంపించినా ఆ గ్రామాధికారి అంతటితో ఊరుకోలేదు. పాండురంగాశ్రమానికి అర క్రోసు దూరంలో అతనికి కొంత భూమి ఉంది. అతడు తన సేవకుడితో కలిసి అక్కడికి వచ్చి దూరంగా ఉన్న పాండురంగాశ్రమాన్ని చూస్తూంటే వారికి ఆశ్రమ భూమి చుట్టూ మెరుపులా దాన్ని రక్షించే ఓ దివ్య చక్రం కనిపించింది.

ఆ సంగతి అతనే స్వయంగా అందరితో చెప్పాడు. అయినా దుష్టబుద్ధిగల అతను అంతటితో ఊరుకోలేదు.

అమీను సాహెబు దగ్గరకి వెళ్లి, సత్యనారాయణ విషయంలో అబద్ధపు ఆరోపణలు చేసి చెప్పాడు.

"ఊరులో వుండకుండా అడవిలో వాళ్లు ఉంటున్నారు. వీరి రక్షణ బాధ్యత ఎవరిది? మీరే వచ్చి చూడండి."

వాళ్లని అక్కడనించి ఖాళీ చేసి తిరిగి గ్రామానికి వెళ్లమని చెప్పడానికి అమీను సాహెబుని అతను ఆశ్రమానికి తీసుకువచ్చాడు. కాని అక్కడికి చేరుకున్నాక ఆ ప్రదేశం చాలా బావుందని చెప్పి అమీను అతనితో చెప్పాడు.

"సత్యనారాయణకి ఎక్కడ ఇష్టం ఉంటే అక్కడ ఉండ నివ్వండి. దానివల్ల మీకేం నష్టం వచ్చింది? వారి జాగ్రత్త మీరే చూడాలి." తనని తెచ్చినతన్నే

చివాట్లుపెట్టి అమీను సాహెబు వెళ్లిపోయాడు.

అంతటితో ఆ గ్రామాధికారి ఊరుకోలేదు. ఆశ్రమానికి తూర్పుభాగంలో ఓ మహమ్మదీయుడికి కొంత స్థలం ఉంది. అతని దగ్గరకి వెళ్లి అతనితో చెప్పాడు.

"నీ భూమి ఆశ్రమంలో కలిసిపోయింది. ఆశ్రమంలోని సగభాగం భూమి నీదే. నువ్వు తగిన చర్య తీసుకోకపోతే అది అన్యాక్రాంతం అవుతుంది."

ఆ ముస్లిం అతన్ని వెంట తీసుకుని మళ్లీ పాండురంగా శ్రమానికి వెళ్లాడు. ఆ ముస్లిం అతను భూమి గురించి గొడవ చేస్తే, సత్యనారాయణ మీద కత్తి కట్టిన అతను కూడా అందుకు వత్తాసు పలికాడు. సత్యనారాయణ తన శత్రువుని కూర్చోపెట్టి చెప్పాడు.

"నాయినా! మొదటి నుంచీ నువ్వు నాతో వ్యతిరేకంగానే ప్రవర్తిస్తున్నావు. నీ నిర్బంధానికి తలవంచి నేను అడవిలోకి వచ్చి జీవిస్తున్నాను. అయినా వదలక నువ్వు ఇక్కడికి కూడా వచ్చి, నామీద ఈ అసత్య భూ వివాదాన్ని ఆరోపిస్తున్నావు. ఐనా నీ మీద నాకు కోపం లేదు. నేను నిన్ను నే విషయంలోనూ ఇలా చేయమని ప్రార్థించడం లేదు. సత్యస్వరూపుడైన భగవానుడు మాత్రం నీ చర్యలన్నిటినీ చూస్తున్నాడని మరవక. ఆయన దృష్టి నించి నువ్వు తప్పించుకోలేవు. ఈ లోకంలో కాని, పర లోకంలో కాని నువ్వు దీనికి తగిన ప్రతిఫలం అనుభవించాల్సి వుంటుంది అని గ్రహించు. భగవానుడు నీ తప్పుకి శిక్ష వేసేప్పుడు నిన్ను రక్షించేవాడు ఈ ప్రపంచంలో ఎవరూ ఉండరు. కాబట్టి మేలుకుని బాగుపడు. తర్వాత నీ ఇష్టం."

సత్యనారాయణ మాటలు ఓ చీపురులా పనిచేసి, ఆ వ్యక్తి హృయయంలో గూడు కట్టుకుని ఉన్న మాలిన్యమంతా తుడిచిపెట్టుకు పోయింది. అతను సత్యనారాయణకి సాష్టాంగ నమస్కారం చేసి ఇక మీదట ఎలాంటి తప్పు చేయనని, తనని మన్నించమని వేడుకున్నాడు. బహుశ పాండురంగాశ్రమం నేడున్న చోట రావడానికి ఈ వ్యక్తి భగవంతుడి చేతిలో ఓ పరి కరం అయివుండచ్చు. లేకపోతే సత్యనారాయణ తన ఇంటికే పరిమితమై ఉండేవాడేమో? అప్పుడు

మనకీ ఆశ్రమం లభ్యం అయివుండేది కాదు.

ఆశ్రమంలో వేసుకున్న గుడిసెలో చంటిపిల్లకి ఊయల కట్టి అందులో పడుక్కోపెట్టేవారు. చిన్నపిల్ల అక్కడా ఇక్కడా ఆడు తూండేది. సత్యనారాయణ పరివారంలోని ఎవ్వరికీ ఏ భయం లేదు. ఎవరైనా భయపడ్డా అతను వారితో ఇలా చెప్పేవాడు.

“ఏ మృగం ఏం చేస్తుంది. మనం వాటితో క్రూరంగా ఉంటేనే మనకి అవి ప్రమాదకరం తప్ప మనం సౌమ్యంగా ఉంటే, అవి కూడా సౌమ్యంగానే ఉంటాయి. అన్నిటికీ ఆ పాండురంగడే ఉన్నాడు. మనం చేయాల్సిందల్లా ఆయన్ని భక్తిగా భజించడమే.”

చిన్న పిల్లల ఊయలలకి పైన అందంగా ఉండే చిలకలు, ఇతర ఆట వస్తువులు కడతారు. కాని ఆ చిట్టి పాప ఊయల ఉన్న గుడిసెలోకి ఓ రోజు పాము వచ్చి పిల్లవాడికి మూరెడు పైభాగాన ఉన్నది. యశోదాదేవి, సత్యనారాయణ దాన్ని చూశారు కాని, అది తమ పిల్లవాడ్ని కరుస్తుందన్న భయంతో దాన్ని వెళ్లగొట్టే ప్రయత్నం కాని, ఊయల లోంచి ఆ పిల్లవాడ్ని బయటకి తీయాలన్న ప్రయత్నం కాని ఏం చేయలేదు. ఆ పాండురంగడే అన్నీ చూసుకుంటాడన్న నమ్మకంతో వారు దాంట్లో కల్పించుకోలేదు. పురాణాల్లో మహాఋషుల ఆశ్రమాల్లో క్రూరమృగాలు, సాధు జంతువులు స్నేహంగా జీవించేవని రాశారు. దాన్ని ఆ నాడు ప్రజలు పాండురంగాశ్రమంలో ప్రత్య క్షంగా చూశారు.

ఓ రోజు గుడిసెలోకి పద్దెనిమిది నల్ల తేళ్లు వచ్చాయి. వాటిని చూసి కొన్నిటిని వాటి దారిన వాటిని పోనిచ్చి, కొన్నిటిని తీసివేసి, నిశ్చింతగా దైవ భజనని చేస్తూనే ఉన్నారు. తర్వాత నిర్భయంగా పడుకున్నారు. చిన్నప్పటినించే ప్రమాదకరమైన వాటి మధ్య పెరిగితే, వాటి మీద భయం ఏర్పడదు. ఉదాహరణకి తమిళనాడులోని కొన్ని గ్రామాల్లో పాములు విచ్చలవిడిగా తిరుగుతూంటాయి. ఆ గ్రామస్థులు పాముల మీద జీవిస్తూం టారు. కాని వారికి చిరుతపులులని చూస్తే మాత్రం భయం ఉంటుంది. ఎందుకంటే వారికి అవి ప్రమాదకరమైనవన్న నమ్మకం ఉంటుంది. కాని సత్యనారాయణ లాంటి కొందరి

విషయంలో ఏర్పడే నిర్భయత్వానికి కారణం వాటి మధ్య పెరగడం వల్ల కాక, భగవద్ భక్తే. సంపూర్ణ శరణాగతే నిజమైన భక్తి. అది మనిషికి ఏ విషయంలోనూ భయాన్ని కలిగించదు.

పూర్వజన్మ సుకృతం వల్ల భగవంతుడి మీద సంపూర్ణ శరణాగతి ఎవరికీ ఏర్పడదు. అది కలిగితే అప్పుడు తన బాగోగులని ఆ పరమాత్మడే చూసుకుంటాడన్న విశ్వాసం వారిలో కలుగుతుంది. ఆ విశ్వాసం గలవారికి ప్రపంచంలోని ఏదీ భయాన్ని కలిగించలేదు. అలాంటివారు, సాధారణ మనుషులు భయపడే చాలా వాటిని పరమాత్మ రూపాలుగా భావించి వాటినించి అపాయాన్ని ఊహించరు. పూర్వం ఋషులు నిర్భయంగా అడవుల్లో తపస్సు చేసుకోడానికి ఇదో కారణం.

సత్యనారాయణ సమకాలీనుడైన ఏర్పేడులో ఆశ్రమాన్ని నెలకొల్పిన శ్రీమళయాళ స్వామి కూడా ఇతని లాగే తిరుమల లోని నిర్మానుష్యమైన గోగర్భంలో, విష జంతువులు, పెద్దపులుల మధ్య ఒంటరిగా పన్నెండేళ్ల పాటు తపస్సు చేసుకున్న విషయాన్ని ఇక్కడ గుర్తు చేసుకోవచ్చు.

సుందరశాస్త్రి అనే ఒకతను ఆత్మ సాక్షాత్కార అభిలాషతో సత్యనారాయణని ఆశ్రయించాడు. శూలనొప్పి సత్యనారా యణకి శాశ్వత బంధువైంది. తరచు శూలనొప్పి వస్తూండేది. వెంటనే సోడా, నిమ్మరసం, పంచదార కలిపిన నీటిని ఇస్తే ఉపశమించేది. ఆ నొప్పి ఏ రాత్రి వస్తుందో అని సుందరశాస్త్రి అతన్ని కనిపెట్టుకుని ఉండేవాడు. సత్యనారాయణ బాధగా మూలగగానే ఎంత రాత్రైనా లేచి వాటిని కలిపి అతనికి ఇచ్చేవాడు. తను గురువుగా భావించే సత్యనారాయణ సూచన ప్రకారం సుందరశాస్త్రి కొంతకాలం సూర్యోదయం, సూర్యాస్తమయం కూడా చూడకుండా రామ తారక మంత్రాన్ని ఆరుకోట్ల సార్లు కొన్ని నెలల పాటు శ్రమించి చేసాడు. తన మూడు నెలల పసిపాపతో, తమ్ముడు, ఇతరులతో రోజుకి పన్నెండు మైళ్ల చొప్పున నడుస్తూ, ఒక్కపూటే భోజనం చేస్తూ, కాలినడకన మూడు నెలలకి పండరిపురం చేరుకుని పాండురంగ విఠలుడి దర్శనం చేసుకున్నాడు. తిరిగి అదే ప్రకారం కాలినడకన వెనక్కి తిరిగి వచ్చాడు. పెద్దగా

ఆదాయం లేకపోయినా, సికింద్రాబాదు లోని తన ఇంట్లో సుందర శాస్త్రి నిత్యం ముప్ఫై ముందికి భోజనం పెట్టేవాడు. డబ్బు ఖర్చు చేసి చండీ యాగం లాంటి అనేక యాగాలు చేసేవాడు.

ఓసారి సత్యనారాయణ అధ్యక్షులుగా ఆధ్యాత్మిక సభని ఆశ్రమంలో జరిపారు. పదమూడు మందిని దానికి ఆహ్వానిం చారు. కాని సుందర శాస్త్రి ఇంకా ఎక్కుమంది రావచ్చునుకుని ఏభై మందికి సరిపడే సంభారాలు ఆశ్రమానికి తాసుకువచ్చాడు. కాని పదిహేను వందల మంది ఆ సభకి వచ్చారు. ఒకరు వెంటనే హైద్రాబాద్ వెళ్లి బంగారు తీగలు అనే వెరైటీ బియ్యాన్ని తీసుకువచ్చారు.

చంద్రభాగలోంచి నీటిని మూడు చెలిమెలని తోడారు. ఒక చెలిమె స్నానానికి, మరొకటి తాగడానికి, ఇంకొకటి అన్నం వండ డానికి. వీరందరికీ కేవలం ఆ చిన్న మూడు చెలెమెల నించే నీటి ని సరిపడేలా తోడటం వచ్చిన వారందరికీ ఆశ్చర్యాన్ని కలిగించింది.

ఓ వంట బ్రాహ్మణుడు తన భార్య ప్రసూతికి సిద్ధంగా ఉందని వెళ్లడానికి తొందర పడుతున్నాడని తెలిసి సత్యనారాయణ అతన్ని పిలిచి చెప్పాడు.

“నాయనా! ఇక్కడ ఉన్న స్వామి అక్కడ కూడా లేడా? నువ్వు అక్కడ నీ భార్య పక్కన ఉన్నా, లేకపోయినా రక్షించేవాడు ఆ ప్రభువే కదా? ఆలోచించు.”

ఆ మాటలతో ఆ బ్రాహ్మణుడు ఆగిపోయాడు. మూడురోజుల పాటు జరిగిన ఆ సభ తర్వాత, ఆ బ్రాహ్మణుడి భార్య సుఖంగా మగ శిశువుని ప్రసవించిందని, తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని కబురు తెలిసింది. ఆ వంట బ్రాహ్మణుడు తన కొడుక్కి సత్యనారాయణ అనే పేరే పెట్టుకున్నాడు.

సభాసదులు కూర్చోడానికి ఓ పందిరి వేశారు. సభలయ్యాక ఆ పందిరిని విప్పుతూంటే, అందులోంచి ఏభై పాములు బయట పడ్డాయి. అవి కూడా సభకి సత్యనారాయణ ప్రవచనాలు వినడా నికి వచ్చాయేమో? సత్యనారాయణ పాటించే నియమం ప్రకా రం వాటిని ఎవ్వరూ ఏం చేయడానికి అధికారం లేదు కాబట్టి అంతా చూస్తూండిపోయారు. ఎవరినీ ఏమీ చేయకుండా వెళ్లిపోయాయవి.

శ్రీపాండురంగాశ్రమం చుట్టుపక్కల ఈ నాటికీ జనసంచారం లేదు కాబట్టి

ఇప్పటికీ అందులోకి పాములు వస్తూంటాయి. ఐనా వాటిని చంపరు. హింసకి తావు లేదు అన్న సత్యనారా యణ పాటించిన నియమాన్నే చక్కగా పాటిస్తూ, పాములు వచ్చినప్పుడు రెండు పెద్ద వాసాలతో చేసిన పొడుగాటి పటకారుతో వాటిని మృదువుగా పట్టి దూరంగా తీసుకెళ్లి వదిలేస్తారు తప్ప చంపరు.

**సంతానం**

సత్యనారాయణ తన మొదటి కొడుకుకి విశ్వనాథుడని పేరు పెట్టారు. ముత్తాత, తాత, తండ్రిలాగే ఇతనికి కూడా దైవ భక్తి అపారంగా ఉంది. సాధారణంగా ఆరేడేళ్లయితే కాని జరిగింది గుర్తుండదు. కాని చిత్రంగా విశ్వనాథుడికి మూడో ఏటనించే జరిగింది గుర్తుంది. ఎనిమిదో ఏడు రాగానే ఉపనయనం, వివాహం కూడా చేయాలని సత్యనారాయణ సంకల్పించాడు.

❖ ❖ ❖



వారానికోసారి సత్యనారాయణ తన ఆశ్రమం నించి మరుకూకు లోని తన ఇంటికి, అక్కడి వ్యవహారాలు చూసుకోడానికి వెళ్తూండే వాడు. చేయబోయే శు భకార్యానికి తగిన సంభారా లన్నీ ఏర్పాటు చేసుకునే ప్రయత్నంలో వుండగా ఒకడు మూడు పుట్ల బియ్యాన్ని తెచ్చాడు. దాన్ని పరిశీలించి సత్యనారాయణ అందులో నూకలు హెచ్చుగా ఉన్నాయని చెప్పాడు. తక్షణం గ్రామస్థుల్లోని కొందరు ఆ బియ్యాన్ని చకచక చెరిగి, నూకలని, బియ్యాన్ని వేరు చేసేసారు. కూలి వాళ్ల అవసరం లేకుండా గ్రామస్థులే సత్యనారాయణకి సహాయం చేసారు. అన్ని సంబారాలు సేకరించుకోడానికి సత్యనారా యణకి నాలుగు నెలలు పట్టింది.

ముహూర్తానికి వేల మంది జనం వచ్చారు. తామెందుకు వెళ్లాలి అనే ఆలోచనే లేకుండా సత్యనారాయణ మీద భక్తితో వారు వచ్చారు. నలభైమంది గ్రామస్థులు పెళ్లి పెద్దల పాత్రని తీసుకొని వారందరి సౌకర్యాలు చూడసాగారు. వందల ముంది స్వచ్ఛందంగా పెళ్లి పనులు చేయసాగారు. కొందరు గ్రామస్థులు తమ ఇళ్ల ముందు తామే సంబరంగా పందిళ్లు వేసుకున్నారు. తన కొడుకు ఉ పనయనంతో పాటు మరో ఇద్దరు వైష్ణవ పిల్లలకి కూడా సత్యనారాయణ ఉ పనయనం చేయించాడు.

పదిహేను వందలమంది భోజనం చేసే ఓ బ్రాహ్మణ పంక్తిలో కూర్చుని వున్న ఓ బ్రాహ్మణుడు ఉపదేశాలు చెప్తూ గౌరవిం చబడేవాడు. సంస్కారం లేని అతను వడ్డనలో మజ్జిగ తెచ్చేసరికి 'తనకి పెరుగు కావాలి' అని పట్టుపట్టాడు. ఎవరికీ మర్యాద లోపం, వస్తులోపం జరగకూడదనుకున్న సత్యనారాయణ తత్వం తెలిసిన ఒకడు తన ఇంట్లో ఉట్టిలో కట్టివున్న పెరుగు ముంతని తెచ్చిస్తే, ఆ బ్రాహ్మణుడికి పెరుగుని వడ్డించారు.

మరో సందర్భంలో ఇతడే తనకి ఉపాహారం సరిగ్గా రాలేదని అంటున్నాడని సత్యనారా యణకి తెలిసింది. వెంటనే అతను ఓ పళ్లెంలో ఉపాహారాలన్నింటినీ సర్ది, దానిపై బట్టకప్పి, మంగళవాద్యాలతో అతనున్న బసకి వెళ్లి, ఆ పళ్లెం ఆ బ్రాహ్మడికి ఇచ్చి, క్షమించ మని అతనికి సాష్టాంగప్రమాణం చేశాడు. తన మాటలకి, చర్యలకి అతనెంతో సిగ్గుపడ్డాడు.

మరుకూకులో ఉపనయనం అయాక అంతా పెళ్లికి పెళ్లికూతురు గ్రామానికి నూట పదహారు ఎడ్ల బళ్ల మీద తరలి వెళ్లారు. ఎవరి బండిలో చిన్న పిల్లలు ఏడ్చినా సత్యనారాయణ ఆ బండి దగ్గరకి వెళ్లి, పాలు లేదా ఆహారంలో ఏది కావాలో కనుక్కుని దాన్ని అందించేవాడు. పిల్ల వైపు వారు తక్కువ మంది వస్తారనుకుని రెండు మూడు ఇళ్లు విడిదికి సిద్ధం చేశారు. కాని వచ్చిన వారందరికీ ఆ విడిది సరిపోదు. దాంతో గ్రామంలోని అన్ని ఇళ్లలో వారికి విడిదిని ఏర్పాటు చేశారు.

జనం ఎక్కువ మంది అవడంతో రెండు పెళ్లిళ్లకి ముట్టే డబ్బుని సత్యనారాయణ వంటవాళ్లకి ఇవ్వడంతో వాళ్లకీ సంతోషం కలి గింది. ఆడపెళ్లి వారు అంత భారాన్ని మోయలేరు కాబట్టి వారికి కావలసిన వస్తు సామాగ్రిని పొరుగూరు వారు కనుక్కుని పంపారు. అరవై అయిదు పల్లాల బియ్యంతో ఆ పెళ్లి వేడుకలు పదిహేను రోజుల పాటు సాగాయి. వేల మంది భోజనం చేసి భూత తృప్తి జరిగినందుకు సత్యనారాయణ ఎంతో ఆనందిం చాడు.

సత్యనారాయణకి జరిగే కార్యం మీద ఎలాంటి మమతా లేక పోవడం వల్ల, సాక్షిగా జరిగేదంతా చూస్తూండి పోయాడు కనుక వారికి పరమాత్ముడే

అన్నీ ఘనంగా అమర్చాడు. అంతా పరమా త్ముడిపై వదిలేస్తే ఆయనే చూసుకుంటాడన్నది ఈ ఉపనయన, వివాహ ఉత్సవ విషయాల్లో ఋజువైంది.

విశ్వనాథుడికి పన్నెండో ఏట ఒక భూతం అవహించింది. నిద్ర మధ్యలో అకస్మాత్తుగా కెవ్వున కేక వేస్తాడు. అది విన్న వారి ఒళ్లుభయంతో ఝల్లుమనాల్సిందే. ఓ రాత్రి కలలో విశ్వనాథుడికి పరమాత్మ తన తండ్రి సత్యనారాయణ రూపంలో కనిపించి, జానెడు వెడల్పున్న వెండితో చేసిన ఓ యంత్రాన్ని చూపించాడు. దాని మీద బంగారంతో బీజాక్షరాలు తళతళమెరుస్తూ కనిపిం చాయి. దాన్ని సత్యనారాయణ విశ్వనాథుడి మెళ్లో కట్టగా, అది బొడ్డు దాకా ఆవరించింది. అది ఆశ్చర్యంగా చర్మంలోకి ఇమిడిపోయింది. చర్మంలోంచి ఆ అక్షరాలు బయటకి కనిపిస్తున్నాయి. వెంటనే అతనికి మెలకువ వచ్చేసింది. ఆ తర్వాత నిద్రలో అరవడం పూర్తిగా మానే సాడు. మరెన్నడూ అతనికి ఎలాంటి భూత బాధ కలగలేదు.

ఒకరోజు విశ్వనాథశర్మ ఆశ్రమం మేడ మీద పడుక్కుని చేతిని తలకింద ఉంచి వెనక్కి చాచాడు. ఒ పెద్దపాము అతని చేతిమీంచి పాకి వెళ్లడం గమనించాడు. ఠక్కున మెలకువ రాగానే ఆ చేతికి బాగా నెప్పి కలిగింది. తనంత పెద్ద పాముని ఎన్నడూ చూడలేదనుకుంటూ దానికోసం మేడంతా వెదికాడు కాని అది కనపడలేదు. మళ్లీ నిద్ర పోయాక ఇందాకటి కలే వచ్చింది. ఆ కలలో కూడా చెయ్యి నొప్పి చేసింది. దానికోసం వెదుకుతూ కలలో విశ్వనాథుడు వంటశాలలోకి వెళ్లాడు. రెండు జానల వెడల్పుతో పడగ విప్పి ఉన్న రెండు బారల పొడవు గల పాము అతనికి కనిపించింది.

మరుక్షణం అతనికి పార్వతీ పరమేశ్వరులు ప్రత్యక్షమయ్యారు. శంకరుడి ఒంటి మీద అన్ని ఆభరణాలు కనబడ్డాయి తప్ప మెడలో మాత్రం పాము లేదు. ఆ పాము శంకరుడి కంఠా భరణమే అని విశ్వనాథుడికి స్పష్టం అయింది. పార్వతీ పరమే శ్వరులకి నమస్కారం చేయడం కూడా స్ఫురించని విశ్వనాథుడు ఆశ్చర్యంగా వారి వంక చూస్తూంటే, శంకరుడు తన దగ్గరకి రమ్మన్నట్టుగా సైగ చేశాడు. దగ్గరకి వెళ్లి విశ్వనాథుడు నమస్క రించాడు. పాము వెళ్లి శంకరుడి

మెడకి చుట్టుకుని పడగ విప్పి చూడసాగింది.

"నాయినా! నీకు సర్ప మంత్రాన్ని ఉపదేశిస్తాను. దీని వల్ల నీకు ఏ బాధలు కలగవు. నీకంతా మంచే జరుగుతుంది."

విశ్వనాథుడి చెవిలో శంకరుడు ఓ సర్ప మంత్రాన్ని ఉపదేశిం చాడు. ఓ తీగల పెట్టెలో తళతళ మెరిసే ఆ పాముని ఉంచి అతని చేతిలో పెట్టాడు. ఆ పాము కొద్దిగా బయటకి రాగానే విశ్వనాథుడికి మెలకువ వచ్చేసింది. అప్పటినించి ఇతను నాగేంద్రుడి పూజని కలలో తనకి అందిన ఆ మూల మంత్రంతో చేయసాగాడు. ఆ పూజ చేయకపోతే ఇతనికి కలలో ఆ పాము కనిపిస్తుంది.

అతనికి పద్దెనిమిది ఏళ్లు వచ్చాక తెలంగాణాలో రజాకార్ల ప్రమాదం వచ్చింది. రజాకార్ల వల్ల ప్రాణ, మాన భయాలతో ప్రజలు తమ తమ ఇళ్లని వదిలిపెట్టి వెళ్లిపోతూ తమ డబ్బుని పాండురంగాశ్రమంలో దాచుకోసాగారు. పాండురంగాశ్రమానికి విరోధి అయిన ఓ ఊరి జాగీర్దారు విశ్వనాథుడ్ని చంపమని, అతని మీద రజాకార్లకి లేనిపోనికి చెప్పాడు. ఇది తెలీని విశ్వనా థుడు ఓ రోజు ఆ ఊరికి వెళ్లాడు.

ఎనిమిది మంది రజాకార్లు అతని మీదకి గుంపుగా చేతిలో ఆయుధాలతో వెళ్లి, తుపాకీలు గుండెకి గురిపెట్టి చంపుతామని బెదరించసాగారు. అందుకు విశ్వనాథుడు ఎంత మాత్రం భయపడలేదు. ఎందుకంటే పుట్టాక మరణం తప్పదనీ, అది భగవంతుడి ఇచ్ఛ ప్రకారం మాత్రమే జరుగుతుంది అన్న విశ్వాసం అతనిలో బలంగా ఉంది.

విశ్వనాథుడు వాళ్లతో నిర్భయంగా చెప్పాడు.

"చంపుతామని బెదిరింపేమిటి? చంపాలనుకుంటే చంపండి."

"నీ దేవుడు నిన్ను కాపాడగలడా?" అడిగాడు వాళ్లలోని ఒకడు.

"తప్పక కాపాడగలడు. నా దేవుడు నన్ను కాపాడేప్పుడు మీ ఆయుధాలు పనికిరానికి అవుతాయి."

దేవుడి మీద ఇతనికి గల అచంచల విశ్వాసానికి వాళ్లు నివ్వెర పోయి, విశ్వనాథుడి మీదకి ఎత్తిన ఆయుధాలని దించేసి వెళ్లిపో యారు. ఈతనికి గల

ధైర్యం గురించి వివరించే ఇంకో సంఘటన ఇది.

ఒకరోజు విశ్వనాథుడు సంధ్య వేళలో చెరువు గట్టు మీద ఇంకొకరితో మాట్లాడుతూ వెళ్తూంటే, చుట్టూ చీకటి అలుము కోసాగింది. ఎదుటి వ్యక్తి వెనక విశ్వనాథుడికి ఓ శూద్ర స్త్రీలా కనిపించే యువతి చీరని పైకి ఎత్తుతూ రావడం కనిపించింది. 'ఇదేమిటి? ఎంతటి సిగ్గుమాలినదైనా మరీ ఇలా ప్రవర్తిస్తుందా?' అనిపించింది అతనికి. ఆ స్త్రీ కొద్ది దూరంలో మలవిసర్జనకి కూర్చుంది. 'గ్రామ స్త్రీ ఒంటరిగా ఈ సమయం లో ఇలా రాదు కదా?' అన్న ఆలోచన మళ్లీ కలిగిందతనికి. అది దయ్యం అయివుంటుంది అనుకుని, ఓ దుడ్డు కర్ర తీసుకుని అక్కడికి వెళ్లే సరికి ఈతనికి ఆ స్త్రీ రూపం కూర్చున్నచోట కనిపించలేదు. ఐనా విశ్వనాథుడు ఆ స్త్రీ కూర్చున్న చోట కర్రతో బాదసాగాడు.

వెంటనే 'అమ్మా! అబ్బా! అన్న మూలుగులు అతనికి వినిపిం చాయి. 'కొట్టక. ఇంక రాను. పోతాను.' అన్న మాటలు కూడా వినిపించాయి. ఛాయలా ఆ స్త్రీ రూపం దూరం అయిపోయింది. చిరుతపులులు, ఇతర దుష్ట జంతువులు ఎదురుపడ్డా అతను భయపడేవాడు కాదు.

ఃఃః

సత్యనారాయణ రెండో కొడుకు పేరు విఠలుడు. పూర్వ జన్మ సంస్కారాలు ఇతనిలో అధికం. ముత్తాత, తాత, తండ్రుల కిలాగా శక్తి అధికం. మానస పూజని అధికంగా చేస్తాడు. ఆ సమ యంలో బయట ఎంత గొడవగా ఉన్నా చలించక దృఢ భక్తితో మానస పూజని చేస్తాడు. ఇతనిలోని దైవీ గుణాలని చూసి సత్య నారాయణకే ఒకోసారి ఆశ్చర్యం వేసేది. బహిరంగ పూజ చేసేప్పుడు ఎంత మాత్రం అలసట చెందక, శ్రద్ధగా ఎలాంటి లోపం లేకుండా చేసేవాడు. పూజ అయ్యాక మనుషులు ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్లి ఓపికగా అందరికీ తీర్థం ఇచ్చేవాడు.

ఓ రోజు ఓ వింత సంఘటన జరిగింది. ఇద్దరు బ్రాహ్మణులు గానుగాపూర్‌కి, అక్కడ దత్తాత్రేయ అంశకి చెందిన ఓ మహా త్ముడు ఉన్నాడని విని, దర్శనం కోసం వెళ్లారు. అతనికి నమస్కరించగానే, అతను 'వెళ్లండి. మరుకూకులోని

పాండు రంగాశ్రమంలోని సత్యనారాయణ  రెండో కొడుకుగా నేను పుట్టాను' అన్నాడు. గానుగాపూర్‌కి మరుకూకు చాలా దూరం. పాండురంగాశ్రమం గురించి  అంతదూరం పాకడం ఆ రోజుల్లో అసంభవం. ఆ మహాత్ముడి ద్వారా సాక్షాత్తూ ఆ దత్తాత్రేయుడే అలా పలికాడని భావించిన ఆ ఇద్దరూ పాండురంగాశ్రమానికి వచ్చారు. ఆ సమయంలో విఠలుడు 'భక్త గురు సార్వభౌమ మాణిక్యప్రభు మహరాజ్‌కీ జై' అంటూ అటూ ఇటూ తిరుగుతూ కనపడ్డాడు.

విఠలుడి మాటలకి ఆశ్రమంలోని వారంతా కూడా ఆశ్చర్య పడ్డారు. ఎందుకంటే విఠలుడు అలా ఎన్నడూ పలకలేదు. దత్తుడ్ని కొలిచే సాంప్రదాయం కూడా ఆ ఆశ్రమంలో లేదు. ఆ కొత్తవారు రాగానే విఠలుడి నోట్లోంచి ఆ మాటలు రావడం ఏమి టని అంతా అనుకున్నారు. ఆ బ్రాహ్మణులు చెప్పింది విని దత్తుడే తమ ఇంట జన్మించాడని గ్రహించారు. అయితే మిగి లిన కర్మని ప్రారబ్ద రూపంలో అనుభవించడానికి వచ్చాడు విఠలుడు. అతని ఆయుష్షు స్వల్పమే.

ఓ రోజు జ్వరం వచ్చి పడుకుని ఉన్న విఠలుడు తల్లిని పిలిచి చెప్పాడు.

"అమ్మా! అదిగో, కోతి వచ్చింది."

నిజానికి అక్కడ కోతి లేకపోవడంతో యశోదమ్మ చెప్పింది.

"అది కోతి కాదురా నాయినా! హనుమంతుల వారు."

"ఓహో! హనుమంతులవారా? పైన ఉన్న ఇద్దరూ శ్రీరామ లక్ష్మణులా? వాళ్లేమంటారో?"

అంత జ్వరంలోనూ విఠడుడు వారికి పూజ చేసి తల్లిని తొమ్మిది కొబ్బరికాయలు కావాలని అడిగాడు. ఆమె వాటిని తేగానే వాటన్నిటినీ కొట్టి, మిగతావారికి కంటికి కనబడని దేవుళ్లకి నైవేద్యం పెట్టి విఠలుడు అలాగే మరణించాడు.

సత్యనారాయణకి వేణు అనే ఇంకో కొడుకు కూడా ఉన్నాడు. వేణు చిన్నపిల్లవాడుగా ఉండగా ఉయ్యాల తొట్టిలో పడుక్కోబెట్టి యశోదమ్మ తన పని చేసుకోడం అలవాటు. ఓ రోజు అలా ఆవిడ పనిలో ఉండగా ఎందుకో చూస్తే,

ఆ ఉయ్యాల పైన ఉన్న వాసం మీద ఓ పొడవైన పాము యశోదమ్మకి కనిపించింది. ఆ సంగతి వెంటనే ఆవిడ తన భర్తకి చెప్పి ఏదైనా చేయ మంది.

"దాన్నేం చేయకూడదు. ఇది శాసనం." చెప్పాడు సత్య నారాయణ.

రెండెనెలలపాటు ఆ పాము అక్కడే ఉంది. (పాము సంవత్సరం పాటు ఆహారం లేకుండా జీవించగలదు). వేణు కూడా చిన్న తనం నించే భగవద్ భక్తి గలవాడు. రెండు, మూడేళ్ల నించే భగవన్నామం చేసేవారి ముఖాలని వేణు గమనించేవాడు. తినే ప్పుడు సత్యనారాయణ భగవన్నామం చేస్తూంటే వెంటనే అన్నం ముందు నించి లేచి వెళ్లి తండ్రి పక్కన కూర్చుని కదలకుండా అది వినేవాడు. ఆ వయసు చిన్నపిల్లల్లా ఆకలికి, దాహానికి, ఆటలకి వెళ్లడానికి ఏడ్చి ఎరుగడు. అన్నం పెట్టేప్పుడు కూడా భగవన్నామం చేస్తూ తినిపిస్తేనే తినేవాడు. ఎవరో సత్పురుషుడు తన కొడుకుగా వచ్చాడని వేణు గురించి సత్యనారాయణ అభి ప్రాయం. అందువల్ల క్రమంగా ఆయనే భగవన్నామం చేస్తూ వేణు చేత తినిపించేవాడు. ఇతరులు ఎంత ప్రయత్నం చేసి తినిపించాలని చూసినా వేణు తినేవాడు కాడు.

ఓ సారి విఠలుడి ఉపనయనం చేయడానికి అంతా పండరీ పురం వెళ్లారు. అంతా పాండురంగడి ఆలయానికి వెళ్లారు. అక్కడ కొందరు భజన చేస్తున్నారు. నాలుగైదేళ్ల వయసు గల వేణు వాళ్ల దగ్గరకి వెళ్లాడు. గుడి నించి అంతా తమ బసకి చేరు కున్నారు. ఎవరికీ వేణు మాట గుర్తులేదు. కొంతసేపటికి వేణు కనబడటంలేదని గుర్తించారు. గుడికి పరిగెత్తారంతా. అక్కడ వేణు ఇందాక ఏ చోట కూర్చున్నాడో అక్కడ అలాగే నిశ్చలంగా కూర్చుని ఉన్నాడు తప్ప తన వాళ్లు కనబడటం లేదన్న ఏడుపే లేదు!

"వేణు, భయపడ్డావా?" అడిగాడు సత్యనారాయణ

చిన్నగా నవ్వుతూ తల అడ్డంగా ఊపాడు వేణు.

సత్యనారాయణ కొన్నిసార్లు, ముఖ్యంగా ఏకాదశి రోజు పహరా భజనని చేసేవాడు. పహరా భజనంటే, తంబూరా మీటుతూ భగవన్నామం ఉచ్చరిస్తూ, గుడి ద్వారం ముందు అటు, ఇటు తిరుగుతూ చేసే భజన. గంటలకొద్దీ దీన్ని

చేయాల్సి ఉంటుంది. వేణు విని దాన్ని నేర్చుకుని పహరా భజనని చేస్తూండేవాడు. భక్తులు భగవంతుడి విగ్రహానికన్నా మిన్నగా, చేతిలో తంబూరాతో అటు ఇటు తిరుగుతూ ముద్దొచ్చే ఈ చిన్న పిల్లవాడిని చూసేవారు.

వేణుకి బాల్యంలో ఓ సారి మసూచి సోకింది. అప్పుడు కేవలం పళ్లరసమే ఆహారంగా ఇచ్చేవారు. అది తాగేప్పుడు కూడా ఎవరైనా భగవన్నామం చేస్తేకాని రసం తాగేవాడు కాదు. వేణు మరణం కూడా ఓ విచిత్రమే. సత్యనాయణ దూరంగా ఉండగా వేణు మరణించాడు. ఆ వార్త తెలియగానే సత్యనారాయణకి, తను దగ్గరుండి మరణించే సమయంలో వేణుకి తులసి తీర్థం ఇవ్వలేకపోయానే అనే చింత కలిగింది. అదే చింతతో ఇంటికి వచ్చాడు. అంతా మరణించాడని నిర్ణయించాక కూడా తండ్రి దగ్గరకి వచ్చాక వేణులో కొద్దిగా కదలిక కలిగింది.

'ప్రాణం వచ్చింది' అంటూ సత్యనారాయణ ఆత్రంగా కప్పిన గుడ్డని తొలగించి చూస్తే వేణు కళ్లు తెరిచాడు. వేణు బ్రతికాడని ఆనందం కలిగినా తులసితీర్థం మాట జ్ఞాపకం వచ్చి అడిగా డాయన.

"తీర్థం ఇస్తే తాగుతావా? భగవన్నామం చేయగలవా?"

రెండిటికీ వేణు తల ఊపడంతో సత్యనారాయణ వెంటనే తులసి తీర్థ తెచ్చి వేణు నోట్లో పోస్తూ భగవన్నామం ఉచ్చరించ సాగాడు. ఆ తీర్థాన్ని తాగి వేణు మళ్లీ కళ్లు మూసుకున్నాడు. వేణు ఊపిరి ఆగిపోయింది.

విఠలుడు, వేణు మరణించిన కొంతకాలానికి సత్యనారాయణకి, సోదరి నర్సమాంబకి ఓ కల వచ్చింది. అందులో విఠలుడు, వేణు ఇద్దరూ మరణానంతరం గోలోకంలోని శ్రీకృష్ణుడి దగ్గరకి చేరుకున్నారు అని తెలిసింది. మర్నాడు వీరిద్దరూ ఈ విషయం అందరికీ తెలిపితే వారంతా ఎంతో సంతోషించారు. వీరికే కాక ఇదే కల వేరే గ్రామంలోని మరో ఇద్దరికి కూడా వచ్చిందని ఆ సాయంత్రం వారు వచ్చి చెప్పడం విశేషం. కొద్దిపాటి కర్మ మిగిలిన వారు మహాపురుషులకి జన్మించి దాన్ని తీర్చుకుని దివ్యధామం చేరతారు.

సత్యనారాయణకి మొత్తం ఎనిమిది మంది సంతానం. వారిలో నలుగురు తక్కువకాలం జీవించి మరణించినవారే. ఆశ్రమంలో శ్రీదేవి పూజలు, సప్తశతీ

పారాయనం జరుగుతూండగా సత్య నారాయణ మనసు పాండురంగడి మీద లగ్నం అవడం వల్ల ఆయనకి కూడా పూజలు క్రమం తప్పకుండా నిర్వహించేవాడు. అమ్మవారి పూజలు చేస్తున్న సమయంలో ఎనిమిదో సంతా నంగా పుట్టిన కూతురికి 'మహాలక్ష్మి' అనే పేరు పెట్టాడు. ఈ పేరు పెట్టడానికి ఇంకో బలమైన కారణం కూడా ఉంది.

❖ ❖ ❖



మహాలక్ష్మి పుట్టడానికి కొద్దిరోజుల ముందు సత్యనారా యణకి ఓ కల వచ్చింది. అందులో మానవ నిర్మితంకాని, దివ్యమైన కళగల ఓ సుందరమైన భవంతి, దానికోవైపు ఓ విశాలమైన ఉద్యానవనం కనుపించాయి. ఆ భవంతిలో ఓ చోట శ్రీచక్రార్చనలు జరుగుతున్నాయి. పక్కనే ఉన్న పెద్ద కుంకుమరాశిలోంచి ఓ దివ్య పురుషుడు బయటికి వచ్చాడు. 'ఇదేమిటి? శ్రీదేవికి శ్రీచక్రపూజ జరుగుతూంటే శ్రీమాత రావాల్సింది బదులు పురుషుడు వచ్చాడు? ఇతను శ్రీకృష్ణుడు కావచ్చును'అనుకున్నాడు. అతను పారాయణం చేసేవారికి, శ్రీచక్రానికి మధ్య నిలబడ్డాడు. అతనిలో ఒక్కో కళా పెరగడం గమనించిన సత్యనారాయణ అతను సాక్షాత్తు శ్రీకృష్ణుడే అని నిశ్చయం చేసుకున్నాడు.

ఇంతో ముగ్గురు దివ్య స్త్రీలు ఉద్యానవనం నించి వచ్చి నిలబడ్డారు. వారిలో మొదటి స్త్రీ నీలం రంగులోనూ, పొట్టిగా ఉన్న రెండో స్త్రీ ఎరుపు-తెలుపు కలిసిన సంపెంగపూవు ఛాయలో, మూడో స్త్రీ నల్లటి రంగులో ఉన్నారు. పొట్టిగా ఉన్న రెండో స్త్రీ వెళ్లి ఆ పురుషుడి పక్కన నించుంది. ఆమె రుక్మిణీ అయివుండ చ్చని సత్యనారాయణ అనుకున్నాడు. తర్వాత నీలం రంగు స్త్రీ కూడా వెళ్లి కృష్ణుడి పక్కన నిలబడింది. అప్పుడు కృష్ణుడు సత్యనారాయణతో నవ్వుతూ చూస్తూ చెప్పాడు.

"నాయినా! ఈ శ్రీచక్రం నేనే. నా భార్య మహాలక్ష్మి కూడా నేనే. నీలం రంగులో ఉన్న కాళికే మహాలక్ష్మి. ఆమె కూడా నేనే. నాకు దూరంగా నిలబడ్డ ఆ నల్లటి స్త్రీ సరస్వతి కూడా నేనే. కాబట్టి నువ్వు శ్రీచక్రానికి చేసే పూజలు, సప్తశతీపారాయణాలు అన్నిటికీ నేనే ఆధారం. సందే హించక."

దాంతో అంతా ఒక్కటే అనే భావన సత్యనారాయణలో కలిగింది. కొద్ది రోజులకే పుట్టిన తన కూతురుకి కృష్ణ మహాలక్ష్మి అనే పేరు పెట్టాడు.

దేవుడు ఉన్నచోట జాతర జరక్కుండా ఉండదు. అది చెట్టయినా సరే, గట్టయినా సరే. అలాగే గ్రామాన్ని వదిలి సత్య నారాయణ అడవిలోకి వచ్చి ఉ న్నా వందలాది మంది ఆయన నిమిత్తం వస్తూనే ఉన్నారు. కొందరు ఉపదేశానికని, మరి కొందరు విద్యకని, కొందరు ఊరికే దర్శనానికి, కొందరు పని చేసిపెడదామని ఆ అడవిలోని పాండురంగాశ్రమానికి రాసాగారు.

వ్యావహారిక దృష్టితో చూస్తే ప్రాపంచికులకి సత్యనారా యణతో ఏం అవసరం లేదు. అతను డబ్బిచ్చేవాడు కాదు. తమ పనుల్లో సహాయం చేసేవాడు కూడా కాదు. పోట్లాటలని తీర్చేవాడూ కాదు. అయినా కొంతమంది వచ్చి డబ్బిచ్చి, నమస్కారం చేసుకుని వెళ్ళిపోతూంటారు. దీంతో సత్యనారా యణకి ఏకాంతం దొరికేది కాదు. అందువల్ల ఓ రోజు హరిగంగకి అవతల గల గుళ్ల మధ్యకి వెళ్లి అక్కడగల కొంత స్థలంలో కూర్చుని సత్యనారాయణ భగవధ్యానం చేయ సాగాడు. ఇందుకోసం మధ్యాహ్నం బహిర్భూమికి వెళ్లినట్లు చెంబు పట్టుకుని వెళ్లాడు.

కొద్దిసేపటికి ఓ గొల్లవాడు పశువులు కాస్తూ వచ్చి సత్య నారాయణ గుహకి ముందు కూర్చున్నాడు.

"ఎందుకు ఇక్కడికి వచ్చావు. వెళ్లు" కోరాడు సత్యనారాయణ.

"వెళ్లను దొర" చెప్పి వాడు అక్కడే కూర్చున్నాడు.

"వెళ్లు. ఇక్కడ నీకేం పని?" కోపంగా అరిచాడు సత్యనారా యణ. వాడు కదలకపోగా అడిగాడు.

"పాలు తెస్తాను. తాగుతారా?"

"ఏం వద్దు. నువ్వెళ్లు చాలు." చెప్పాడు సత్యనారాయణ కోపంగా.

ఆ గొల్లవాడు భయపడక, ఆ చెంబు తీసుకుని పరిగెత్తికెళ్లి పాలు పితికి తెచ్చాడు.

"ఇప్పుడే పితికిన ఆవు పాలు. తాగుదొరా." ఆ చెంబుని, రెండు పైసలని పెట్టి ఆ గొల్లవాడు నమ స్కారం చేసి వెళ్లిపోయాడు.

సత్యనారాయణకి ఎంతో ఆశ్చర్యం వేసింది. 'ఇదేమిటి? ఎవ్వరూ వద్దని గుహలో కూర్చుంటే ఎవరితోనో పాలు పంపావు. వద్దంటే పాలతో పాటు డబ్బు కూడా తెచ్చి ముందు పెట్టించావు? ప్రభూ! ఇదే నీ అభిప్రాయం అయితే దానికి వ్యతిరేకంగా ఎలా ప్రవర్తించను? సరే. నీ ఇచ్ఛ ప్రకారమే ప్రవర్తిస్తాను' అనుకుని చెంబు, పైసలు తీసుకుని ఆశ్రమానికి చేరుకు న్నాడు. అక్కడ అంతా భోజనాలు చేయకుండా సత్యనారా యణ కోసం ఎదురు చూస్తున్నారు. జరిగింది అందరికీ వివరించాక అంతా భోజనాలకి కూర్చున్నారు.

భవన నిర్మాణం

లౌకికులు ఏదైనా పని చేయడానికి ముందు దానికి సంబంధించిన ధనాన్ని కూడగట్టుకుంటారు. కాని అలౌకికులు ధనాన్ని ఖాతరు చేయరు. అంతా ఆ భగవంతుని మీదే భారం వేస్తారు.

సత్యనారాయణ ఆశ్రమంలో పాండురంగడికి ఓ ఆలయాన్ని నిర్మించాలని సంకల్పించినప్పుడు సరిగ్గా ఇదే పని చేశాడు. డబ్బు లేకుండానే శంకుస్థాపనకి ముహూర్తాన్ని నిర్ణయించాడు. అది చేసిన రోజు వచ్చి పనిచేసిన కూలీకి ఓ రూపాయి ఇవ్వాలి కాని తన దగ్గరున్న అర్ధరూపాయే ఇచ్చి పంపించాడు. దైవ సహాయంతో అనేకమంది దాతలు ముందుకు వచ్చి ధన సహాయం చేశారు.

హైద్రాబాద్ నించి ఓ ఉప్పరి పనివాడు వచ్చి వినయంగా చెప్పాడు.

"అయ్యా! నన్ను ఇక్కడ పనికి చేర్చుకోండి. మీరెంత ఇస్తే అంతే తీసుకుంటాను."

ఓ కమ్మరివాడు ఇక్కడ పనిచేస్తూ చెప్పకుండా వెళ్లి తన స్వంత ఇల్లు కట్టుకున్నాడు. కాని కొద్ది వారాల్లో ఆ ఇల్లు కూలి పోయింది.

ప్రధాన భవన నిర్మాణం పూర్తయ్యాక సత్యనారాయణ మందిరంలో పాండురంగ, రుక్మిణీల విగ్రహాలకి చరప్రతిష్ఠ చేయాలని సంకల్పించాడు. కాని పెద్దలంతా స్థిర ప్రతిష్ఠనే చేయమని కోరినా అతను చర ప్రతిష్ఠనే చేశాడు. తర్వాత వందల కొద్దీజనం భోజనం చేయగలిగేంత, విశాలమైన వంట శాల నిర్మాణాన్ని సత్యనారాయణ సంకల్పించాడు. అందుకు సరిపడే కట్టె అవసరం అయింది. ఆ అడవిలో ఆ రకం కట్టె దొరకదు. సత్యనారాయణ ముఖ్య శిష్యుడైన ఈశ్వరుడుకి ఈ సంగతి తెలీగానే వచ్చి చెప్పాడు.

"నాయినా! పడమర దిక్కున అడవుల్లో పెద్ద దుంగలు దొరుకుతాయి. నేను వెళ్లి తీసుకువస్తాను."

ఈశ్వరుడు ఒక్కడే అంత దూరం ఎలా వెళ్లాడని సత్య నారాయణ ముందర మథనపడ్డా తర్వాత అన్నిటికీ ఆ పాండురంగడే ఉన్నాడనుకుని అందుకు అనుమతించాడు. ఈశ్వరుడు నలుగురు మనుష్యులతో, ఎడ్ల బళ్లతో పశ్చిమ అడవి ప్రారంభంలో గల ఓ గ్రామానికి వెళ్లాడు. అక్కడ అడవి అధికారులకి విషయం చెప్పి, కట్టె తీసుకోడానికి అనుమతి తీసుకుని ఉదయం బళ్లతో అడవిలోకి వెళ్లాడు. గ్రామస్థులు ఎట్టి పరిస్థితుల్లో చీకటి పడేలోగా ఆ అడవిలోంచి బయటకి రావాలని, లేదా ప్రమాదమని హెచ్చ రిక చేసి పంపారు.

పన్నెండుమైళ్ల దూరంలోని ఆ అడవిలోకి వెళ్లాక వారికి ఏడెనిమిది గజాల పొడుగైన పెద్ద చెట్ల సమూహం ఒకటి కనిపించింది. వాటిని కొట్టి బళ్లలోకి ఎక్కించుకునేసరికి చీకటి పడసాగింది. చీకట్లో పన్నెండు మైళ్ల దూరంలో ఉన్న గ్రామానికి చేరడం ఎలా? పోనీ అక్కడే ఉందామంటే ఆ అడవిలో పెద్దపులులు ఎక్కువ. మనుష్యుడు, ఎడ్లని చూస్తే అవి తమకి వాటిని ఆహారం చేసుకుంటాయి. ఆ గ్రామస్థుల్లో ఎవరైనా రాత్రి ఆ అడవిలో చిక్కుకుంటే మర్నాడు బ్రతికి బయటకి వచ్చిన దాఖలాలు లేవు. పైగా మధ్యాహ్నం నించి వారికి నీరు లేక దాహంగా ఉంది. ఎడ్లు కూడా దప్పికగొని ఉన్నాయి. వెదికితే వారికి ఎక్కడా

నీరు లభ్యం కాలేదు.

'స్వామీ లేడా!' అని ఎడ్లని బళ్లకి కట్టి తిరుగు ప్రయాణం చేయసాగారు. పూర్తిగా చీకటి కమ్మింది. ఈశ్వరుడు సత్యనారాయణని తలుస్తూ బళ్లకి ముందుకి కాలినడకన సాగాడు. కొద్ది దూరం వచ్చాక దారిలో వర్షంతో కోయబడ్డ, మూరెడు వెడల్పుగల ఒక చెన్న నీటి చెలిమి తాలూకు ఇసక కనిపించింది. బళ్లని ఆపి ఇసుకని కొద్దిగా తవ్వితే, తడి ఇసుక చేతికి తగిలింది. సంతోషంగా ఇంకాస్త లోతుకి తవ్వితే చెంబు మునిగేంత నీటి ఊట వచ్చింది. ముందర ఎద్దులకి నీరు తాగించాలనుకుని ఓ ఎద్దుని బండి నించి విప్పి ఆ ఊట దగ్గరకి తీసుకువచ్చారు. అది తాగినంత నీరు ఊరింది. తర్వాత మిగిలిన ఎద్దులని కూడా తెస్తే అవి తాగేంత నీరు ఊరు తూనే ఉంది. అవన్నీ నీరు తాగాక మనుషులు కూడా నీరు తాగి వంట ప్రయత్నం చేసారు. వంటకి సరిపడ నీరు కూడా ఊరింది. భోజనాలు చేసి ఆ అడవిలోనే బాగా అలసిపోయి ఉన్న వారంతా హాయిగా నిద్ర పోయారు.

ఉదయం నిద్రలేచి బళ్లు కట్టుకుని తిరుగు ప్రయాణం సాగించారు. ఉదయం బయలుదేరబోయే ముందు చూస్తే ఆ నీటి ఊట దగ్గర ఒక్క చుక్కకూడా నీరు కనిపించలేదు! రాత్రి క్రూర జంతువుల నించి బాధ కూడా వారికి కలగలేదు. ఆ జగదీశ్వరుడి రక్షణ తమకి అన్ని విధాలా లభించిందని సంతోషిస్తూ వారు బయలుదేరారు. ఆ బళ్లు పాతవి. నడు స్తుంటే చిటపట శబ్దం చేయసాగాయి. పచ్చి కట్టెల బరువుకి అవి ఎక్కడ విరిగి పోతాయో అని ఈశ్వరుడు భయ పడ్డాడు కాని గ్రామానికి క్షేమంగా చేరు కున్నారు.

తిరిగి వచ్చిన వీరిని చూసి అంతా ఆశ్చర్య పోయారు. నీరు ఎలా లభించిందని ప్రశ్నించారు. జరిగింది ఈశ్వరుడు చెప్తే వారి ఆశ్చర్యం రెట్టింపైంది. ఆ గ్రామం నించి గౌరారం అనే ఇంకో గ్రామానికి చేరుకున్నారు. ఆ గ్రామస్థులు కూడా బళ్లమీది బరువుని చూసి, ఎద్దులు అంత బరువైన కట్టెలని ఎలా లాగ గలుగుతున్నాయని ఆశ్చర్యపడ్డారు.

అక్కడ నించి దగ్గరలో ఉన్న ఆశ్రమానికి బయలుదేరారు. బళ్లని మోటారు

కారు నడపడానికి అనువుగా వేసిన ప్రభుత్వ రోడ్డెక్కించారు. అయితే ఆ ఎడ్లకి మోటారు వాహనాలు కొత్త. చప్పుడు చేసుకుంటూ వస్తున్న మోటారు కారుని చూసిన ఎడ్లు బెదిరి, బండి తోలే వారికి ఏం జరుగుతోందో అర్థమయ్యేలోగా రోడ్డు కిందకి బళ్లని లాగి, పెద్ద బొరియ దగ్గరకి ఈడ్చుకు వెళ్లాయి. కాని అంతలో బొరియకి బెత్తెడు దూరంలో ఉండగా అవి ఎవరో మరల్చినట్లుగా గిరుక్కున వెనక్కి తిరిగి మళ్లీ రోడ్డెక్కాయి. బళ్లు ఇంకొంచెం ముందుకు వెళ్లివుంటే బళు తిరగబడి వాటిలోని మొద్దులు వీళ్లమీదకి పడేవి. ఆ బరువుకి అంతా చచ్చేవారు. కాని పాండురంగడు ఆ ప్రమాదాన్ని జరగ నీయలేదు.

తెల్లవారుఝామున సత్యనారాయణకి ఓ కల వచ్చింది. నల్లటి దేహచ్ఛాయగల, పీతాంబరాలు కట్టిన, మోహాన చెమటలు కారుతూండగా, కాళ్లకి దుమ్ము అంటు కున్న చతుర్భుజాలు కలిగిన స్వామి కనబడ్డారు. 'ఇదేమిటి స్వామీ! మీకింత చెమట ఎందుకు పట్టింది?' అని సత్యనారాయణ ఆ కలలో ప్రశ్నిస్తే, స్వామి బెదిరిస్తున్నట్లుగా చూపుడు వేలుని ఆడిస్తూ బదులు చెప్పారు.

"మరి ఆ బళ్లు ఎలా వస్తున్నాయను కుంటున్నావు? ఒట్టిగానే వస్తున్నాయను కుంటున్నావా?"

సత్యనారాయణకి మెలకువ వచ్చి లేచి స్నానం చేసే సరికి ఆ బళ్లు వచ్చాయి. వచ్చాక ఆశ్రమంలో బళ్లు పటపట చప్పుడు చేస్తూ విరిగాయి. అంతదాకా స్వామి తన శక్తితో ఆ బళ్లు విరగకుండా కాపాడుతూ వచ్చారని సత్యనారాయణకి అర్థ మయింది. సంకల్పం స్వార్థపూరి తమైంది కాక, శుద్ధ సంకల్పం అయితే ప్రభువు సహాయం ఎప్పుడూ ఉంటుందనడానికి ఇది మంచి ఉదాహరణ.

స్వామి చేసిన సహాయానికి ప్రేమ పొంగుకు రాగా, నామ ప్రేమికుడైన సత్యనారాయణ చాలా సేపు భక్తిగా భజన చేసాడు. నీరు అనేది అపార సముద్రంలో కంటికి కనిపించనంతటి దూరం వ్యాపించి వున్నా, 'నీరు' అన్న రెండక్షరాల్లో అది ఇముడుతుంది కదా. అదేవిధంగా భగవంతుడు తన నామంలో ఇముడుతాడు. అందుకే సత్యనారాయణ పావనమైన భగవన్నామాన్ని తను మహారుచిగా

ఆస్వాదిస్తూ, ఆశ్రితులకి కూడా దానికి విలువని బోధించి వారి చేతకూడా భగవన్నామ భజనని చేయించేవాడు.

గ్రామంలోని అధికారులకే సమయానికి డబ్బు అందక, లేదా పని వారు దొరక్క తమ ఇళ్లని కట్టుకోవడం కష్టతరమైన పనిగా ఉంటే, సత్యనారాయణ లాంటి విరాగికి ఎలాంటి శ్రమా లేకుండా భవంతి నిర్మాణం తేలిగ్గా పూర్తయింది. ఆయన పిలవకుండానే చుట్టుపక్కల గ్రామాలనించి రెండువందల మంది జనం నిర్మాణంలో భాగం పంచుకోడానికి స్వచ్ఛందంగా వచ్చి శ్రమదానం చేశారు.

ఓసారి ఆశ్రమానికి మూడు మైళ్ల దూరంలో గల మాముదాల అనే గ్రామం సత్యనారాయణ అత్తవారి ఊరు. ఆ గ్రామంలోని కొందరు తమ చేలలోకి పనిచేయడానికి వెళ్లారు. ఆశ్రమం అక్కడికి రెండు మైళ్ల దూరంలో ఉంటుంది. వారికి ఆశ్రమం నించి కొన్ని వాయిద్యాలతో భజన చేస్తున్న ధ్వని వినిపించ సాగింది. ఆశ్రమంలో ఏదో ఉత్సవం జరుగుతోందనుకుని చేనులోని స్త్రీ, పురుషులంతా ఆశ్రమానికి బయలుదేరాలు. ఆశ్రమంవైపు వచ్చేకొద్దీ ఆ భజన దగ్గరవసాగింది. కాని చిత్రంగా వారు ఆశ్రమంలోకి అడుగు పెట్టాక అక్కడ ఏ భజనా జరగడంలేదని గ్రహించారు. ఆ సమయంలో సత్య నారాయణ ఆశ్రమంలో లేడు. అతని భార్య, ఇద్దరు పిల్లలు, సోదరి నర్సమాంబ మాత్రం ఉన్నారు. వాళు ్ల వంట చేస్తున్నారు.

అంతమంది జనాన్ని చూసి యశోదమ్మ ఎందు కొచ్చారని అడిగితే, తాము విన్న భజన గురించి వాళ్లు చెప్తే ఆశ్యర్య పోయింది. అది ఎప్పుడూ భగవత్ భజన జరగాలన్న జగ న్నాథుడి లీల అని వారంతా అనుకుంటూ వెళ్లి పోయారు.

ఆశ్రమ రక్షణ కూడా జగన్నాథుడిదే. గుడిసెలలో ఉన్నప్పుడు ఒక గోనె పట్టాని అడ్డంగా కట్టుకుని నిద్రపోయేవారు. చెం బులు, ఇతర సామాగ్రిని ఎక్కడ ఉంచినా ఒక్కటీ పోయేది కాదు. ఎవడైనా ఓ వస్తువుకి ఆశపడి తీసుకెళ్లినా స్వామి దాన్ని లాక్కొని వచ్చి ఆశ్రమంలో చేర్చేవాడు.

ఓసారి సత్యనారాయణ పని మీద కొన్ని దినాలు మరో గ్రామానికి వెళ్లారు. ఆశ్రమంలో యశోదమ్మ, నర్సమాంబ, పిల్లలు మాత్రమే ఉన్నారు. సత్యనారాయణ

తిరిగి వచ్చేదాకా మరుకూకు గ్రామం నించి ఒకడు వచ్చి రాత్రుళ్లు తోడుగా పడుక్కోవాలని నిర్ణయమైంది. ఓరోజు బడలికగా ఉండటం చేత వాడు ఆశ్రమానికి రావడానికి బద్ధకించి ఇంటి దగ్గరే పడుకున్నాడు. పడుకున్న అతన్ని ఎవరో పురుషుడు లేపి చెప్పాడు.

"ఇవ్వాళ నువ్వు ఆశ్రమానికి ఎందుకు వెళ్లలేదు. లే... లేచి వెళ్లు."

మెలకువ వచ్చినా మళ్లీ అతను నిద్రలోకి ఉపక్రమించాడు. మరోసారి ఇందాకటి పురుషుడు అతన్ని తట్టిలేపాడు.

"ఇంకా పోలేదా? వెళ్లమంటూంటే." అని చెంప మీద పెద్ద దెబ్బ వేసాడు. అప్పుడతనికి పూర్తిగా మెలకువ వచ్చింది. వెంటనే ఆశ్రమానికి వచ్చి ఆశ్చర్యంగా జరిగింది యశోదమ్మకి, నర్సమ్మకి చెప్పాడు.

మరోసారి స్వల్పంగా జ్వరంగా ఉన్న సత్యనారాయణ ఉక్కగా ఉందని ఆరు బయట పడుకున్నాడు. కొంత రాత్రి గడిచాక ఒకతను వచ్చి చెప్పాడు.

"నాయినా! లే....లేచి లోపల పడుక్కో."

సత్యనారాయణ కళ్లు తెరచి చూస్తే ఆ మనిషి కనిపించాడు. అయితే సత్యనారాయణ లోపలకి వెళ్లకుండా మళ్లీ అక్కడే పడుకున్నాడు. కొద్దిసేపటికి అతను మళ్లీ వచ్చి సత్యనారాయణని ఇంకోసారి నిద్రనించి లేపాడు. ఐనా నిద్రమత్తులో సత్యనారాయణ అతని మాటలని పట్టించుకోక అక్కడే పడు కున్నాడు. మూడోసారి అతను సత్యనారాయణని భుజాలు పట్టుకుని పైకి లేపి లోపలకి వెళ్లమని చెప్పాడు. ఈ సారి సత్య నారాయణకి పూర్తి మెలకువ వచ్చింది. అతను తన ఒంటి మీద కప్పుకున్న లావుపాటి దుప్పటి మీద మంచు బాగా కురిసి ఉంది. దాన్ని పిండితే నీళ్లు కారాయి. చూస్తే చుట్టు పక్కల మనిషెవరూ కనపడలేదు. తను మంచులో పడుక్కోవడం వల్ల తనకి ఆనారోగ్యం కలగవచ్చని ఆ ప్రభువే శ్రద్ధగా తనని లేపాడని సత్యనారాయణకి అర్ధమైంది.

సత్యనారాయణని పొరుగు గ్రామంలో జరిగే ఓ పెళ్లికి పిలిచారు. దానికి అతను వెళ్లాడు. ఆహ్వానితుల్లో అనేకమంది సాధారణ పండితులు, వేద పండితులు ఉన్నారు. ఆనాటి ఆచారం ప్రకారం బ్రాహ్మణులంతా కూర్చోడానికి ఓ పక్కన

తివాచీని వేశారు. సత్యనారాయణకి మాత్రం పూజ్యస్థానంగా అదనంగా దిళు వేసారు. పక్కనే కూర్చున్న ఓ సోమయాజిని చూసి త్యనారాయణ ఓ దిండుని వయసులో తనకన్నా పెద్దవారన్న గౌరవంతో ఇచ్చాడు. అయితే సత్యనారాయణకి లభించే గౌరవానికి అసూయతో మగ్గిపోతున్న ఆయన ఆ దిండుని అసహ్యంగా దూరంగా విసిరేసి తన కోపాన్ని బహిర్గతం చేసాడు. భగవంతుడు ఆ అపచారాన్ని తనకి జరిగినట్లుగా భావించాడేమో, కొద్దిసేపట్లో ఆ సోమయాజికి కడుపులో ఆకస్మాత్తుగా నొప్పి ఆరంభమై బాగా బాధపడసాగాడు. గతంలో ఎన్నడూ అయనకి అలాంటి నొప్పి రాలేదు. ఈ సంగతి తెలిసిన సత్యనారాయణ ఆయన దగ్గరకి వెళ్లి భగవ న్నామం జపిస్తూ ఆయన పొట్ట మీద రాయసాగాడు. మనసులోనే పాండురంగడిని ఇలా ప్రార్థించాడు.

"స్వామీ! ఎందుకితనికి ఇంత బాధని కలిగించావు? అందరూ నీ బిడ్డలే కదా? ఇతని బాధని తగ్గించమని నిన్ను ప్రాధేయపడుతున్నాను."

ఆ సోమయాజుల నొప్పి తక్షణమే తగ్గింది. సత్యనారాయణ అంతఃకరణ అంత శుద్ధిగా ఉండేది.

❖ ❖ ❖

# 8

ఓసారి సత్యనారాయణకి 'శ్రీచక్రం ఉంటే బావుంటుంది. మాతృసేవ కూడా చేయచ్చు' అనుకున్నాడు. కొద్ది రోజుల్లో ఆయనకి ఓ కల వచ్చింది. అందులో దొంతి అనే గ్రామానికి వీరు వెళ్లినట్లు, అక్కడ అయ్యగారనే వ్యక్తి, వీరిని గౌరవించి 'నీకు శ్రీచక్రం కావాలా?' అని అడిగాడు. సత్యనారాయణ కావాలంటే, 'శ్రీచక్రార్చనం చేయదలిస్తే, శ్రీదేవియే నీ దగ్గరికి పరిగెత్తుకొస్తుంది' అని స్వచ్ఛమైన స్ఫటికంతో చేసిన శ్రీచక్రాన్ని సత్యనారాయణకి ఇస్తుండగా, అది చేయి జారి కిందపడింది. సత్యనారాయణతో ఆయన వెంటనే 'క్రిందపడడం వలన శ్రీచక్రం కింది ఫలాలనే అంటే ఐహిక భోగాల కోసమే ఉపయోగించు. ఆముష్మికానికి నువ్వు ఆచరించేదే సరైనది.'

కొన్ని రోజుల తర్వాత సత్యనారాయణ గణపురం అనే గ్రామానికి వెళ్లాడు. అక్కడ అర్చనలేని ఓ శ్రీచక్రాన్ని చూసి అడిగితే, వాళ్లు తీసుకెళ్లామని చెప్పారు. చంద్రమౌళిశాస్త్రి గారనే ఆయన శ్రీచక్రదీక్షకి మూలమంత్రాన్ని ఇచ్చాడు. ఆ రోజే శ్రీచక్రానికి సత్యనారాయణ మహాపూజ చేశాడు. కృష్ణ ప్రభువే చక్రాధిష్ఠాన దైవమని భావించి సత్యనారాయణ పూజ చేయసాగాడు. ఆ తర్వాత వీరి శిష్యులే పూజ చేసేవారు. మళ్లీ ఎన్నడూ ఆయన శ్రీచక్ర పూజ చేయలేదు.

నవార్ణ మంత్రాధిష్ఠాన దేవత చండీదేవి. ఈమెకి పూజ చేయాలంటే బలి ఇవ్వాలి. కాని సాత్విక పూజలే వారికి అలవాటు. ఓసారి కలలో పెద్ద పులి మింగడానికి వచ్చి మెడని పట్టుకుంది. కానీ, నొప్పిలేక మెత్తని దూదితో పట్టుకున్నట్టుగా అనిపించింది. మరోసారి ఇంకో కలలో ఓ సింహం ఆశ్రమంలోకి గర్జిస్తూ పరిగెత్తుకొచ్చింది. దాని నోట్లోంచి అగ్ని జ్వాలలు వస్తుండగా, 'సప్తశతి పారాయణం ఆపివేయమని, చండి అనే రెండక్షరాలని ఉచ్చరించ కూడదని' చెప్పి మాయమైంది. మరో కలలో జగత్ ప్రభువు కనిపించి 'సప్తశతి పారాయణం

వద్దన్నా వినకుండా చేస్తున్నావు. చండి అనే మాటే వద్దు. వీటిని పారాయణం చేయమని' విష్ణుసహస్రనామం, గీతా పుస్తకాల నించి మాయమయ్యాడు. అప్పటినుంచి సప్తశతి విధానమైన దేవీసేవని ఆ గ్రామంలో నిలిపివేశారు.

ఓ శివరాత్రికి నలుగురైదుగురు తప్ప, మిగిలినవారంతా ఉపవాసం ఉన్నారు. రాత్రి రెండుసేర్ల బియ్యంతో ఉపాహారం, అన్నం వండారు. హఠాత్తుగా పక్క గ్రామాల నుంచి ఇరవై మంది వచ్చారు. వంటవాడు నరసమాంబ దగ్గరికి వచ్చి చెప్పాడు.

“నర్సక్కా వండింది ఐదుగురికి. వడ్డించాల్సింది ఇరవై మందికి ఎలా?”

“నాయనా! నువ్వేం భయపడకు. వండిన పాత్ర లోపలికి చూడ కుండా అన్నం వడ్డించు. స్వామి ఉన్నాడు, ఆయన చూసు కుంటాడు” అని చెప్పింది.

అందరికీ వడ్డించగా, వంట మనిషికీ, ఈశ్వరుడికి సరిపోయే అన్నం మిగిలింది.

ఎంతమంది ఆశ్రమానికి వచ్చినా లేదనకుండా అందరూ భగవత్ స్వరూపులని భావించి, ఎన్ని రోజులున్నా పొమ్మనకుండా అన్నదానం చేసేవారు. మంత్ర దీక్ష ఇచ్చినప్పుడు గురుదక్షిణ కూడా అడిగేవారు కాదు. అనుకోకుండా వచ్చే ధనం మీదనే ఆధారపడేవారు. యాచన చేయకూడదని మొదట్లోనే ఆయన ఒట్టు పెట్టుకున్నారు. దాంతో వ్యయం అధికమై ఆదాయం సరిపోయేది కాదు. అప్పటికే ఉన్న బంగారాన్ని అమ్మి అన్న దానం చేసేవారు. అప్పు తెచ్చి అన్నదానం చేయసాగారు. అప్పు చెల్లించాల్సిన తారీఖుకి ముందే చెల్లించాలని అది తీర్చకుండా మరోచోట తీసుకోకూడదనే నియమాన్ని పాటించేవారు. అప్పు ఇచ్చినవారు డబ్బు పంపమని రాసిన ఉత్తరాన్ని చదివి, వీరికి తల తీసేసినట్లయింది. ఆశ్రమానికి వచ్చేవారు తిని వెళ్లడమే తప్ప, డబ్బు ఇచ్చేంత ధనికులు కారు. ఆ రాత్రి సత్యనారాయణ విచారిస్తూ పడుకుంటే, కలలో నారా యణుడు కనిపించి ‘నీకు ఐదు వం దల డెబ్భై రూపాయలు వచ్చేట్లు చేస్తున్నాను. అందులో వంద రూపాయలు నాకు వినియోగించు’ అని చెప్పి అదృశ్యమయ్యాడు.

మూడు రోజుల తర్వాత సత్య నారాయణ సమీపంలో ఉన్న ఓ గ్రామానికి ఓ స్నేహితుడి దగ్గరకు వెళ్లాడు. గ్రామాధికారి సత్యనారాయ ణని రమ్మన్నాడని చెప్పి అతని దగ్గరకి తీసుకువెళితే ఆ ఇంట్లోని ఇద్దరు వీరికి తలో రూపాయి ఇచ్చి నమస్కరించారు.

"ఏడు నెలలుగా నా చేతికందింది ఈ రెండు రూపాయలు మాత్రమే." చెప్పాడు సత్యనారాయణ స్నేహితుడు ఆ మాట విని బాధపడ్డాడు. అక్కడి నుంచి సత్య నారాయణ కేశవపురంలో జరిగే వార్షిక నవరాత్రులకు వెళ్లాడు. ఆ రోజుల్లో అక్కడ వీరికి నలభై రూపాయలు ఇచ్చేవారు. కానీ ఈసారి నూట ముప్పై రూపాయలు వచ్చాయి. ఆ తరువాత మరో ఊరికి బంధువుల దగ్గరికి వెళుతూ ఉంటే రాత్రి ఓ చోట బసచేశాడు. మర్నాడు బయల్దేరుతుంటే గ్రామస్తులు వచ్చి చెప్పారు.

"ఇవాళ కార్తీక పౌర్ణమి. ఈ పర్వదినాన కొద్దిసేపు గ్రామంలో ఉండండి."

గ్రామస్తులు ఆయనకి ఒక గంటలో 40 రూపాయల దక్షిణలని సమర్పించారు. దారిలో మరో గ్రామం గుండా వెళుతూ ఉంటే ఓ వైశ్యుడు తన ఇంట్లో బసచేయమని బలవంతం చేశాడు. ఆ వైశ్యుడు కొత్తగా చేయించిన పల్లకిలో సత్యనారాయణని తన ఇంటికి తీసుకువెళ్లాడు.

పల్లకిలో వెళ్తుండగా గ్రామస్తులు సత్యనారాయణ పల్లకిని తమ ఇళ్ల ముందు ఆపించి దక్షిణలు సమర్పించారు. వైశ్యుడు ఆయన్ని బాగా సత్కరించాడు. మొత్తం రెండు వందల రూపాయలు ఆ గ్రామంలో లభించాయి. దారిలో మరో ఊరిలో ఒంటిమీది మట్టిని నల్చి కూడా ఇవ్వని గ్రామస్తులు సత్యనారాయణకి 40 రూపాయలు దానం చేశారు. ఈ విధంగా కొద్ది రోజుల్లోనే 575 రూపాయలు పోగయ్యాయి. అందులోంచి ఒక వంద స్వామి కొరకు వినియోగించి, మిగిలిన దాంతో అప్పు తీర్చేశాడు.

వానప్రస్థాశ్రమం

సత్యనారాయణ వానప్రస్థాశ్రమాన్ని స్వీకరించాలని అనుకున్నాడు. దాంతో అతను ఆ విషయాన్ని ఎవరికీ చెప్పక స్వామియే ఎవరిద్వారా అయినా చెప్పించాలని

ఆగాడు. అతని శిష్యుడైన ఓ రైతు తను పండించినవి ముందు కొంత సత్యనారాయణకి సమర్పించి ఆ తరువాత తను వాడు కునేవాడు. ఆ రోజు ఆ విధంగా రెండు లేత దోసకాయలను తెచ్చి సత్యనారాయణకి ఇచ్చాడు.

"ఇవి ఎంత లేతగా ఉన్నాయి. వీటిని వండకుండానే తినొచ్చు. సంసారంలో రుచుల కోసం పాకులాడతారు కదా" చెప్పాడు సత్యనారాయణ. పక్కనే ఉన్న చంద్రమౌళి శాస్త్రి వానప్రస్థాశ్రమం గురించి ప్రస్తావించాడు. తాను ఆ ఆశ్రమ స్వీకారానికి సిద్ధంగా ఉన్నానని సత్యనారాయణ చెప్పాడు. తన ముఖ్య శిష్యుడైన ఈశ్వరుని పిలిచి ఈ విష యం మీద అతని అభిప్రాయం అడిగాడు. తర్వాత నరస మాంబని, యశోదమ్మని కూడా పిలిచి అడిగాడు. వారు ముగ్గురూ ఇలా చెప్పారు.

"మీరు అనుష్ఠించే ధర్మాన్ని మేము కూడా ఆచరిస్తాం."

దాంతో అంతా వానప్రస్థ ధర్మాన్ని అనుష్ఠించసాగారు. సత్యనారాయణ ఆజ్ఞ ప్రకారం పిల్లలకి, అతిథులకి కూడా వంట చేయడం మానేశారు. పిల్లలు కూడా అందుకు వ్యతిరేకించలేదు. వారి ఆరోగ్యానికి ఎలాంటి ఇబ్బందీ కలగలేదు. వానప్రస్థ ధర్మాలైన నిత్యాగ్నిహోత్ర సేవ, భగవత్ చింతనం, గృహస్థాశ్రమ సంబంధం లేక భార్యతో పరిచర్యలు మాత్రం తీసుకొనుట మొదలైనవి పాటించ సాగాడు. తల్లి శ్రాద్ధం వచ్చినపుడు కూడా తను తినే ఆహా రాన్ని పితృదేవతలకీ సమర్పించాడు. రామచంద్రమూర్తి అరణ్యవాసం చేసేప్పుడు ఇలాగే చేశాడు కాబట్టి సత్యనారా యణ దాన్నే పాటించాడు. వండడం మానాక ఆహారం లేకపోవ డం కొరతగా భావించి చాలామంది శిష్యులు, ఇతరులు రావడం మానేశారు. కొంతకాలానికి పేలాలు, సత్తుపిండి, పొయ్యి రాజెయ్యకుండానే తీసుకోసాగాడు. నెలకు ఏడు బస్తాల పేలాలు సరిపోయేవి. ఇలా మూడు సంవత్సరాలు గడిచాయి.

ఓ రోజు సత్యనారాయణ అతిథులకి అన్నదాన రూప సేవ మాధవసేవే కదా అనుకుని వంట చెయ్యడానికి అనుజ్ఞని ఇచ్చాడు. అందరికీ అన్నం తినడానికి అనుజ్ఞనిచ్చిన మీరు తినకపోతే తామూ తినమని కుటుంబ సభ్యులు చెప్పారు.

దాంతో సత్యనారాయణ కూడా అన్నం తినసాగాడు. తరువాత వచ్చిన సంవత్సరాదికి సత్యనారాయణ పిండివంటలు చేయడం లౌకిక విధి మాత్రమేనని శ్రీకృష్ణ జయంతి, శ్రీరామనవమి మొదలైన పండగలకి పిండి వంటలు వండి, ఆయా దేవుళ్లకు సమర్పించుకుని తినడం మంచిదని చెప్పాడు. అయినా పండుగకి ఊరు నుంచి వీరి బంధువైన ఓ స్త్రీ వచ్చింది. ముందు రోజు రాత్రి ఓ శిష్యుడు గోధుమ పిండి, బెల్లం తెచ్చి ఉంచాడు. ఇది దైవలీలగా భావించి పిండి వంటలు చేయడానికి అనుమతించాడు.

సత్యనారాయణ ఏకాంతంగా ఓ గుడిసెలో పడుకునేవాడు. అతను పడుకున్న పీటకి మూరెడు దూరంలో ఒక నాగసర్పం వచ్చి పడుకునేది. 'ఈ సర్పంలో ఉన్న వస్తువే నాలో కూడా ఉంది. సర్పానికి బయట కూడా ఆ దివ్య వస్తువే ఉంది. సర్పమనే పేరుకి, దాని రూపానికే కదా అంతా భయపడేది. ఆ నామ రూపాలని తీసేసి చూస్తే ఉనికే లేని సర్పానికి దేనికి భయపడడం' అని ఆలోచిస్తూ నిర్భయంగా పడుకునేవాడు. ఇలా రెండు నెలలు గడిచాక ఆ పాము రావడం ఆగిపోయింది. ఓసారి పాండురంగ మందిరంలో సత్యనారాయణ పారాయణం చేస్తుండగా ఈశ్వరుణ్ణి పాము కాటేసింది. అతన్ని సత్యనారా యణ దగ్గరికి తెచ్చారు. ఆయన పారాయణానికి భంగం వాటిల్లకూడదని యశోదమ్మ పాము కరిచిన చోట భగవన్నామంతో తులసి ఆకుతో తుడిచి మరో ఆకు అతని నోట్లో వేసింది. కొద్దిసేపట్లో అతని విషం దిగింది.

మరోమారు కూడా ఈశ్వరుణ్ణి పాము కాటేసింది. అప్పుడు సత్యనారాయణ, అతని పక్కన కూర్చుని, భగవన్నామం జపిస్తూ, పాము కరిచిన చోట తన చేత్తో రాయసాగాడు. అతనికి పాము మంత్రం రాకపోయినా విషం దిగిపోయి ఈశ్వరుడికి స్వస్థత చేకూరింది.

సత్యనారాయణ తరచూ మరణించిన ఇద్దరు పవిత్ర వ్యక్తుల్ని గుర్తు చేసుకునేవాడు. వారిలో ఒకరు రాపోలు నృసింహా చార్యులు,మరొకరు ఆకెళ్ల సూర్యనారాయణ. వీరిద్దరూ మంచి పండితులు. శ్రీ సూర్యనారాయణ చక్కటి ఉపాసనాపరులు. ఆయన పోయి 24 సంవత్సరాలైనా పండితుడిగా ఆయన

పేరు ప్రజలు మర్చిపోలేదు. వారు 'ఆత్మలాభం కావాలంటే శ్రీ సత్యనారాయణని చేరండి. వారి దయతో తప్పక లభిస్తుంది' అని చెప్పేవారు. సూర్యనారాయణ పెద్దకొడుకు సుందరశాస్త్రిని, రెండో కొడుకు కృష్ణమూర్తిని అనుష్ఠానం కోసం సత్యనారాయణ దగ్గరికి పంపారు. కృష్ణమూర్తి అఖండ సప్తశతి పారాయణం చేసేవాడు. సత్యనారాయణ 'దాన్ని మానేయమని, ఇక నామస్మరణ చేయమని' చెప్పగా అతను రోజుకో లక్ష చొప్పున హరేరామ మంత్రాన్ని దీక్షగా చేసేవాడు. ఉదయం ఏకాదశ రుద్రాభి షేకం చేసి, ఆధ్యాత్మ రామాయణాన్ని పఠించి, తరువాత లక్ష హరేరామ మంత్రాన్ని చేసేవాడు. సత్యనారాయణ కృష్ణమూర్తిని ఉదాహరణగా తీసుకోమని తన శిష్యులతో చెప్పేవాడు.

సూర్యనారాయణ కూతురు లక్ష్మీనరసమ్మ కూడా సత్య నారాయణ నుంచి మంత్రదీక్ష తీసుకుని రోజుకి లక్ష జపం చేసేది. ఓసారి లక్ష్మీనరసమ్మకి జబ్బు చేసింది. ఆ జబ్బులో కూడా నామస్మరణని వదలలేదు. ఎలా ఉందని సత్యనారా యణ ఆమెని పలకరిస్తే తను మరణానికి దగ్గరగా వచ్చానని చెప్పింది. అంతా కలసి నామస్మరణ చేస్తుండగా లక్ష్మీనరసమ్మ మరణించింది.

సన్యాసాశ్రమ స్వీకారం

ప్రభుప్రేమకి గృహస్థాశ్రమం ప్రతిబంధకంగా ఉందని సత్య నారాయణ భావించాడు. అందువలన సర్వసంగ పరిత్యాగమే మేలని భావించాడు. ఆషాఢీ ఉత్సవం ప్రారంభమైన రాత్రి సత్యనారాయణకి ఓ కల వచ్చింది. భవిష్యత్తులో మఠం నిర్మిం చబోయే చోట పెద్ద చప్పుడు సత్యనారాయణకి వినిపించింది. వెళ్లి చూస్తే ఓ బంగారు విమానం తళతళలాడుతూ కనిపించింది. ఒకతను విమానం నుండి దిగి సత్యనారాయణతో 'శ్రీ స్వామి విమానాన్ని పంపారు. మిమ్మల్ని తీసుకురమ్మన్నారు' అని చెప్పాడు. జవాబుగా సత్యనారాయణ 'తప్పక వస్తాను. కానీ లోపలికి వెళ్లి ఓ విషయం గురించి తెలుసుకు వస్తాను' అని చెప్పాడు. సత్యనారాయణ లోపలికి వెళుతూ 'ఆషాఢీ ఉత్సవం ఎలా జరుగుతుంది' అనే వాసన నాలో ఇంకా ఉంది. నాకు తెలియకుండా ఇంకా వాసనలు మిగిలి ఉ న్నాయా? అనుకు న్నాడు. వీరి ముఖ్య శిష్యుడు సుందరశాస్త్రి, మరికొందరు

వంట చేస్తున్నారు. సత్యనారాయణని చూసి 'మీరు సందేహించకుండా వెళ్లండి. మేమన్నీ చూసుకుంటాం' అని చెప్పారు. 'ఇదేమిటి! విమానం వచ్చిన సంగతిగాని, ఉత్సవం ఎలా జరుగుతుందనే సంగతి కానీ నేను ఎవరితోనూ చెప్పలేదు కదా! వీరికెలా తెలిసింది' అనుకున్నాడు సత్యనారాయణ.

సత్యనారాయణకి బాల్యంలో తారకమంత్రోపదేశం చేసిన రామయ్య అనే అతను ఎదురయ్యి చెప్పాడు.

"నాయనా! నీకు భయం వద్దు. నీలో ఎలాంటి వాసనలూ లేవు. విమానంలో వెళ్లు."

సత్యనారాయణ విమానం దగ్గరికి వెళ్లి అందులోంచి దిగివచ్చిన అతన్ని అడిగాడు.

"మీరు నన్ను ఏ చోటకు తీసుకువెళ్తారో? అక్కణ్ణించి ఇంకెక్కడికైనా తీసుకువెళ్తారా? లేదా అదే శాశ్వత స్థానమా?"

"అదే శాశ్వత స్థానం. దానికంటే గొప్ప స్థానం ఇంకొకటి లేదు" జవాబు చెప్పాడు.

సత్యనారాయణ విమానం ఎక్కగానే అది కొద్దిగా పైకి లేచింది. ఇంతలో శ్రీరామచంద్రయ్యగారిలాంటి ఒక వ్యక్తి విమానానికి ఎదురొచ్చి చెప్పాడు.

"మీరు ఇప్పుడు వెళ్లడానికి వీల్లేదు. ఇంకా కొంతకాలం ఉండాలి."

విమానంలోని వారు తాము ప్రభువు ఆజ్ఞతో వచ్చామని, ఆయననించి సత్యనారాయణని తీసుకురావద్దనే ఆజ్ఞాపత్రం ఉంటే తప్ప, తాము తీసుకుని వెళ్లాల్సిందేనని చెప్పారు. ఆ వ్యక్తి వెంటనే వెళ్లి, కొద్దిసేపల్లో అలాంటి ఆజ్ఞాపత్రాన్ని తీసుకురాగానే వారు శ్రీసత్యనారాయణని వదిలి వంటరిగా వెళ్లిపోయారు.

సత్యనారాయణ ఈ కల వల్ల ప్రభావితమై సన్న్యాసాశ్రమాన్ని స్వీకరించదలిచాడు.

కలకి ప్రత్యక్ష నిదర్శనం కనబడాలని సత్యనారాయణ కోరుకున్నాడు. సన్న్యాసాశ్రమస్వీకారం చేసే వ్యక్తికి వేరొక వ్యక్తి కాషాయవస్త్రాలు తీసుకొచ్చి

ఇవ్వాలి తప్ప, స్వీకరించేవాడే వాటిని తెచ్చుకోకూడదు.

'మర్నాడు ఉదయం రామచంద్రయ్య పాండురంగాశ్రమానికి వచ్చి నాకు కాషాయవస్త్రాలిస్తే, దేవుడికి నా సన్న్యాసస్వీకారం సమ్మతమని అనుకుంటాను. లేకపోతే లేదు.' అనుకున్నాడు.

రామచంద్రయ్య ఎక్కడున్నాడో కూడా తెలీదు. ఆ సమయం లో సిద్ధిపేట నుంచి హైద్రాబాద్‌కి బస్‌లో ప్రయాణమైన రామచంద్రయ్యకి ఆశ్రమానికి వచ్చే ఆలోచన లేదు. బస్సు గౌరారం అనే చోటికి రాగానే రామచంద్రయ్యకి ఆశ్రమానికి వెళ్లాలనే ఆలోచన బలంగా కలిగింది. సూర్యాస్తమయ సమయం అవడంవలన గౌరారంలో బస్సు దిగి, ఆరు మైళ్ల దూరంలోఉన్న పాండురంగాశ్రమానికి వెళ్లే సమయం లేదు. అయినా బస్సు దిగి, పాండురంగాశ్రమానికి వెళ్తుంటే, మార్గం మధ్యలో మాముదాల గ్రామస్థులు రాత్రి తమ దగ్గర విశ్రమించి వెళ్లమని చెప్పినా, అక్కడ ఉండక పాండురంగాశ్రమానికి చేరుకున్నాడు. సత్యనారాయణ అనుమానం దీంతో నివృత్తి అయింది.

సన్న్యాసాశ్రమానికి కాషాయవస్త్రాలు ఇచ్చేవారు వచ్చారు. అలాగే దండం కూడా అప్రయత్నంగా రావాలని సత్యనారా యణకి మనసులో వుంది. మరుకూకులోని ఒకరి దగ్గర అది ఉందని సత్యనారాయణకి తెలిసింది. ఏడు కణుపులు గల దండాన్నే గ్రహించాలని శాస్త్రం చెప్తోంది. అలాంటిదే ఆ వ్యక్తి దగ్గర ఉంది. తను అడగకుండానే మర్నాటి ఉదయంకల్లా అది తన దగ్గరికి రావాలనుకున్నాడు.

ఆశ్రమం తీసుకునే ఉదయం మరుకూకులోని ఆ వ్యక్తి దండాన్ని పంపించాడు. వారి సన్న్యాసస్వీకారం గురించి నరస మాంబకి, ఈశ్వరుడికి, యశోదమ్మకి, విశ్వనాథశర్మకి, రామ చంద్రయ్యకి మాత్రమే తెలుసు. అంతకు మునుపే సత్య నారాయణ భార్యని సన్న్యాసాశ్రమానికి అనుమతి అడగగా ఆమె జవాబు చెప్పింది.

"మీరే ఆశ్రమంలో వున్నా, మీ సేవ చేసుకునే అవకాశం మాత్రం నాకివ్వండి. ఇంతే నా కోరిక."



అందుకు సత్యనారాయణ సమ్మతించాడు.

శుభాను నామ సంవత్సర వైశాఖ శుద్ధ ద్వితీయ ఆదివారం (1943, మే నెల) ఉదయం పది గంటలకు, ఎలాంటి ప్రాయశ్చిత్త విధులతో నిమిత్తం లేకుండా, వివిధ విధులని పాటించకుండా, ఆతుర సన్న్యాసాశ్రమాన్ని స్వీకరించాడు. తల వెంట్రుకలు తొలగించుకుని తీసుకున్నాడు సత్యనారాయణ. తనకి సన్న్యాసాశ్రమాన్నిచ్చింది సద్గురు మూర్తి అని భావించి పాండురంగ మందిరానికి వెళ్లాడు. ఆ ఆలయంలో 'సన్న్యస్థం మయ సన్న్యస్థం మయ' అని ఉచ్ఛరించి యజ్ఞోపవీతాన్ని మంత్రంతో తీసివేసాడు. రామచంద్రయ్య సత్యనారాయణకి కాషాయవస్త్రాలు ఇచ్చి నమస్కరించాడు. ఆశ్రమస్వీకారానికి మునుపు తనకున్న సంపదను కుమారుడగు విశ్వనాథశర్మకి, ఒక జోలెను, వాసుదేవ ద్వాదశాక్షరీ మంత్రాన్ని, మరికొన్ని మం త్రాలని, గీతని, రామాయణాన్ని ఇచ్చాడు. ఇదే అతని సంపద.

ఒకసారి కాశీనించి ఒక జోషీ వచ్చి ఏం కావాలి అని అడిగితే కమండలం కావాలని చెప్పాడు. ఆరోజు అప్రయత్నంగా కొన్ని కమండలాలు వీరికి చేరాయి. దండాన్ని జగత్ప్రభువు ముందు పెట్టి, ఆయన తనకు ఇస్తున్నట్లు భావించి స్వీకరించాడు.

ఇంతకు ఐదు సంవత్సరాల ముందు జగత్ప్రభువు 'నువ్వు భావానంద నామం తీసుకోవాలి' అని దివ్యసూచన చేసాడు. ఆ 'భావానంద' నామాన్ని సన్న్యాస నామంగా స్వీకరించాడు. అప్పటినుండి సత్యనారాయణ భావానంద భారతి స్వాములుగా మారాడు. ఇక మీదట చరిత్రలో సత్యనారాయణని భావానంద స్వామిగా వ్యవహరించుకుందాం.

❖ ❖ ❖

# 9

ఆ విధంగా తన నలభై మూడవ ఏట శ్రీభావానంద భారతీ స్వాముల వారుగా మారారు.

అద్వైత సాంప్రదాయానికి మూల స్థానమైన శృంగేరీపీఠం వారి నుంచి ప్రణవోపదేశంను తీసుకోదలచి తన శిష్యుడైన సందర శాస్త్రిని వెంట తీసుకుని వెళ్లాలనుకున్నాడు.

ఇంతలో వారికి ఓ కల వచ్చింది.

ఒక ధర్మశాలలో భావానందస్వామి కూర్చుని ఉండగా, నల్లటి తేజశ్శాలి అయిన దివ్యపురుషుడు వచ్చి రెండు చేతులతో వీరి తలను పట్టుకుని స్వామివారి కుడి చెవి తన నోటి దగ్గరకి వచ్చేట్లు తిప్పుకుని చెవిలో ప్రణవ మంత్రాన్ని ఉ పదేశించి మాయమయ్యాడు. తర్వాత జగత్ప్రభువు మరోసారి కనబడి 'శృంగేరికి, మరెక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేదు' అని తెలిపి అంతర్ధానమయ్యాడు.

ఆ విధంగా తను ఇక శృంగేరీ వెళ్లాల్సిన అవసరం లేదని గ్రహించి, అక్కడికి వెళ్లడం విరమించుకున్నాడు.

స్వామివారి పినతండ్రి వీరి కంటే చాలా పెద్దవాడు. అంతకు పూర్వము వీరిపై ఆయనకి సాధారణమైన భావమే ఉండేది. ఆశ్రమస్వీకార విషయం తెలిసాక, అలౌకికభావం ఏర్పడగా మరుకూకు నుండివచ్చి, చిన్నవాడనే భేదభావం లేకుండా సాష్టాంగ సమస్కారం చేసాడు.

"నాయనా! మన వంశమంతా నీ ఆశ్రమ స్వీకారంతో పవిత్రమై ధన్యమైంది. ఈ నాటికి నువ్వెలాంటి వాడితో గ్రహించాను.

మఠప్రవేశం

సన్న్యాసాశ్రమం తీసుకున్నాక స్వామివారు ఇదివరకటి ఇంట్లో ఉండటం

ఇష్టంలేక తను వానప్రస్థ ఆశ్రమ సమయంలో వున్న గుడిసె లో నివసించసాగాడు.

ఓసారి వీరి శరీరానికి నీరు పట్టి, బాగా బాధ కలిగింది. శరీరమంతా బాగా వాచింది. ఓరాత్రి కలలో స్వామి వారికి ఊర్ధ్వపుండ్రములు ధరించిన వైష్ణవుడు కనిపించి చెప్పాడు.

"కర్మానుభవం నీ శరీరంలో వ్యాధి రూపంలో ఉంది." చిన్న దొప్పలో మూడు మాత్రలు ఇచ్చి చెప్పాడు.

"నీ కర్మానుభవాన్ని నేను తొలగించలేను కాని, నీకు బాధ కలగదు"

మర్నాడు ఉదయం నించి, శరీరానికి వ్యాధి ఉన్నట్లు కనబడినా స్వామి వారికి బాధ లేదు. ఇంతలో ఆషాఢ ఉత్సవం వచ్చింది. స్వామి కొంచెంసేపు భజన చేసే భక్తులతో, కొంచెంసేపు వంటగదిలో, కొంచెంసేపు భోజనం చేసే బ్రాహ్మణ పంక్తిలో, కొంచెంసేపు అతిథులని పలకరిస్తూ, తిరగసాగాడు. ఆ రాత్రి కలలో పీతాంబరాలు ధరించిన భగవానుడు కనబడి 'నాయనా నువ్వు అనుభవించాల్ని కర్మ ఇంకా నలభైరోజులు వుంది. నీ భార్య యశోదమ్మకి నీ కర్మను బదిలీ చేస్తున్నాను. నువ్వు ఆషాఢ ఉత్సవంలో హాయిగా పాల్గొను' అని చెప్పగానే మెలకువ వచ్చింది.

మర్నాడు ఉదయం యశోదమ్మకి తీవ్ర జ్వరం వచ్చింది. స్వామి వారికి కూడా అంతదాకా మూత్రం రాక బాధ కలిగేది. మర్నాడు మూత్రం యథాతథంగా వచ్చి, శరీరంలోని వాపు తగ్గింది.

ఒక మఠాన్ని నిర్మించాలని స్వామివారు సంకల్పించారు. ఈశ్వరుడితో ఇలా చెప్పారు.

"రావిచెట్టు వెనక ఉన్న ఆలయానికి వాయవ్య భాగాన, హనుమంతుడి ఆలయానికి పశ్చిమ భాగాన మఠం నిర్మించు."

ఈశ్వరుడు, విశ్వనాథశర్మ ఇద్దరే గోడలు, దిమ్మలు కట్టి మఠనిర్మాణం పూర్తి చేసారు.

మఠంలో నిద్రించిన ఓ రాత్రి స్వామివారికి కలలో తేజస్సుగల ఓ పీఠాధిపతి

మఠానికి వచ్చారు. స్వామివారు ఆయన్ని ఆదరంగా ఆహ్వానించారు. అప్పుడా యతి చక్రవర్తి రాంబాబా చెప్పాడు.

"నేను ఈ స్థానాన్ని సవరించాలని వచ్చాను. నువ్వు కర్కపట్లకి వెళ్లి అక్కడ పని చేయాలి" అని చెప్పి ఆయన మాయమయాడు.

కొద్దికాలానికి అక్కడ మఠంవారు వ్యవసాయాన్ని చేయసాగారు.

మరో స్వప్నంలో భవానీమాత కనపడితే, స్వామివారు ఆమెని అక్క డే నివసించమని కోరారు.

స్వామివారికి వచ్చే కలలు, సామాన్యులకి వచ్చే కలల్లాంటివి కాదు. ఎందుకంటే అవి నిజమ వుతూండేవి.

స్వామివారి పూర్వాశ్రమపు భార్య యశోదాదేవి అనుకూలవతి. తన హృదయంలో భర్త రూపాన్ని శ్రీకృష్ణప్రభువుగా భావించి ఎవరూ చెప్పక పోయినా అలా ధ్యానం చేసేది.

స్వామి సన్యాసాశ్రమం తీసుకోడానికి ఒక సంవత్సరం ముందే, ఆమెకి కలలో ఆ సంగతి సూచనగా తెలిసింది. ఒక దివ్య పురుషుడు, ఆమెకి కనిపించి కాళ్ల మెట్టెలు తీసి, పసుపుదారం కట్టాలని, కాషాయవస్త్రాలు ధరించాలని చెప్పాడు. స్వామి నించి యశోదమ్మకి బదిలీ అయిన వ్యాధి పెరిగి, పొట్ట ఉబ్బింది. ఊపిరి తీసుకోడానికీ ఇబ్బంది కలిగేది. ఆమెనించి దుర్వాసన కూడా రాసాగింది. ఆమెకి కలలో ఓ దివ్యవ్యక్తి శస్త్ర చికిత్స చేసాడు. దాంతో ఆరోగ్యం పుంజుకుంది.

ఓసారి స్వామివారు, పక్షవాతంతో కదలలేని పరిస్థితిలో మంచం మీద ఉన్నారు. అప్పుడు చలికాలం అవడంవల్ల అప్పుడు నిప్పుల కుంపటిని ఆ గదిలో ఓ మూల పెట్టారు. ఆ గదిలోకి వచ్చిన యశోదమ్మ స్పృహతప్పి ఆ కుంపటి మీద పడింది. ఆది ఆయన చూస్తూ కూడా ఏమీ చేయలేకపోయారు. కాని, ఆమెకి ఏమీ కాకపోవడం విశేషం. ఆమె దైవభక్తితో, భావావేశంలో గడుపుతూండేది. ఆమె ఒకరోజు తన కొడుకు పక్కన కూర్చుని భజన చేసిన కొద్దిసేపటికి, ఆమె

కదలకపోవడంతో కొడుకు పరీక్షిస్తే ఆమె మరణించినట్లు తెలిసింది. ఇది 1952, అధిక వైశాఖ శుద్ధ ద్వాదశినాడు జరిగింది. కలలో స్వామికందిన సూచన ప్రకారం మఠానికి ముందు రావిచెట్టు దగ్గర ఆమె సమాధిని ఏర్పరచారు. ఆమె ఆరాధన ఇప్పటికీ జరుగుతోంది.

స్వామివారు ఆశ్రమస్వీకారం తీసుక్ను తర్వాత, డబ్బుని ముట్టని వ్రతాన్ని కూడా పాటించసాగారు. ఒకసారి నవ రాత్రులకి స్వామివారు కేశవపురానికి వెళ్లారు. ఆ సమ యంలో పాండురంగ మందిరం నిర్మించిన భూమి తనదని ఓ జాగిర్దారు అనడంతో భూవివాదం చెలరేగింది. స్వామి వారు పట్టించు కోకపోవడంతో ఈశ్వరుడే ఆ వ్యవహారాన్ని తలపై వేసుకున్నాడు. కాని, అతని దగ్గర డబ్బులేదు. దాంతో ఈశ్వరుడు నిరాహార దీక్ష ఆరంభించాడు. ఇలా మూడు రోజులు గడిచాయి. ఒకరు కేశవపురానికి వెళ్లి ఈ విషయం స్వామికి చెప్పారు. అక్కడున్న  చంద్రమౌళిశాస్త్రికి ఈ విషయం తెలిసి, స్వామి వారిని భక్తులనించి డబ్బుని స్వీకరించమని కోరారు. తను ఈశ్వరాజ్ఞ ప్రకారమే నడుచు కుంటానని చెప్పగా, చంద్రమౌళిశాస్త్రి ధర్మపత్రం రాసి, దేవుడి ముందుంచి ఓ చిన్న పిల్లవాడి చేత ఓ కాగితాన్ని తీయిస్తే, 'ధనం స్వీకరించవచ్చు' అని వచ్చింది. ఇదంతా భగవంతుని ప్రేరణే అని స్వామివారు అనుకున్నారు.

చంద్రమౌళిశాస్త్రి ఆశ్రమానికి వచ్చిన ఆపదను చెప్పి విరాళాలు పోగుచేసాడు. తను చందా పట్టికలో వంద రూపా యలు రాసాడు. బీద బ్రాహ్మణుడు అయిన చంద్రమౌళిశాస్త్రి కన్నా మిగిలిన వారు ఎక్కువ చందా ఇచ్చారు. అక్కడికక్కడే పదిహేనువందల రూపాలయలు పోగయ్యాయి. మిగిలిన గ్రామాలనించి కూడా కొంత మొత్తం పోగయ్యింది. స్వామి వారు కేశవపురం నించి సికింద్రాబాద్‌కి వెళ్లారు.

సుందరశాస్త్రి ఉండే దేవాలయంలో బస చేసారు. అక్కడ కూడా కొంత డబ్బు పోగయ్యింది.

ఎదుటివారిని కించ పరచాలనే ఉద్దేశం లేకపోయినా, స్వామివారు ఇలా చెప్పారు.

"నాయనా! మీకు బాగా చదువుకున్న కొడుకు ఉండి, వివాహం అయ్యాక ఆతను నేరం చేసాడనుకోండి. అప్పుడు పోలీసులు అరెస్ట్ చేస్తే, అప్పుడు తల్లితండ్రులైన మీరు ఏదైనా చేయాలనుకుంటారా? లేదా? అంటుకున్న ఇంటిని ఆర్పని విధంగా ఉంచుకుంటారా? మీ కొడుకుని విడిపించేందుకు ప్రయత్నించరా?"

తర్వాత అనేకసార్లు స్వామివారు పై విధంగా మాట్లాడాలని తనకి లేకపోయినా ఆ పరమాత్మ తనతో ఆ మాటలు చెప్పిం చాడని ఎన్నోసార్లు ఆశ్చర్యంగా చెప్పారు.

లంకలో నిప్పు అంటుకున్నట్లుగా మాటలకి ప్రభావితమైన ప్రజలు విరాళాలు ఇచ్చారు. అలా పన్నెండు వందల రూపా యలు పోగయ్యాయి. స్వామివారు తనకాట్టే పరిచయం లేని గ్రామం నించి వెళ్తూంటే, ఆయన్ని ఆహ్వానించి భూవివాద ఖర్చు ల నిమిత్తం ఓ గంటలో పధ్నాలుగు వందల రూపాయలు ఇచ్చారు ఆ గ్రామస్థులు.

ఈ భూవివాదంలో జాగీర్దారుకి అపజయం కలిగింది. చివరికి దుర్దశ వాటిల్లి తినడానికి తిండే లేకుండా పోయింది. వీరి ఆశ్ర మానికే వచ్చి శరణాగతుడై వేరే దిక్కులేక కూటికి వీరినే యా చించాడు. పూర్వ ద్వేషాన్ని విస్మరించి స్వామివారు ఆ తురుష్క జాగీర్దారుని ఆదరించారు. స్వామివారు ఉపనిషత్తులు మొద లైన వాటి మీద ప్రవచనాలు ఇవ్వసాగారు.

రజాకార్లు

ఓ రాత్రి స్వామి వారికి ఓ కల వచ్చింది. ఓ దివ్య పురుషుడు కనపడి 'ఇప్పుడు తత్త్వముల సమయం కాదు. కేవలం నామమే శరణ్యం. ఘోరకాలం వస్తోంది. నామమే శరణ్యం' అని మాయ మయ్యాడు.రామనామ చేయాలనికూడాఆయన సూచించాడు.

కలి కల్మషాలని హరించే హరేరామ మంత్రాన్ని చేయసాగారు. స్వామి వారికి స్వప్నంలో తెలిసిన ఘోరకాలం, రజాకార్ల దాడి అయింది. హరేరామ

మంత్రాన్ని ముద్రించిన కాగితాన్ని స్వామి వారు అందరికీ పంచి ఆ మంత్రం ప్రచారం చేయసాగారు.

మరోసారి కలలో రుక్మిణీమాత ప్రత్యక్షమై కేవలం 'రామ్' అనే మంత్రాన్ని చేస్తే చాలని చెప్పింది. ఆ తర్వాత ఆ నామాన్నే చేయసాగారు. ప్రతీవారికీ ఇన్ని నామాలు చేయాలని సంఖ్యని నియమించి స్మరణ అయిన నామాల సంఖ్యని నమోదు చేయ సాగారు. విధుమౌళిశాస్త్రి అనే అతను నూట ఎనిమిది భజన సంఘాలకి ప్రచారం చేసాడు.

అది మ్లేచ్ఛ పరిపాలనా కాలం కాబట్టి, ప్రభుత్వబలం చూసుకుని మ్లేచ్ఛులు హిందువులపై రజాకార్ల సంఘం అనే పేర దాడి చేయసాగారు. దీనికి వ్యతిరేకంగా ప్రజలు కమ్యూనిస్ట్ సంఘమనే పేర ఏర్పాటయ్యారు. వారి మధ్య సంఘర్షణ మొదలయ్యింది.

ఈ ఘోర కాలంలో చుట్టుపక్కల ఇరవై గ్రామాల వారు తమ వెండి. బంగారాన్ని తీసుకువచ్చి పాండురంగ ఆశ్రమంలో దాచు కోసాగారు.

"నాయనా! మీ నగదుని మూట కట్టి, మీ పేరు రాసుకుని, ఇక్కడి ఏదైనా గదిలో పెట్టుకుని వెళ్లండి. అది పోతే మాత్రం మా బాధ్యత లేదు." అని వారికోసం ఓ గదిని స్వామివారు ఏర్పాటు చేసారు.

ఆ ఆశ్రమం కూడా అనాథ శరణాలయంగా మారిపోయింది. వారిచేత నామస్మరణని స్వామివారు చేయించేవారు. రజాకార్లు ఆశ్రమం మీద పడకుండా కమ్యూనిస్ట్‌లు కాపాడసాగారు. ఒక అసూయాపరుడు వెళ్లి రజాకార్లతో, ఆ ఆశ్రమంలో చాలా ధాన్యం నిల్వ వుందని చెప్పాడు. వారు ఆశ్రమం తగల పెట్టడానికి అక్కడికి వచ్చారు. కాని వారు ఆశ్రమానికి రాగానే మనస్సుమారి వెనక్కి వెళ్లిపోయారు. కమ్యూనిస్ట్‌సంఘం ద్వారా ఆశ్రమాన్ని దోపిడీ చేయాలని మరొకరు ప్రయత్నించినా అదీ ఫలించలేదు.

స్వామివారికి ఒక కలలో ఆశ్రమ రక్షణకై ఆంజనేయుడు, సుగ్రీవుడు, అంగదుడు, నలుడు వున్నారని తెలిసింది. ఒకరోజు ఆశ్రమ వాసులని బెదిరించి చందాలు వసూలు చేయాలనుకుని ఓ కమ్యూనిస్ట్ నాయకుడు వచ్చాడు. ఆశ్రమం

వెనక వారి దళం దగ్గరకి విశ్వనాథశర్మ, ఈశ్వ రుడు వెళ్తే, వారు చందా అడిగారు.

విశ్వనాథశర్మ వారితో నిర్భయంగా వాదన చేసాడు. ఓ ఆముదపు చెట్టు కర్రని చేతిలోకి తీసుకుని ఆ కర్ర చేసినంత పనికూడా మీరు చేయరని తీవ్రంగా చెప్పాడు. వాడు వెనుకంజ వేసి, ఒక ధోవతినైనా ఇవ్వమని, దాన్ని తీసుకుని వెళ్లిపోయాడు.

మరోసారి ఓ కమ్యూనిస్ట్ నాయకుడు ఏభైమందికి రాత్రికి వంట చేయమని కబురు పంపాడు. వంట సిద్ధం చేసారు. అర్ధరాత్రి నూట ఏభై మంది గల కమ్యూనిస్ట్ దళం వచ్చింది. వారందరికీ ఈశ్వరుడు, విశ్వనాథశర్మ వడ్డించారు. ఏభైమందికి వండిన అన్నం నూట ఏభై మందికి సరిపోవడం విశేషమే!

ఆశ్రమ ప్రాంతంలో ఓ పెద్దపులి సంచరిస్తూండేది. ఓ రోజు ఒక దూడ మెడని నోట కరుచుకుని తీసుకెళ్లింది. ఆ రాత్రి స్వామి వారికి కలలో జగజ్జనని రుక్మిణీదేవితో కూర్చుని వున్న శ్రీకృష్ణుడు కనిపించాడు. ఆయన ఆశ్రమం లోపలకి వారిని రమ్మని ఆహ్వానిస్తే, 'మేం లోపలకి వస్తే, పులి రాకుండా ఎవరు రక్షిస్తారు?' అని అడిగారు. ఆ తర్వాత పులి బాధ ఆశ్రమానికి తప్పింది. ఆ దూడకి కూడా ఏం కాలేదు.

ఏ గ్రామానికి ఏ దళం వెళ్లినా వ్యతిరేక దళం వారు వచ్చి, ఆ గ్రామస్థులను వారికి ఆశ్రయం ఇచ్చినందుకు హింసించేవారు. కాని ఆశ్రమానికి రెండు దళాల వారు వస్తూండేవారు. కారణం స్వామివారు ఎవరినీ ద్వేషించేవారు కారు.

ప్రభుత్వం వారు రేషన్ పద్ధతిని ప్రవేశపెట్టారు. చక్కెర, గోధుమలు, బియ్యం మొదలైన వాటిమీద రేషన్ ఉండేది. ఆ సమయంలో ఆశ్రమంలో ఆషాఢి ఉత్సవం వచ్చింది. వందల మందికి సరిపోయే ఆహారం అవసరమైంది. వస్తువులు లభించడం ప్రయాసతో కూడిన పని కాబట్టి, ఉత్సవాన్ని మానాలని కాని, లేదా క్లుప్తంగా చేయాలని కానీ స్వామివారు అనుకోలేదు. అన్ని వస్తువులు లభించాయి కానీ, చక్కెర మాత్రం లభించలేదు. దశమినాటికి చక్కెర తెస్తామని



కొందరు మాట ఇచ్చారు. ఏకాదశి, ద్వాదశిలలో జనం కోలాహలంగా వస్తారు. ఏకాదశి ఉదయం దాకా చక్కెర రాలేదు. స్వామి వారు ఉపయోగించుకునే చిన్న మరచెంబులో మాత్రమే చక్కెర వుంది. వచ్చిన వారికి టీ ఇవ్వడానికి నర్సమాంబ స్వామిని స్మరించి ఆ చెంబునుండి చక్కెర తీయసాగింది. ఆ చెంబు నుండి నిరాటంకంగా అనేక మణుగుల చక్కెర వచ్చింది. ఆ రాత్రికి జగదేవపురం నించి చక్కెర వచ్చింది. అది రాగానే మరచెంబు నించి వచ్చే చక్కెర ఆగిపోయింది. ఆషాఢి ఉత్సవం ఎలాంటి ఇబ్బంది లేకుండా జరిగిపోయింది.

స్వామివారి ప్రియశిష్యుడు ఈశ్వరుడికి ప్రతిసంవత్సరం శిశిర ఋతువులో వ్యవసాయ పనులలో నిమగ్నమవడం వలన అనారోగ్యం వస్తూంటుంది. రెండు మూడురోజుల్లో తగ్గిపో తుంది. హేవిళంబి నామ సంవత్సరం, మాఘ మాసం, నవమినాడు అదే విధంగా ఈశ్వరుడికి కొద్దిగా జ్వరం మొదలైంది. స్వామి జగత్ప్రభువుని అడగగా, మందు ఇవ్వాల్సిన అవసరం లేదని చెప్పారు. దాంతో ఈశ్వరుడికి మందు ఇవ్వలేదు. మూడవరోజు జ్వరం కొద్దిగా తగ్గినా నాలుగవరోజున మళ్లీ మొదలైంది.

ప్రతీరోజు ఈశ్వరుడు స్వామి దగ్గర ఆధ్యాత్మ రామాయణం పారాయణం చేస్తూండేవాడు. జగత్ప్రభువు ఈశ్వరుడికి కల్లో కనబడి, ఆలస్యం కాకుండా పారాయణం చేయమని చెప్పాడు. ఆ కలలోనే, ఈశ్వరుడికి తెల్లబట్టల్లో వున్న

ఒక దివ్యపురుషుడు చేతిలో మురళితో కనిపించాడు. క్రమేపీ అతను బాలకృష్ణుడుగా మార్పు చెంది మాయమయ్యాడు. ఈశ్వరుడికి మెలకువరాగానే, ఈ సంగతి శ్రీవారికి చెప్పాడు. తర్వాత పడుకున్న ఈశ్వరుడు శ్రీకృష్ణనామ జపం చేయసాగాడు. స్వామివారు ఈశ్వరుడ్ని పిలిచి, తులసితీర్థం నోట్లో పోయగా, మాఘ శుద్ధ త్రయోదశి ఆదివారం అనగా 1957 ఫిబ్రవరిలో ఈశ్వరుడు తుదిశ్వాస వది లాడు. చుట్టు పక్కల పది గ్రామాలనించి ఈశ్వరుడి భౌతిక దేహం చూడడానికి తండోపతండాలుగా ప్రజలు వచ్చారు.

❖ ❖ ❖

## 10

ఒకసారి వాసాలమఱ్రి అనే గ్రామం నుంచి కొందరు స్వామివారి దగ్గరికి వచ్చి వారి అనుమతి తీసుకుని శివాలయం, రామాలయం నిర్మించారు. స్వామివారిని ఆ ఆలయాల్లో యంత్ర ప్రతిష్ఠాపన చేయమని కోరారు.

“నాయనా! నేను స్వతంత్రుడిని కాను. ప్రభువుని అడగాలి” చెప్పారు.

ప్రభువు సమ్మతించాక వాసాలమఱ్రికి వెళ్లి యంత్ర, విగ్రహ ప్రతిష్ఠలు చేశారు. ఆ తరువాత స్వామివారి ముక్కు నుండి ఏకధారగా రక్తం కారసాగింది. వేడి చేసి రక్తం కారిందనుకుని కొందరు మజ్జిగ తెచ్చిస్తే తాగారు.

ఆ రాత్రి స్వామికి కలలో ఎనిమిది మంది శక్తి మాతలు, ఎనిమిది మంది యాజ్ఞికులను పిలిచి సంజ్ఞ చేయగా, వారంతా కలిసి హెూమాన్ని చేశారు. తరువాత రాధాదేవి కనబడి స్వామివారికి చెప్పింది.

“అన్నదానం సరిగ్గా జరగనందువల్లే రక్తధార శాంతింపజేసింది” అని చెప్పింది. నిద్ర లేచాక స్వామివారు గ్రామస్తులను పిలిచి అన్నదానం ఎంత జరిపారని ప్రశ్నించారు.

“నాలుగు పల్లాలు బియ్యంతో అన్నదానం చేశాం” జవాబు చెప్పారు.

“అది సరిపోక పోవడంతో ఆ లోపానికి ఫలంగా తగిన శ్రమను దేవతలు నాకు కలిగించారు. అం దుకే రక్తం కారింది” చెప్పారు స్వామి.

మరో రెండు పల్లాల బియ్యంతో గ్రామస్తులు అన్నదానాన్ని శ్రీ స్వామివారి సూచన మేరకు చేశారు. అప్పటి నుంచి ఎవరైనా ఆలయ నిర్మా ణం గురించి స్వామివారి దగ్గరకు వస్తే అన్నదానం గురించి చెప్పి అందుకు వారు అంగీకరిస్తేనే సహాయం చేసేవారు.

మరోసారి ఎవరో ఆలయ నిర్మాణానికి ముహూ ర్తం పెట్టమని స్వామివారి

దగ్గరకు వస్తే ఆయన ముహూర్తం పెట్టారు. అయితే ఆ ముహూర్తంలో వర్షం ఉందని కొందరు పండితులు చెప్పారు. కానీ నెలలోపలే ఆలయ నిర్మాణం పూర్తయి శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠ కూడా జరిగింది.

ఇంకోసారి శ్రీవారి శిష్యులలో ఒకరు వచ్చి తన దరిద్రాన్ని తొలగించమని వేడుకున్నారు.

"నీ కర్మానుసారం దరిద్రాన్ని అనుభవిస్తున్నావు" శ్రీవారు చెప్పారు.

కానీ శిష్యుడు బ్రతిమాలగా దరిద్ర దశ తొలగి పోతుందని శ్రీవారు అనుగ్రహించారు. త్వరలోనే అతనికి నలభై వేల రూపాయల లాభం వచ్చింది.

ఓసారి భాగవతం గొప్పదా? లేక శ్రీకృష్ణ జన్మ ఖండం గొప్పదా? అనే విషయం మీద పండి తులలో చర్చ వచ్చింది. శ్రీకృష్ణ జన్మఖండంలోని రాధాకృష్ణ వైభవం అద్భుతంగా ఉంటుంది. ఈ విషయం మీద శ్రీవారు ఆలోచిస్తూ పడుకోగా, ప్రభువు స్వప్న దర్శనమిచ్చి కృష్ణ జన్మఖండం అబద్ధాల భాండారమని, భాగవతం పరమ ప్రామా ణికమైనదని చెప్పారు. ఆ తరువాత ఉపాధ్యాయు డుగా పనిచేసే మాసాయిపేటకు చెందిన గోపాలకృష్ణ శర్మ అనే అతను, మరికొందరు భాగవత సప్తాహాన్ని నిర్వహించారు.

ఇంకోసారి, శ్రీవారి కొడుకైన విశ్వనాథశర్మ ఇంటికి సికింద్రాబాద్ నుంచి వెళ్లిన సుందరశాస్త్రికి ఆ రాత్రి కలలో అశరీరవాణి రెండుసార్లు వినిపించింది.

"నీ తల్లి కృతార్థురాలు కావాలనుకుంటే ఆవిడతో భాగవత గ్రంథాన్ని విశ్వనాథశర్మకి దానంగా ఇప్పించు"

మర్నాడు సుందరశాస్త్రి ఆ ప్రకారమే చేశాడు. ఎందుకంటే సుందరశాస్త్రికి కలలు రావడం తక్కువ.

శ్రీవారు రాధాకృష్ణ నామ భజన చేసేప్పుడు ఆ పరమాత్ముడి పేర్లని ఒక్కొక్కటీ రాధ తర్వాత కృష్ణ బదులు చేర్చి భజన చేసేవారు. ఇలా రాధారమణ భజన చేయగానే ప్రభువు చిరు నవ్వుతో కనిపించి అలా వద్దని, 'రాధాకృష్ణ' అనే అనమని చెప్పి మాయమయ్యారు.

ఇంకో ఆషాఢీ ఉత్సవం వచ్చింది. చుట్టుప్రక్కల ఎక్కడా నీళ్లు లేవు. ఆ ఉత్సవానికి వేల మంది జనం వస్తే వారికి నీరు సంాఫరా చేయడం ఎలా అని స్వామివారిని అడిగారు. ఏకాదశి ఉద యం నుంచి ఆశ్చర్యంగా తోటలోని బావి నుంచి అవిచ్ఛిన్నంగా నీరు రాసాగింది. ముందు రోజు రాత్రి ఒక్క బక్కెట్ నీరు కూడా లేకపోయినా ఉదయం నీరు ఎంత తోడినా బక్కెట్లు కొద్దీ వచ్చి తిరిగి బక్కెట్ మునిగేంత నీరు మాత్రమే ఉండసాగింది. ద్వాదశి నాటి రాత్రి భక్తులందరూ వెళ్లిపోయాక బావిలో బక్కెట్ వేస్తే అది మునిగేంత నీరు కూడా లేకుండా పోయింది. ఒక బ్రాహ్మ ణుడు కాలు జారి బావిలో పడ్డాడు. నలభై అడుగుల లోతున్నా అతనికి ఏం కాకపోవడం ఆశ్చర్యమే! దీన్ని చాలామంది చూశారు.

ఒకసారి ఆశ్రమంలోని గడియారం చెడిపోయింది. దానిని హైదరాబాద్ పంపి బాగు చేయించాలని కొందరు అనుకోగా, స్వామి ఇలా చెప్పాడు.

“ఈ గడియారాన్ని మూడు రోజుల పాటు అలమారలో ఉంచి తలుపు వేసి, మూడవ రోజు మధ్యాహ్నం మూడున్నరకు దానిని తీస్తే అది పనిచేస్తుంది. మధ్యలో ఎవరూ తలుపుతీసి చూడ కూడదు”. అలా చేస్తే ఆశ్చర్యంగానే ఆ గడియారం బాగుపడి చాలాకాలం చెడిపోకుండా నడిచింది.

ఓసారి దామరకుంట అనే గ్రామం నుంచి ఓ గ్రామాధికారి వచ్చాడు. మూడు మైళ్ల దూరంలో ఉన్న అక్కడ కలరా వ్యాధి ప్రబలి అనేక మంది మరణించసాగారు. గ్రామ దేవతకి చేయాల్సిన పూజలన్నీ చేసినా ఫలితం లేకపోవడంతో అతను స్వామి దగ్గరకు వచ్చాడు.

అయితే స్వామివారెపుడూ లౌకికమైన ఇలాంటి వ్యాధి నివారణలు, సంతానాదులు, దయ్యాన్ని వదిలించడం వంటి పను లు చేసేవాడు కాదు. స్వామివారు ఐదు పూలను తీసుకుని, శుద్ధిసంకల్ప మంత్రంతో వాటిని గ్రామాధికారి చేతిలో ఉంచి చెప్పాడు.

“మీ గ్రామస్తులకు వచ్చిన బాధ తక్షణం ఉపశమించి ఇక ఎవరూ మరణించరు.”

ఆయన చెప్పిన ప్రకారమే జరిగి గ్రామస్తులు త్వరలోనే స్వస్థత చెందారు. మరోసారి స్వామివారు మఠంలోనే మంచం మీద పడుకుని ఉండగా అర్ధరాత్రి సమయంలో "మృత్యువు వచ్చింది" అని ఆకాశవాణి వినిపించింది.

"వస్తే రానీ. ఇక్కడ భయపడేవారెవరూ లేరు." అని మృత్యువు ఏ రూపంలో వస్తుందో చూద్దామనుకుని మంచం మీద నుంచి లేచారు. ఇంతలో ఆ మంచం మీద ఏదో పడ్డ శబ్దం వినిపించింది. బేటరీ లైటు వేసి చూస్తే పెద్ద తేలు ఒకటి కనిపించింది. 'ఒహో! ప్రభువు మృత్యురూపంలో వచ్చారు' అనుకుని మంచం మీద అలాగే పడుకు న్నారు. తను కదిలితే అదీ కదులుతుం దనుకుని కదలకుండా పడుకున్నారు. కొద్దిసేపటికి బూరుగుదూది దిండును తీసి దానిని తేలు మీద ఉంచితే ఎవరికీ ఇబ్బంది ఉండదనుకున్నారు. కొద్ది దూ రంలో పడుకున్న సోదరి నరసమాంబని పిలిచి తేలు విషయం చెప్పాడు. నరస మాంబ తన కట్టుచీరను తెచ్చి దిండుని తీసి చూస్తే తేలు కనిపించింది. ఆ గుడ్డతో దాన్ని ఆమె తీసుకెళ్లి దూరంగా వదిలింది.

శ్రీ స్వామివారికి ఎక్కువ జబ్బు చేసినప్పుడు అంతకుపూర్వం ఆరోగ్యంగా ఉన్న నరసమాంబ హఠాత్తుగా జబ్బుతో పడిపోయేది. శ్రీవారికి కొంచెం నయం కాగానే నరసమాంబ ఆరోగ్యం కూడా బాగయ్యేది. ఇలా రెండు మూడుసార్లు జరిగింది.

ఓసారి ఆశ్రమంలోకి ఓ కుక్క ఎక్కడ్నించో వచ్చి ఎవరు ఎంత కొట్టినా వెళ్లక అక్కడే ఉండసాగింది. శ్రీవారి ఆజ్ఞతో దానికి అన్నం పెట్టేవారు. అది ముసలిది అయ్యాక ఓ ఏకాదశి నాడు మరణించింది. ఆ రాత్రి నరసమాంబకి కలలో దాని కళేబరం దగ్గర స్వామివారు కూర్చుని కనబడ్డారు. ఆయన ఆశ్రమ వాసులతో కొంతసేపు భజన చేయించి ఆ కుక్కకి మరుజన్మ లేదని చెప్పారు.

శ్రీ స్వామివారికి మొదట్నించీ కడుపునొప్పి ఉండేది. అది పెరిగి అల్సర్‌గా మారింది. ఈ బాధకి తోడు అత్యాగ్ని అనే బాధ కూడా ఉండి ఒళ్లు కాలుతున్న బాధ కలిగేది. ఓసారి అత్యాగ్నితో బాధపడుతుండగా, వారి శిష్యులు ఆయన కర్మను తమకి కొంత పంచమని కోరారు. వెంటనే స్వామి తన కర్మలోని

పదహారవ వంతు ఆ శిష్యులకి బదలాయింపు చేశారు. ఆ బాధని భరించలేక వారు తిరిగి స్వస్థత చేకూర్చమని కోరగా, తిరిగి ఆ బాధని వెనక్కి తీసుకున్నారు.

'ఈ కర్మకి కారణం ఏమిటి?' అని వారడిగితే స్వామి ఇలా జవాబు చెప్పారు.

"నాయనా! ఇంక పునర్జన్మ లేకుండా మొత్తం కర్మని జగత్ప్రభువు నా చేత అనుభవింప చేస్తున్నాడు."

1948 సెప్టెంబర్‌లో సర్వధారి నామ సంవత్సరం, ఆశ్వయుజ మాసంలో స్వామివారికి పక్షవాతం వచ్చింది. కానీ కొద్ది రోజులకే అది బాగా తగ్గింది. కానీ తిరిగే పరిస్థితి మాత్రం లేదు. బహిర్భూమికి కర్ర సాయం తో మాత్రమే వెళ్లేవారు. మంచం మీదనే ఎక్కువ కాలం గడిపేవారు. అయినప్ప టికీ బోధనలు చేస్తూ వ్యాధిలేని వానివలె ఉల్లాసంగా ఉండేవారు.

ఒకరోజు స్వామికి ఓ వింత కల వచ్చిం ది. రమణీయమైన ప్రకృతి గల ఒకచోట బావిలోని నీటిలో స్వామి పడ్డారు. ఒక బ్రాహ్మణుడు వెంటనే వీరికి కనిపించారు. అతను స్వామి దగ్గరకు వచ్చి ఆయనను బయటకు తీశాడు. అతను ఇలా చెప్పాడు.

"నీవు అనుభవించాల్సిన కర్మ ఉన్నది కాబట్టి ఇలా పడ్డావు."

కొద్దిసేపట్లో ఒక శూద్రుడు పళ్ల గంపతో వచ్చి స్వామికి పళ్లివ్వగా, స్వామి వాటిని నిరాకరించి ఎంత చెప్పినా అతను వినకపోవడంతో ఆ శూద్రుణ్ణి కాలితో తన్నబోయాడు. ఆ శూద్రు డు, బ్రాహ్మణుడు స్వామిని చూసి ముసిముసిగా నవ్వసాగారు. ఇంతలో స్వామికి మైకం వచ్చి ప్రపంచ స్పృహే లేకుండా పోయింది. మైకం వదిలాక చూస్తే బావి ఒడ్డున ఎవరూ కనబడలేదు. 'ఈ ఇద్దరు మనుషులు ఎవరు?' అనుకుని నడవడం ప్రారంభించగానే నడక ఎప్పటిలా వచ్చింది. ఆ ఇద్దరూ దైవపురుషులుగా తెలుసుకుని పర్వతం వైపుకి వెళ్లారు. అక్కడ ఒక బంగారు సింహాసనం కనిపించింది. ఇందాకటి బ్రాహ్మణుడు స్వామికి సువాసన గల ఓ పుష్పాన్ని ఇచ్చాడు.

ఆ అరణ్యం జీవుని కర్మభోగ స్థానమైన సంసారం. బావి దుష్కర్మానుభవం. ఉత్తమోత్తమ కారణపురుషులు వీటికి పైభాగాన ఉంటారు. బావి నీటిలో పడడం జీవుని కర్మానుభవం. దాంట్లో పడ్డ జీవిని రక్షించినవాడు పురుషుడు. పర్వతం వైపు ప్రయాణం ప్రారబ్ధ కర్మానుభవ సమాప్తి. పళ్ల గంపతో వచ్చిన శూద్రుడు కర్మఫలదాత. ఆ బంగారు సింహాసనం జీవుని పరమలక్ష్యం. పూవులు ఇచ్చినవాడు పురుషోత్తముడు అని స్వామివారికి ఆ స్వప్న సారాంశం అర్థమయింది.

ఈ కల వచ్చాక ఎన్నో వ్యాధులు వచ్చినా అవి తమ ఉపాధి కర్మానుభవం అనుకుని స్వామి వాటిని అనుభవించేవారు.

"రోగాలు నాకు మిత్రులు ఇవి నాకు సహాయం చేస్తున్నాయి. వాటిని నాకు ప్రభువు దయతో ప్రసాదించాడు" అనేవారు.

తనకి నాలుగు వ్యాధులు సింహాల్లా ఉన్నాయని, ఒకటి పక్షవాతం, రెండోది అల్సర్, మూడోది బ్లడ్‌ప్రజర్, నాల్గోది పెద్ద నొప్పి... ఇలా ఆయన శరీరంలో వ్యాధి చతుష్టయం ఉండేది. పై రోగాలు స్నేహితుల్లా ఎలా పలకరించుకునేవో, స్వామికి అన్వయించి ఇలా చెప్పారు.

"బ్లడ్‌ప్రజర్ నేనెక్కువ మాట్లాడవద్దని, పెద్ద నొప్పి అనే వ్యాధి నేను ఘనపదార్థాలు తినరాదని, అల్సర్ పులుపు మొదలైన రాజస గుణాన్ని పెంచే క్షార లవణాలని తినవద్దని, నన్ను లోబడకుండా కాపలా కాస్తుంది. పక్షవాతం వాతంలో కూడిన పదార్థాలు తినకుండా తద్వారా తామస గుణాలు కలగనీయకుండా రక్షిస్తోంది. ఇలా అన్నీ నాకు ఉపకారం చేస్తుండగా, ఇవి నాకు ఎందుకు దాపురించాయి? అని అనుకోకూడదు."

ఒక కలలో స్వామివారికి వ్యాధి గురించి ఓ దివ్య పురుషుడు ఓ పెట్టెని చూపించాడు. నాలుగువైపులా అద్దాలు ఉన్న దానిలో నాలుగు పాములు ఉన్నాయి. ఆయన ఇలా చెప్పాడు.

"ఇందులోని నాలుగు పాముల్లో అతి పెద్దది నీకు పెద్ద నొప్పి రూపంలో ఉన్న వ్యాధి. దీనికంటే చిన్నది పక్షవాతం. బుసకొట్టే మూడోది అల్సర్. జానెడు

పొడవుండి, చురుగ్గా కదులుతున్నది బ్లడ్‌ప్రెజర్ వ్యాధి. వీటన్నింటిలో చిన్నదాన్ని మాత్రం నమ్మకూడదు. ఎందుకంటే అది చాలా ప్రమాదకరమైంది."

స్వామివారిని సికింద్రాబాద్‌లోని ఓ పెద్ద సివిల్ సర్జన్ దగ్గరకి తీసుకువెళ్లారు. ఆయన ఇచ్చిన మందులతో పక్షవాతం కొంచెం తగ్గినా, అల్సర్ ఎక్కువైంది. దానిని ఎక్సరే తీసి చూస్తే బాగా పెద్దగా ఉంది. నాలుగు వ్యాధులు ఉండడంతో ఒక వ్యాధికిచ్చే మందు మరో వ్యాధి వృద్ధికి కారణమవుతోంది. కాబట్టి ఆ వ్యాధులకి, మందులివ్వడం కష్టమని చెప్పారు. చివరికి ఓ తెలివైన డాక్టర్ ఇచ్చిన నాలుగు రకాల మందులతో ఇరవై రెండు రోజుల్లో వ్యాధులు అదుపులోకి వచ్చాయి. స్వామివారు ఆశ్రమానికి తిరిగి చేరుకున్నారు. కానీ కొద్దిరోజుల్లోనే మళ్లీ అవి తిరగబెట్టాయి. దాంతో స్వామివారు జగత్ప్రభువు కలలో చెప్పిన పద్ధతిలో మందులని వాడసాగారు.

ప్రతి అంశం– ఎంత నీరు తాగాలి, ఎప్పుడు తాగాలి, ఏ ఆహారం ఎప్పుడు తీసుకోవాలి, ఎప్పుడు పడుకుని, ఎప్పుడు లేవాలి, ఎటువైపు పడుకోవాలి– మొదలైనవన్నీ జగత్ప్రభువు చికిత్సకి గురువై ఇచ్చిన మార్గదర్శకత్వాన్ని అతిక్రమించక సాగేవారు. ఆకలి వేస్తున్నా ప్రభువాజ్ఞ రాకపోతే తినేవారు కాదు. మంచినీళ్లు, మందుల విషయంలో కూడా ఇలాగే ప్రవర్తించే వారు. ఆయన అనన్య శరణాగతికి ఇది నిదర్శనం. గొప్ప వైద్యులు కూడా కుదర్చలేని వ్యాధిని ప్రభువు కుదిర్చాడని ఎన్నోసార్లు స్వామివారు అనేవారు.

స్వామివారు పక్షవాతంతో మంచం మీద ఉన్నప్పుడు ఆయనకి అవసరం వచ్చినపుడు ఎవరూ అందుబాటులో లేని పక్షంలో ఆయన మనసులో అనుకోగానే ఎవరో ఒకరు పిలిచినట్లుగా వచ్చేవారు. ఇది ఆశ్రమంలో అందరికీ అనుభవమైన విషయమే. అలాగే ఎవరైనా ఏదైనా చెప్పాలని నమస్కారం పెట్టి ఎదురుగా నిలబడితే అది చెప్పకుండానే ఆయన సమాధానం చెప్పేవారు. స్వామివారికి ఎదుటివారి మనసులోని విషయాలు తెలుసుకునే శక్తి 28వ యేటనుంచే ఉంది.

1959 ఆగస్టులో స్వామివారికి మరోసారి పక్షవాతం వచ్చింది. ఈసారి పక్షవాత లక్షణాలు అలాగే నిలిచిపోయి కాలు, చెయ్యి కదలకుండా పోయాయి.

భోజనం కూడా తినిపించాల్సి వచ్చేది. జగదేవపురం, త్రిగుళ్ల, మరుకూకు, మామిడాల అనే గ్రామాల నుంచి బ్రాహ్మణులు వచ్చి స్వామికి సేవచేయసాగారు. రాజమౌళిశర్మ, గోపాలశర్మలు మూడు నెలల పాటు సేవ చేస్తూ అఖండనామస్మరణ చేశారు.

వికారి నామ సంవత్సరం ఆశ్వయుజ మాసంలో శ్రీవారి షష్ఠిపూర్తి ఉత్సవం చేయడానికి సుందరశాస్త్రి ముందుకు వచ్చాడు. ఇరవై ఏళ్ల క్రితమే శ్రీవారు శార్వరీ నామసంవత్సరంలో పరమపదిస్తామని చెప్పారు. తనని చూడడానికి వచ్చిన సందర్శకులని ఆయన భోజనం అనుకూలంగా ఉందా? ఆరోగ్యం క్షేమమేనా? అని అడిగేవారు.

ఆశ్వయుజ పౌర్ణమి నుంచి నిత్యం ఈశ్వరాజ్ఞతో అన్నం స్వీకరించేవారు. ఆహారం తక్కువ కాకపోయినా నెలదాకా శరీరం కృశిస్తూనే ఉంది. నెల గడిచే సరికి ద్రవపదార్థం కూడా లోపలికి వెళ్లడం ఆగిపోయింది. చర్మం కప్పిన అస్థిపంజరంలా అయ్యారు. కానీ వారిలోని దివ్య తేజస్సు మాత్రం తగ్గలేదు. ఆ సమయంలో కూడా తన కాలిని ఎలా ఉంచుకోవాలి. చేతులని ఎలా చాచుకోవాలి. అనే విషయాలని జగత్ప్రభువు చెప్పినట్టే చేసేవారు. మందు కూడా తీసుకోవడం మానేశారు. తన మరణ సమయం ఆసన్నమైందని ఆయనకు స్ఫురించింది.

కానీ, మర్నాటి రాత్రి ఆయన బాగా కోలుకున్నారు.

"నాయనా! భగవాన్ నే చక్కర్ పీఛే ఘుమాయా (భగవానుడు చక్రాన్ని వెనక్కి తిప్పాడు)" అని హిందీలో ఉత్సాహంగా చెప్పారు.

ఆయన మరణానికి మూడు రోజుల ముందు తనకి వేసిన రబ్బరు పరుపులను తొలగించి చాప వేయమని చెప్పి దాని మీద పడుకున్నారు. దశమి రాత్రి గడచి ఏకాదశి ఉదయానికి వ్యాధి ప్రబలి ఆయాసం పెరగసాగింది. ఏకాదశి మూడవ ఝాము వచ్చే సరికి ఆయన శరీరంలో మంటలు, పోట్లు వ్యాపించాయి. భక్తులంతా చేరి, నామ జపం చేయసాగారు.

"ఒక చెవిలో పదిమంది బలశాలురు మొనలుదేలిన గడ్డపారలతో ఒకేచోట వేసే పోటులా ఉంది నా బాధ. ప్రతి రోమకూపాన ఎంతో బాధ కలుగుతోంది"



స్వామివారు చెప్పారు. క్రమంగా సూర్యాస్తమయం అయింది. ఆయనకి రాధాకృష్ణులు తన దగ్గరకు వచ్చిన భావన కలిగి, బాధ కొంత ఉపశమించింది.

1960వ సంవత్సరం, ఆగస్టు నెల, పదవ తేదీ, శ్రావణమాసం, చవితి, బుధవారం రోజున శ్రీ స్వామివారు సిద్ధిపొందారు. వారికి స్నానం చేయించి నుదుట గంధం బొట్టు పెట్టి, కాషాయ వస్త్రాలు కట్టి నామ భజనలు చేయసాగారు. ఆయన ముఖంలోని తేజస్సు నమ్మలేనంత దివ్య కళతో ప్రకాశించింది. పంచమి, గురువారం నాడు ఆయన భౌతిక కాయాన్ని సమాధిలో ఉంచి మూతమూశారు. సమాధి మీద పాలరాతితో తాపడం చేశారు.

సర్వం శ్రీ భావానంద రాధాకృష్ణ చరణారవిందార్పణమస్తు

❖ ❖ ❖

# పవిత్ర పుణ్యధామమ్...
# శ్రీపాండురంగాశ్రమమ్

అదొక అవతార పురుషుడు నివసించిన పరమ పవిత్రమైన తపోవనం. స్వయంగా శ్రీరాధాకృష్ణులు దివి నుండి భువికి దిగివచ్చి దివ్యమైన, భవ్యమైన అపురూపమైన మాధుర్య సౌందర్య లీలలు నెరపినప్పుడు, వారి పాదపద్మాలతో నడయాడిన పవిత్ర పుణ్యప్రదమైన ఒక తీర్థస్థానం. శ్రీసీతారామలక్ష్మణులు తమ పరివార సమేతంగా నివసించిన మహిమాన్విత ప్రదేశం. కాకులు దూరని కారడవిలో నివసిస్తున్న భగవద్భక్తులను రక్షించుటయే తమ కర్తవ్యంగా భావించే వీర ప్రతాపవంతుడైన మారుతి ఒకవైపున, చండ ప్రచండ దోర్దండ బలపరాక్రమ సంపన్నుడైన గరుత్మంతుడు మరొకవైపున, ఆయుధములను ధరించి రక్షణ కవచంగా నిలచిన దివ్యభూమి. శ్రీకృష్ణ భగవానుడు స్వయంగా ధరించే సుదర్శన చక్రరాజము ఘన పరాక్రమముతో గిరగిర తిరుగుతూ మిరుమిట్లు గొలిపే తేజస్సును విరజిమ్మెడు అద్భుతమైన ప్రాంగణమది. మీరే కాదు, మేము కూడా మాచ్చి, మా బిడ్డడు నివసించే ధామమును మరింత దివ్యమయంగా మార్చి, నా భక్తుని చూడవచ్చిన జనుల కోర్కెలను తీర్చెదమని, నన్ను ఇక్కడ 'భవానీదేవి' అనే పేరుతో పిలవాలని ప్రత్యేకంగా సూచించి తమ లీలలు విస్తరింపజేసిన భవానీ రామలింగేశ్వరు లకు నిలయంగా మారిన భగవంతుని సన్నిధానం. నీలమేఘ శ్యాముడు, అరవింద దళాయతాక్షుడైన శ్రీకృష్ణ భగవానుడు పాండురంగని మూర్తిగా ప్రభవించి భక్తివత్సలుడై నిలిచి దయామయురాలైన అనపాయని యగు రుక్మిణీదేవి సమేతుడై తన అంశతో అవతరించిన బిడ్డడు, అచ్చమైన భక్తుడు నిర్మించిన భావానంద నిలయమైన ఆలయంలో కొలువుదీరి ప్రసన్నవద నులై, తమను చేరవచ్చిన భక్తులను చిరు మందహాస వదనార

విందములతో దర్శనమొసగి సంసారంలో విసిగి వేసారి తమ సన్నిధానంలో నిలిచిన ఆశ్రిత భక్తజనకోటి సాటిలేని, నిరుపమాన మైన దివ్య, భవ్యమైన భావానందమును ప్రసాదించెడు పరమాద్భుత ప్రదేశమది. అదొక పరమ పుణ్యప్రద మైన భావానంద ధామం- అదే శ్రీ పాండు రంగాశ్రమం.

తెలంగాణ రాష్ట్రంలోని మెదకు జిల్లా గజవెల్లి తాలూకా మొలుగు మండలంలోని మరుకూకు గ్రామం లో అప్పాల వంశమునకు చెందిన ఒక ఉత్తమ బ్రాహ్మణ కుటుంబం ఉన్నది. ఆ వంశానికి చెందిన వారందరూ వైదిక ధర్మనిష్ఠాగరిష్ఠులు, సదాచార సంపన్నులు, భగవద్భక్తులు. అందులో శంభయ్య, రత్నమ్మ ఆదర్శ దంపతులకు విష్ణ్వంశ సంభూతుడైన ఒక బాలుడు 1899 అక్టోబర్‌లో జన్మించాడు. అతనికి సత్యనారాయణ అని తల్లిదండ్రులు పేరు పెట్టారు. కాని, ఇంటిలోని పెద్దలు, ఇరుగు పొరుగువారు 'నారాయణ' అని పిలిచేవారు. ఆ బాలుడు నిరంతరం ఒంటరిగా కళ్ళు మూసుకుని కూర్చునేవాడు. ఎల్లప్పుడు భగవద్భావంలో లీనమై ఉండేవాడు. పూవు పుట్టగనే పరమళించునన్నట్లుగా పిన్న వయసులోనే భక్తి వైరాగ్య భావాలతో, నిరాడంబరంగా, వినయ విధేయతలతో, క్రమశిక్షణాయుతంగా ఉండేవాడు. పెద్దవాడైన నారాయణ గారిని ఊరిలోని వారు పంచాంగం చూడమని, గ్రహచారం చెప్పమని అడిగినప్పుడు, తమకున్న సమస్యలను, బాధలను చెప్పినప్పుడు అందుకు బదులుగా నారాయణగారు చక్కని పరిష్కారాలు చూపేవాడట. వారి నోటివెంట వచ్చిన మాట ప్రకారంగా జరిగి తీరేదట. దానితో గ్రామ ప్రజలందరూ నారాయణగారు మామూలు మనిషి కాదు, ఆయన ఒక గొప్ప మహాత్ముడు అని పరస్పరంగా చెప్పుకునేవారు. అందుకే కాబోలు, గోలోకనాథుడగు శ్రీకృష్ణభగవానుడు ఈ ప్రాంతాన్ని ఉద్ధరించడానికై మెదకు జిల్లాలోని మరుకూకు గ్రామంలో మనుజ రూపమున అవతరించి తన మరుగు రూపమును నిజ జనులు గుర్తించుటకేమో అన్నట్లు తన విశాలమైన సుందర వక్షఃస్థలపు వామ భాగమున శ్రీవత్స చిహ్నమును కలిగి, నారాయణుడను పేర అప్పాల వంశమునందు అవతరించాడు. అయినా భగవదవతారములను గ్రహించుట

మిక్కిలి దుర్లభము. అది పరిచ్ఛిన్నమగు జగత్తునందు అపరిచ్ఛిన్నమగు బ్రహ్మము యొక్క లీల అందుకే బాదరాయణులు తమ బ్రహ్మసూత్రంలో అంటారు. 'లోకవత్తు లీలా కైవల్యమ్'.

## జ్ఞానదీప్తుల్ని నింపిన 'నారాయణు'డు

ఆనాటి గ్రామీణ ప్రజానీకాన్ని చూసి నారాయణగారు చాలా బాధపడేవారు. అవి నైజాము రాజులు పరిపాలిస్తున్న రోజులు. గ్రామ పెద్దలు, నవాబులు, జమీందార్లు ప్రజలను వెట్టిచాకిరీ చేయించుకుం టున్న దుర్దినాలు. నిరంకుశు లగు పెద్దల హుకుముల కింద నలిగి పోతున్న పేద ప్రజలను చూసి నారాయణగారు గుండెలు అవిసేలా ఏడ్చేవారట. ఉత్తమ సంస్కారం అడుగంటిపోయి, చదువు సంధ్యలు లేక కటిక దరిద్రంలో అల్లల్లాడుతూ వెట్టిచాకిరిలతో, పట్టెడన్నం కోసం పొలా లలో కూలినాలి పనులు చేస్తున్న అమాయక ప్రజలను చూసి వారు ఎంతగానో విలవిలలాడి పోయేవారట. అమూల్యమైన మానవ జీవితపు విలువలు తెలియక అజ్ఞానంలో మగ్గిపోతున్న ప్రజలను సముద్ధరించుటకై నడుము కట్టవలసిన తరుణం ఆసన్నమైనదని 19 యేళ్ళ ప్రాయం నుండే వారు తరచుగా ప్రజలను ఉద్దేశించి– "నీకు ఉన్నదంతా ఈశ్వరునిదే అని భావించి, రేపటికై ఉంచుకొనక, లేనివారికి, పేద ప్రజలకు దయాభావంతో పంచి పెట్టు. నీ కొరకై చింతించకు" అని ఉద్బోధించేవారు.

ఈశ్వరునియందు విశ్వాసం కలిగి, నిరంతరం భగవన్నా మాన్ని స్మరిస్తూ, లజ్జ, బిడియాన్ని విడిచిపెట్టి గొంతెత్తి బిగ్గరగా, ప్రేమతో భజన చేయాలని, సంతోషంతో నూతనోత్సాహంగా జీవించాలని, తోటివారిని ప్రేమభావంతో చూడాలని, భూత దయను కలిగి ఉండాలని నిరంతరం ఉపదేశించేవారు. ప్రతి వ్యక్తిని దగ్గరగా పిలిచి ఆప్యాయంగా పలకరించేవారు. ఈవిధంగా గ్రామంలోని ప్రజలను ప్రేమతో దగ్గరికి చేరదీసి, చక్కని హితోపదేశం చేస్తుండడం వల్ల అమాయకులైన పల్లె ప్రజలు ఆత్మీయంగా నారాయణగారి వద్దకు రావడం మొద లైంది. నెమ్మదిగా వారు జానపదులను ఆకర్షించగలిగే నృత్యభజనకు శ్రీకారం చుట్టి, వారిని చేరదీసి భగవద్విశ్వాసాన్ని కల్పించి సనాతన ధర్మ

ప్రచారం చేయడం, చక్కని మన భారతీయ సంస్కారాలను నేర్పటం ప్రారంభించారు. నారాయణ గారు ప్రతిరోజు సాయంత్రం మెడలో తంబూరను ధరించి చేతిలో చిరతలు పట్టుకునొ కాళ్ళకు చిరుగజ్జెలు కట్టుకుని, శ్రావ్యమైన కమ్మని గొంతులో చక్కగా నృత్యం చేస్తూ భగవన్నామ భజన చేసేవారు. మధ్యమధ్యలో అమూల్య మానవ జీవితాన్ని గూర్చి, జీవిత లక్ష్యాన్ని దాని సాధన తీరుతెన్నులను గూర్చి భక్తి, జ్ఞాన కర్మలను గూర్చి, భగవల్లీలలను గూర్చి చక్కగా విడమర్చి ప్రబోధించేవారు. భగవద్భజనలో పరవశులై తన్మయం గా నృత్యం సలుపుతున్న నారాయణ గారిని చూస్తూ, గ్రామం లోని ఆబాలగోపాలం ఆనందంతో తమ ఉనికిని మరచిపోయి అట్లే చూస్తూ కూర్చుండిపోయేవారట. ఒక్కొక్కసారి తామెంత˘సేపు కూరున్నామని గానీ, వారెంతసేపు నృత్యభజన చేసేవారని గానీ తలంచకుండా, తలంపుకు రాకుండా తెల్లవారిపోయేదట. ఈవిధంగా అప్పాల నారాయణగారు సంస్కారహీనులై నిజాం పాలనలో వెట్టిచాకిరికి లోనై స్వతంత్రమంటే ఏమిటో తెలియని ప్రజలను తన ఉపదేశంతో తట్టిలేపారు. వారి తేనెలొలుకు తీయని మాటల ద్వారా జాడ్యానికి గురైన ప్రజల బుద్ధులను ప్రచోదనము చేసేవారు. ఇదొక గొప్ప ఉద్యమంగా రూపుదిద్దు కున్నది. సుమారుగా 1922-23 నుండి 1932-33 వరకు మెదక్, రంగారెడ్డి, నల్లగొండ, హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో గల అనేక గ్రామాలకు ఈ భక్తి ఉద్యమం వ్యాపించి పోయింది. అప్పట్లో నారాయణగారిని ఒక మహాత్మునిగా, ఒక భక్తునిగా, ఒక దైవాంశ సంభూతునిగా, ఒక అవతార పురుషునిగా, ఒక ఆధ్యాత్మవేత్తగా, ఒక నవయుగ వైతాళికునిగా ఆనాటి పండితులు, పామరులు, కవులు, శాస్త్రవేత్తలు, వేద పండితులు, జమీందారులు, సామాన్య ప్రజలందరూ గుర్తించి ఒక గురువుగా భావించి శ్రద్ధాభక్తులతో వారిని పూజించేవారు, ఆరాధించేవారు. అప్పటినుండి వారిని 'నారాయణ బాబా' అని పిలవడం ప్రారంభించారు.

ఇరవయ్యవ శతాబ్దపు తొలి రోజులలో గల మహాపురుష లలో అప్పాల నారాయణగారి (శ్రీశ్రీశ్రీ యతివర భావానంద భారతీ భగవత్పాదుల) స్థానము మహోన్నతమైనది. వారు నిర్వ్యాజ ప్రేమకు సజీవమూర్తులు. అఖండ వైరాగ్య

సంపన్నులు. మహాత్యాగశీలురు, భావనా బలసంపన్నులు, దీనజన బాంధవులు, సాక్షాత్తూ శ్రీ మహావిష్ణ్వంశసంభూతులై, లోకోద్ధారమునకు మాత్రమే అవతరించిన మహనీయమూర్తులు. ఇట్టి మహాత్ముని జీవితము వలన ఇంతవరకు ఎందరో జీవులు ఉద్ధరింపబడ్డారు. ఇకముందు కూడా ఉద్ధరింపబడతారనడం అతిశయోక్తి కాదు.

## నిర్జనారణ్యంలో 'శ్రీపాండురంగాశ్రమమ్'

ప్రజలందరి అంతులేని ఆదరాభిమానములను చూరగొని వారి కీర్తి ప్రతిష్ఠలు పతాక స్థాయిని చేరుకోవడాన్ని చూచి సహించలేని అసూయాపరులు కొందరు తయా రయ్యారు. ఆ గ్రామంలోని కొందరు పెత్తం దారులు వీరి గొప్పతనాన్ని ఓర్వలేకపోయారు. అందులో ఒక గ్రామపెద్ద వెంటనే నారాయణగారిని భజనలు చేయడం మానుకోమని ఆజ్ఞాపించారు. "మీరు చేసే భజనల వల్ల రాత్రంతా మేల్కొని ఉండడంతో కష్టపడి పనిచేసే ప్రజలు తెల్లవారి వ్యవసాయ పనులు సరిగా చేయడం లేదు. తత్ఫలితంగా వారు సోమరులుగా మారిపోయే ప్రమాదం ఉంది. కనుక మీరు భజనలు, ఉపదేశాలు మానుకోండి! లేదా మా గ్రామాన్ని వదిలిపెట్టి పొండి" అని ఆయన చండశాసనం చేశారు.

'ఉదార చరితానాంతు వసుధైక కుటుంబకమ్'– అన్నట్లుగా అఖండ వైరాగ్య సంపన్నులైన నారాయణగారు అంతా భగవంతుని ఇచ్ఛయని తలచి వెంటనే మరుకూకు గ్రామాన్ని విడిచి వెళ్ళడానికి నిశ్చయించుకున్నారు. ఇంకేముంది! 1933 డిసెంబర్‌లో జనారణ్యాన్ని వదిలిపెట్టి నిర్జనారణ్య ప్రదేశాన్ని చేరారు. మర్కూకు గ్రామానికి దక్షిణ దిశగా దాదాపు ఐదు కి.మీ. దూరంలో ఆ ఊరి పొలిమేరలో ఈశ్వరాజ్ఞగా ఒక చోటును ఎంచుకొని అక్కడ నివసించాలనుకున్నారు. వెంటనే వారి వెనకాల వచ్చిన కొందరు భక్తులు, శిష్యులు రాళ్ళురప్పలతో నిండి ఆ ప్రదేశాన్ని కొంత చదును చేసి చొప్ప కట్టలతో తాత్కాలికంగా గుడిసెలు వేశారు. ఒక గుడిసెలో అంతకు పూర్వమే తాము పండరీపురం నుంచి తెచ్చిన శ్రీ రుక్మిణీ పాండురంగస్వామి విగ్రహాలను ఒక వేదికపై నిలిపి పూజ, భజనలను ప్రారంభించారు. వేరే గుడిసెలలో తమ

భార్యాబిడ్డలతో నివాసమేర్పరచుకున్నారు. ఆ గుడిసెల స్థలమునకు 'శ్రీపాండురంగాశ్రమమ్' అని పేరు పెట్టారు. అయితే అప్పాల నారాయణగారి పట్ల అత్యంత గౌరవాభిమానాలు కలిగిన మర్కూకు గ్రామ వాస్తవ్యులొకరు వారి నివాసానికి రెండు ఎకరాల భూమిని దానంగా ఇచ్చారు. ఆ స్థలంలోనే నారాయణగారు స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. కొద్ది రోజులకు పక్కా గుడిసెలు నిర్మించుకున్నారు. ఆ తర్వాత కొంతకాలానికి భగవత్కృపతో ఒక నివాస భవనం నిర్మించబడింది. ఆ భవనంలోనే ముందు వరండాలో గల గదిలో శ్రీ రుక్మిణీ పాండురంగస్వామి మూర్తులను నిలిపారు. కానీ, అక్కడే స్థిర ప్రతిష్ఠ చేస్తే బాగుంటుంది కదా అని కొందరు సూచించగా, భగవదాజ్ఞ లేదు, ఇప్పుడే కాదు అని చర ప్రతిష్ఠగా నిలిపారు.

## ఏటా ఆషాఢి ఉత్సవాలు

ఇక్కడ ప్రతియేటా ఆషాఢ మాసంలో వచ్చే తొలి ఏకాదశి సందర్భంగా ఆషాఢి ఉత్సవా లను మూడు రోజుల పరిమితితో జరుగు తాయి. ఆ ఆషాఢి ఉత్సవాలను నారాయణ గారు జులై 1932లోనే మొట్టమొదటి సారిగా మర్కూకు గ్రామంలోనే ప్రారంభిం చారు. అడవికి చేరిన అనంతరం శ్రీపాండురంగా శ్రమంలోనే నిరంతరా యంగా ఆషాఢి ఉత్సవాలు నిర్వహిం చారు. దినదినాభివృద్ధి గాంచిన ఈ ఉత్సవాలు రంగరంగ వైభవంతో కూడిన భక్తోత్సవంగా మారిపోయి వందలాది నుండి వేలాది, లక్షలాది భక్తుల సంఖ్యకు పెరిగి పోయి నేటికి 82 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ సంవత్సరం వచ్చే తొలి ఏకాదశి సందర్భంగా 83వ ఆషాఢి ఉత్సవాలు జరుగనున్నాయి. అందుకుగాను శ్రీపాండురంగా శ్రమం కన్నుల పండుగగా ముస్తాబు అవుతోంది.

అప్పాల నారాయణగారు శాస్త్రములు నిర్దేశించిన ప్రకారంగా చతుర్విధ ఆశ్రమాలను స్వీకరించి, ధర్మబద్ధంగా, ఆదర్శవం తంగా తమ జీవన యాత్రను నిర్వహించిన మహితాత్ములని ఖచ్చితంగా చెప్పవచ్చు. 44 యేళ్ళ జీవితకాలంలోనే బ్రహ్మచర్య, గృహస్థ, వాన ప్రస్థాలనే త్రివిధ ఆశ్రమ ధర్మాలను ఆచరించిన మీదట, 44వ ఏట 1943 మే 6వ తేదీన మానవ జీవితానికి తురీయమగు

సన్న్యాస ఆశ్రమాన్ని స్వీకరించారు. నాటి నుండి శ్రీశ్రీశ్రీ భావానంద భారతీస్వామిగా లోకంలో ప్రసిద్ధినొందారు. సన్న్యాసం స్వీకరించేముందు తమ కుమారుడైన విశ్వనాథశర్మగారికి పాండురంగాశ్రమ నిర్వహణ బాధ్యతలతో పాటు తమ వారసత్వాన్ని పూర్తిగా అప్పగించారు. అప్పటి నుండి తమ తుది శ్వాస వదిలే వరకు నిరంతరం ఆశ్రమ అభివృద్ధికై ఎనలేని కృషి సల్పి తమ ఆత్మ శక్తితో ఎంతో గొప్పగా ఆశ్రమాన్ని తీర్చిదిద్దారు. సన్న్యాసం స్వీకరించాక శ్రీ స్వామివారు గజ్వేల్ వాస్తవ్యులు, శతావధానియైన విఠాల చంద్రమౌళి శాస్త్రి, రామాజిపేట నివాసులు రుక్మాభట్ల విధుమౌళి శాస్త్రి, మాసాయిపేట వాస్తవ్యులగు కాసుల రామచంద్రయ్య, మగ్రిముచ్చాలకు చెందిన గౌరీభట్ల నరసింహస్వామి ఇంకా ఎందరెందరో పండితులు, కళాకారులు, విద్వాంసులు, భక్తులు, శిష్యులు మున్నగువారి సహకారంతో మెదక్, రంగారెడ్డి, నల్లగొండ, వరంగల్ జిల్లాల్లోని వందలాది గ్రామాలను పర్యటించి సనాతన ధర్మాన్ని, భగవద్భక్తిని, భగవన్నామ స్మరణ, భజనలను గూర్చి ఒక ఉద్యమంగా ప్రచారం చేస్తూ, తమ ఆధ్యాత్మిక ప్రవచనాలతో, ఉత్తమ సంస్కారవంతులుగా తీర్చిదిద్దడానికై ఎనలేని కృషిసల్పారు. నామస్మరణ, నామ జపాలను ధ్యానపూర్వకంగా చేయడం ద్వారా సులభంగా సమాధి స్థితిని పొందుటయే గాక, భగవంతుని సాక్షాత్కారమును కూడా పొందవచ్చునని తమదైన సులభశైలిలో ఉపదేశించి శిక్షణ కూడా ఇచ్చారు. ఈనాటి మధ్య తెలంగాణ ప్రాంతంలో గల ప్రజలందరిలో ఆధ్యాత్మిక భక్తిభావాలకు ఉత్తమ సంస్కారాలకు అన్నింటికీ మూలమైన బీజావాపనము చేసిన మహనీయులు భావానంద స్వామివారేనని ఘంటాపథంగా చెప్పవచ్చు.

## పాండురంగని ఆదేశంతో ఆలయ నిర్మాణం

1953లో ఒకనాటి పవిత్ర సమయంలో శ్రీ స్వామివారికి స్వప్నంలో గోలోకవాసియైన శ్రీకృష్ణ భగవానుడు, యశోదమ్మ ఇద్దరూ వచ్చి ఇప్పుడు ఆశ్రమంలో మనక దర్శనమిచ్చే దేవాలయ నిర్మాణానికిగాను ముగ్గుపోస్తూ దర్శనమిచ్చారు. ఇదేమిటి? ఇక్కడ ముగ్గుపోస్తున్నారెందుకు? అని స్వామివారు ప్రశ్నించగా అందుకు బదులుగా ఇదిగో నాయనా! ఇక్కడ 16 స్తంభాలతో

కూడిన మంటపంతో దేవాలయాన్ని నిర్మించాలి. వేరే నిర్మాణాలు ఏమీ చేయవద్దు. ఇదిగో! ఇదే ఆలయ నిర్మాణ ప్రణాళిక అని వివరించి చెప్పి అదృశ్యులయ్యారట. తెల్లవారి స్వామివారు వెంటనే విశ్వనాథశర్మను, ఈశ్వరుని పిలిపించి తనకు కలిగిన అనుభవాన్ని వివరించి చెప్పి ఆలయ నిర్మాణానికి సన్నాహాలు ప్రారంభించారు. విజయ నామ భాద్రపద బహుళ షష్ఠి (తేదీ 28.9.1953) రోజున ఆలయ నిర్మాణానికి శంఖుస్థాపన చేయబడింది. ఇంకేముంది భగవంతుని ప్రేరణలో నేనంటే నేనంటూ పనులు చేయడానికి పనివారలు వచ్చి తమవంతు సేవను సమర్పించి ధన్యులం కావాలనే తపనతో నిర్మాణం పనులలో పిలవకుండానే కూలీలు, మేస్త్రీలు వచ్చి చేరారట. ఆలయమంతా రాతి కట్టడంతో 16 స్తంభాలతో కూడిన మంటపం, మూడు ఆలయాల విభాగంతో దేవాలయ నిర్మాణం పనంతా కేవలం 246 దినములలో పూర్తిచేయబడినది. విగ్రహ ప్రతిష్ఠాపనమునకు సమయం రానే వచ్చింది. స్వామివారు నిర్ణయించిన ముహూర్తం ప్రకారంగా ఇదే జయ నామ సంవత్సరం ఆషాఢ శుద్ధ దశమి (తేదీ 10.7.1954న) దేవాలయ మధ్య భాగంలో అంతకుముందు నుండే పూజలందుకుంటున్న శ్రీరుక్మిణీ పాండురంగస్వామి వారి మూర్తులు శ్రీ భావానందస్వామివారి కరకమలాలతో ప్రతిష్ఠాపనం చేయబడ్డాయి. ఈ ఆలయానికి ప్రతిష్ఠాపనం చేయబడినవి. ఈ ఆలయానికి ఎడమ ప్రక్కన జైపూర్ నుండి తెప్పించిన శ్రీ సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. కుడి ప్రక్కన గల ఆలయంలో శివ పంచాయతనం ప్రతిష్ఠింపబడింది. ఆశ్రమ ప్రాంగణానికి రక్షన కవచంగా నిలబడి కాపలా కాసిన హనుమ స్వయంగా శ్రీ స్వామివారి వద్దకు వచ్చి తన బాల మారుతి రూపంతో లీలలు దర్శింప చేశారు. అందువలన ఆశ్రమానికి వాయవ్య దిశలో అశ్వత్థ వృక్షం క్రింద బాలవీర ప్రతాప మారుతి అను పేరుతో క్షేత్రపాలకునిగా ఆంజనేయస్వామిని ప్రతిష్ఠించినారు. అనంతర కాలంలో శ్రీ భవానీదేవి విశ్వనాథ గురుదేవుల కరకమలాలతో ప్రతిష్ఠింపబడింది. జులై 1954 నుండి పాండురంగశ్రమానికి విచ్చేయ భక్తుల కోర్కెలను నేరవేర్చుటకు గాను భక్తవత్సలుడు, ఆశ్రితదీన జనోద్ధారకుడు అయిన శ్రీ రుక్మిణీ పాండురంగస్వామి

వారు నిత్యపూజలను విశేష ఉత్సవాల పూజలను అందుకొంటూ దేవాలయంలో కొలువుదీరియున్నారు. ఆ స్వామివారి మహిమలు వివిధ రకాలైన భక్త జనులకు కలిగిన అద్భుతమైన అనుభవాలు వర్ణింపనలవిగానివి. ఆర్తులు, అర్థార్తులు, జిజ్ఞాసువులు, ముముక్షువులు ఇంకా అనేకానేక తెరలుగా తమ దర్శనార్థంగా వస్తున్న ఆశ్రిత భక్తజనావళికి చిరుచిరు మందహాస వదనారవిందములతో, అవ్యాజమైన ప్రేమ భరిత వాత్సల్య ప్రపూరిత కరుణామయ దృక్కులతో, చూడముచ్చట గొలిపే అలంకారాలతో, ఎంతసేపు చూసినా తనివి తీరని రూపలావణ్యంతో కన్నుల పండువగా దర్శనమొసగే శ్రీ స్వామివారిని దర్శించిన వెంటనే భక్తుల హృదయాలు చల్లబడి చక్కని ప్రశాంత ఆనంద నిలయాలుగా మారిపోగలవు. అటులే వారి హృదయ సదనా లలో గాఢమైన తమ ముద్రలతో హత్తుకొని నిలిచిపోయే శ్రీ రుక్మిణీ పాండురంగస్వామి వారి లీలలు, నామ, రూప, గుణ విశేషాలను గూర్చి ఎంత చెప్పినా తనివి తీరనిది. ఏమని వర్ణించినా మాటలకు అందనిది.

## రుక్మిణీ పాండురంగ
## ఆలయ షష్టిపూర్తి మహోత్సవాలు

నీవు నారాయణుని వెదక చూచెదవా? నరునియందే వెదకుము. ఏ ఇతర వస్తువునందు కన్నా నరుని యందు వాని దివ్యత్వము ఎక్కువగా వ్యక్తమగుచుండును. ఎవ్వని మానస సరోవరము భగవత్ప్రేమామృతంతో వెల్లివిరుస్తుందో, ఎవడు భగవంతుని యందు నెలకొని వానియందే చరించుచు రమించు చుండునో, ఎవడు భగవత్ప్రేమోన్మత్తుడై యొప్పు చుండునో, అట్టివానిని వెదకుము. ఆతడే భగవత్స్వరూపుడు అని శ్రీరామకృష్ణ పరమహంసగారి ముఖోక్తి. భావమే బలమని చెప్పి, ఆచరించి చూపి, భావవశ్య భగవాన్ అన్నట్లుగా భగవంతుడు భావవశుడు, ఇంకనూ 'భావగ్రాహీ జనార్దనః' అని చెప్పబడిన శాస్త్ర వాక్యాలను నిజంగా నిరూపించి చూపిన అవతార వరిష్ఠులు, విష్ణ్వంశ సంభూతులైన శ్రీ భావానంద స్వామివారి సంకల్పబలంతో నిర్మింపబడిన పాండురంగాశ్రమ ప్రాంగణంలోని దేవాలయంలో శ్రీ రుక్మిణీ

పాండురంగస్వామివారు ప్రతిష్ఠింపబడి ఇప్పటికి అరవై వసంతాలు గడిచాయి. గత 1954 జూలై నాటి శ్రీ జయ నామ సంవత్సరం గిర్రున కాల చక్రంలో ఒక చుట్టు తిరిగి, నేటి 2014 జూలై నాటి మరల జయ నామ సంవత్సరం వచ్చేసింది. ఆషాఢ శుద్ధ దశమి నాడు విగ్రహ ప్రతిష్ఠాపనము జరిగి, అదే రోజు నుండి ప్రారంభమయ్యే ఆషాఢి ఉత్సవాలు ముచ్చటగా మూడునాళ్ళ తిరునాళ్ళగా గత 84 యేళ్ళ నుండి లక్షలాది భక్త జనుల ఆనంద సందోహాల మధ్య ఎంతో ఘనంగా జరుగుతున్నాయి.

## ఏ రోజు ఏమిటి?

ఈ ఉత్సవాలు భక్తోత్సవంగా మూడు రోజులు జరుగుతాయి. ఆషాఢ మాసంలో శుక్ల పక్షంలో వచ్చే దశమి, తొలి ఏకాదశి, ద్వాదశి తిథులలో ఈ ఉత్సవం జరుగుతుంది. దశమి నాటి మొదటి రోజున గణపతి పూజ, స్వస్తి పుణ్యహవాచనం పిమ్మట అఖండ భగవన్నామం ప్రారంభింపబడుతుంది. తదుపరి శ్రీరుక్మిణీ పాండురంగ స్వామివారి మూలమూర్తులకు మహాభిషేకం, లక్షపుష్పార్చనతో విశేష పూజ జరుగుతుంది. తీర్థ ప్రసాద వితరణతో ఉదయం శ్రీవారి సేవా కార్యక్రమం పూర్తవుతుంది. సాయంత్రం ప్రదోషపూజ, నీరాజనసేవ జరుగుతుంది. ఏకాదశినాడు భక్తులందరూ ఉపవాసవ్రతంగా ఉంటారు. ఉదయం నుండే విశేష పూజలు జరుగుతాయి. సాయంత్రం ఆధ్యాత్మిక ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీత విభావరి, నృత్య భజనలు, హరికథా కాలక్షేపం వంటి వాటితో జాగరణ సాగుతుంది. ద్వాదశి నాటి ఉదయం వంట చేసిన అన్నం రాశికి– పరబ్రహ్మ స్వరూపం పూజ జరిపి మహానివేదనం చేస్తారు. ఆ తర్వాత అఖండ అన్నదానం ఆ రోజంతా జరుగుతుంది. సాయంత్రం ప్రదోష పూజ, నీరాజనసేవ జరుగుతుంది. నాటితో ఆషాఢి ఉత్సవాలు ముగుస్తాయి. మెదకు జిల్లా చుట్టూరా ఉన్న వరంగల్, రంగారెడ్డి, నల్గొండ, హైదరాబాద్‌లలోగల వందలాది గ్రామాల నుండి వేలాది భక్తులు వస్తారు. జిల్లా రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, మంత్రులు, రాజకీయ నేతలు, వేద పండితులు, విద్వాంసులు, కవులు, కళాకారులు ఇంకా ప్రముఖులెందరో ఈ ఉత్సవాలలో పాల్గొంటారు.

వేలాది భక్తజనులు పాల్గొనే ఈ మూడు రోజులు అఖండ భగవన్నామంతో ఆ ప్రాంతమంతా మారుమ్రోగుతుంది. భక్తిభావాల పరిమళాలు గుబాళిస్తాయి. ఆధ్యాత్మిక భావ సంపదతో నిండిపోయిన అంతులేని భక్తిభావానందమును విరివిగా ప్రసాదిస్తుంది. శ్రీశ్రీశ్రీ యతివర భావానంద భారతీ భగవత్పాదుల దివ్యమైన హస్తములతో వ్యవస్థీకరింపబడిన శ్రీ పాండురంగాశ్రమ ధామమ్.

'అనయము ప్రేమ భావానంద నిలయమౌ పాండు రంగాశ్రమ భవనమందు, బద్ధజీవుల దయతోడ నుద్ధరింప, దలచి రుక్మిణీదేవితో వెలయుమెపుడు, రాధికానాథ! మన్నాథ! రంగనాథ! పరమ కరుణాంతరంగ! శ్రీ పాండురంగ!!"

**- మదునూరి వెంకటరామశర్మ**

❖ ❖ ❖